# కరీంనగర్ వార్త



కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్నసిరిసిల్ల

శుక్రవారం 28, జులై 2023 | 16 పేజీలు


## మానేరు నదిలో చిక్కుకున్న 19మంది కార్మికులు సురక్షితం

- పెద్దపల్లి జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



16వ పేజీలో...

### ఆకాశ గంగ ఉప్పొంగి

# స్తంభించిన జనజీవనం



2 లో..

భారీ వర్షాలతో పంటలు, లోతట్టు ప్రాంతాలు నీట మునక

నిండుకుండలా మారిన జలాశయాలు

జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో రాకపోకలకు అంతరాయం

**కరీంనగర్ బ్యూరో ప్రభాతవార్త:** ఆకాశ గంగా నేలకు కొద్దిగా అలా జారితే పర్వాలేదు కానీ, భూమిపై ఉండిపోయేలా వస్తా అన్నట్లుగా, గత 5 రోజులుగా కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. ఉదయం, పగలు, రాత్రి అనే తేడా లేకుండా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో లోతట్టు ప్రాంతాలు, రోడ్లు, పంటలు నీట మునిగాయి. కరీంనగర్ జిల్లాలోని 16 మండలాల్లో వర్షం నిరంతరాయగా కురుస్తుండటంతో ప్రజలు, రైతుల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు రాబోయే 24 గంటలు వర్షాలు ఉన్నాయని వాతావరణ శాఖ తెలిపింది. బుధవారం ఉదయం నుండి గురువారం ఉదయం వరకు జిల్లాలో నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి. ఇల్లందకుంట మండలంలో 38.24 సెంటిమీటర్ల అత్యధిక వర్షపాతం నమోదు కాగా, కరీంనగర్ అర్బన్ మండలంలో 14.24 సెంటిమీటర్ల తక్కువ వర్షపాతం నమోదైందనీ వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు.

### ముచ్చటగా మూడోసారి

# రోడ్డుకు గండి

శాశ్వత చర్యలు ఏవి..?



2 లో..

**మల్యాల, ప్రభాత వార్త:** భారీ వర్షాలు, వరదల మూలంగా మల్యాల మండల కేంద్రంలో గల బస్టాండ్ నుండి బైపాస్ రోడ్డుకు వెళ్ళే దారిలో గల రోడ్డును ముచ్చటగా మూడోసారి గండి కొట్టడమైంది. గత రెండేళ్ళ క్రితం భారీ వర్షాల కారణంగా మల్యాల చెరువు మత్తడి దూకి జగ్గని ఒర్రె తో పాటు రావి చెరువు వరద నీటి ప్రవాహంతో పోచమ్మ వాడ జలదిగ్బంధం కాగా అప్పుడు బస్టాండ్ నుండి వెళ్ళే రోడ్డును గండి కొట్టడంతో వరద నీటిని మళ్ళించారు.

### ప్రమాదస్థాయిలో చెరువులు, కుంటలు..

# పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు

యాభై ఇండ్లు నేలమట్టం..

పోలీస్ స్టేషన్‌లోకి నీళ్లు...

నీట మునిగిన కాలనీలు.. కలెక్టర్, ఎస్పీ, రెవెన్యూ అధికారుల సందర్శన



2వ పేజీలో...

**జమ్మికుంట (హుజురాబాద్ ఆర్సీ), ప్రభాతవార్త:** నిన్న, మొన్నటి దాక వేసవి ఎండలతో సతమతమైన జనం. ఒక్కసారిగా ఎడతెరపి లేకుండా ఆరు రోజులుగా కురుస్తున్న వర్షాలకు అతలాకుతలం అవడమే కాక, హుజురాబాద్ నియోజకవర్గంలోని జమ్మికుంట, హుజురాబాద్, కమాలాపూర్, ఇల్లందకుంట, వీణవంక మండలాలలో చెరువులు, కుంటలు నిండు కుండలా మారి మత్తల్లు ఎత్తిపోస్తున్నాయి. దీనితో వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. అనేక గ్రామాలలో పెంకుటిల్లు, గోడలు నాని సుమారు యాభైకి పైగా ఇండ్లు కూలీపోయాయి. కమాలాపూర్ పోలీస్‌స్టేషన్‌ను వరదనీరు చుట్టుముట్టి, స్టేషన్‌లోకి నీరు చేరుకున్నాయి.

# ఆకాశ గంగ ఉప్పొంగి స్తంభించిన జనజీవనం

మొదటి పేజీ తురువాయి..

జిల్లాలోని అన్ని మండలాల్లో 10 సెంటిమీర్లపైనే వర్షపాతం నమోదైంది. గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలతో హుజురాబాద్ నియోజకవర్గంలో ఇల్లందకుంట, హుజురాబాద్, వీణవంక, శంకరపట్నం, సైదాపూర్ అదేవిధంగా చొప్పదండి నియోజకవర్గంలోని రామడుగు, చొప్పదండి మండలాలలో అత్యధికంగా వర్షపాతం నమోదైనట్లు అధికారుల గణాంకాలు చెబుతున్నాయి. ప్రజలు గడిచిన ఐదు రోజుల నుండి కురుస్తున్న వర్షాల కారణంగా అత్యవసరం అయితే తప్ప బయటకు రాకపోవడంతో జనజీవనం స్తంభించిపోయింది. కరీంనగర్ నియోజకవర్గంలోని కొత్తపల్లి, కరీంనగర్ రూరల్, కరీంనగర్ అర్బన్ మండలల్లో కుండపోత వర్షం కురుస్తోంది. దీంతో కొత్తపల్లి చెరువు నిండుకుండలా మారి మత్తడి దూకుతుంది. వెలిచల రోడ్డు వద్ద వరద నీరు భారీగా ప్రవహిస్తుండటంతో జగిత్యాల వెళ్ళే, కరీంనగర్ వైపు వచ్చే వాహనాల రాకపోకలు స్తంభించాయి. స్మార్ట్ సిటీ కరీంనగర్ పట్టణం కాస్త నీటితో నిండిపోయింది. కరీంనగర్ పట్టణంలోని కలెక్టరేట్ రోడ్డు, రేకుర్తి, సూర్యనగర్, రాంనగర్, ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఉన్న రోడ్డు అన్ని జలమయం అయ్యాయి. ఏకంగా రోడ్లపై ఉన్న నీరు చెరువులు, కుంటలను తలపిస్తున్నాయి. కొన్ని ప్రాంతాల్లో రోడ్లపైనే కాదు ఏకంగా ఇండ్లు, షాప్‌లోకి వర్షం నీరు వచ్చి చేరుతుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వర్షం నీరు నిలవడానికి ప్రధాన కారణం డ్రైనేజీ నిర్మాణాలు, రోడ్లు అస్తవ్యస్తంగా నిర్మించడమే అని ప్రజలు చర్చించుకుంటున్నారు. కరీంనగర్ లోయర్ డ్యాంలోకి ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద, వర్షం నీరు వచ్చి చేరుతుండటంతో మానేరు జలాశయం నిండు కుండలా మారింది. అధికారులు లోతట్టు ప్రాంతాల ప్రజలకు హెచ్చరికలు జరిచేస్తూ, అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. ఎగువ ప్రాంతాల నుంచి వరదల ఉధృతి ఇలాగే మరో 24 గంటలు కొనసాగితే డ్యామ్ గేట్లు ఎత్తి నీటిని విడుదల చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. హుజురాబాద్ నియోజకవర్గంలోని జమ్మికుంట మండలంలోని లోతట్టు ప్రాంతాల్లోకి భారీగా వరద, వర్షం నీరు వచ్చి చేరింది. దీంతో జమ్మికుంట పట్టణంలోని హౌసింగ్ బోర్డు, పిట్టలవాడ కాలనీలు జలమయమయ్యాయి. ప్రమాదకర స్థాయిలోకి చెరువులు, కుంటల్లోకి నీరు చేరడం ఒక వైపు అయితే మరో వైపు వాగులు రోడ్లపై నుండి ప్రవహించడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. వీణవంక మండలంలోని మామిడలపల్లి గ్రామంలో ఇండ్లలోకి వరద నీరు వచ్చి చేరింది. అదేవిధంగా పోతిరెడ్డిపల్లిలో పంటలు నీట మునిగిపోయాయి. హుజురాబాద్ పట్టణంలోని పలు కాలనీల్లో వర్షం నీరు భారీగా వచ్చి చేరి, రోడ్డు చెరువులను తలపిస్తున్నాయి. చేల్పూర్ నుండి బొత్తపల్లి వెళ్ళే రహదారిపై వరద నీరు మునిగాయి. ఇళ్ళందకుంట మండలంలో అత్యధిక వర్షపాతం నమోదైంది. పలు గ్రామాలు జలమయమయ్యాయి. అత్యధిక శాతం గ్రామాల్లో పంటలు



నీట మునిగిపోయాయి. సైదాపూర్‌లో కురిసిన వర్షం కారణంగా ప్రధాన రహదారులపైకి నీరు రావటంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మనకొండురు నియోజకవర్గం వర్ష తీవ్రత ఎక్కువగానే ఉంది, తిమ్మాపూర్, మనకొండురు, చిగురుమామిడి, గన్నేరువరం మండలాల్లోని వాగులు, చెరువులు, కుంటలు పొంగి పొర్లుతున్నాయి. అంతేకాకుండా లోతట్టు ప్రాంతాల్లోని పంటలు నీట మునిగి రైతులకు నష్టం వాటిల్లింది. కొన్ని గ్రామాల మధ్య రాకపోకలు స్తంభించాయి. చొప్పదండి నియోజకవర్గంలోని గంగాధర, చొప్పదండి, రామడుగు మండలాల్లో వర్షం కారణంగా చెరువులు, కుంటలు నిండి, పొంగు పొర్లుతున్నాయి. రామడుగు వెలిచాల మధ్య రోడ్డుపై నుండి వరద నీరు ప్రవహిస్తుండటంతో రాకపోకలకు పాక్షికంగా అంతరాయం ఏర్పడింది. నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో పంటలు, లోతట్టు ప్రాంతాలు నీటితో నిండిపోయాయి. వాతావరణ శాఖ హెచ్చరించినట్లు రాబోయే 24 గంటలు ఇదే తరహాలో కుండపోత వర్షం ఉంటే లోతట్టు ప్రాంతాల ప్రజలు, రైతులకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యే అవకాశలు లేకపోలేదు.

**అధికారులు క్షేత్రస్థాయిలో ఉండి పర్యవేక్షించాలి: జిల్లా కలెక్టర్ బి.గోపి**

వాతావరణ శాక తెలిపిన వివరాల మేరకు రాబోయే 24 గంటల్లో కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, అధికారులు క్షేత్రస్థాయిలో ఉండి పరిస్థితులను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు సమాచారం అందించాలని, లోతట్టు ప్రాంతాలు, చెరువుల, కుంటలు, రోడ్ల నుండి వరదలు ప్రవేశించే చోట్లలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని, లోతట్ట ప్రాంతాల్లో నివసించే వారిని వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలించడంతో పాటు వారికి భోజన ఏర్పాట్లను చెయ్యాలని, చెరువులు, కెనాల్ నీటిమట్టాన్ని ఎప్పటికప్పుడు సంబంధిత అధికారులు పరిశీలించాలి. అత్యవసరం అయితే తప్ప ప్రజలు భారీ వర్షంలో బయటకు రాకూడదు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచించారు.

# ప్రమాదస్థాయిలో చెరువులు, కుంటలు.. పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు

మొదటి పేజీ తురువాయి..

ఉప్పల్ విద్యుత్ సబ్‌స్టేషన్‌లోకి వరదనీరు వచ్చి చేరింది. చెల్పూర్, సిర్సపల్లి, కందుగుల, ధర్మారాజ్‌పల్లి, జమ్మికుంట, కోరపల్లి, మల్యాల, ఇల్లందకుంట, నర్సింగపూర్, కొత్తపల్లి ప్రాంతాలలో జిల్లాలోనే అత్యధిక వర్షపాతం నమోదు కావడం, ఈ ప్రాంతాలలో వందలాది ఎకరాల నాట్లు వేసిన పొలాలు నీట మునగడంతో రైతులు తీవ్ర ఆవేదనలకు గురవుతున్నారు.

చెల్పూర్ రెండు చెరువులు మత్తల్లు పడుతుండడంతో, జమ్మికుంట నాయిని చెరువులోకి ఎడతెరపిలేకుండా క్షణక్షణానికి వరద తాకిడి పెరుగుతుంది. వర్షాలు ఇలాగే కొనసాగితే నాయినిచెరువు ఏ క్షణానైన తెగిపోయే ప్రమాదం పొంచి ఉందని పట్టణ వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెల్పూర్ పెద్దచెరువు, చిన్న చెరువు ప్రమాదపుటంచులు తాకి మత్తల్లు దూకుతుండడంతో పంట పొలాలు, చెరువులా మారిపోయాయి. కందుగుల గ్రామ తూముకుంట తెగిపోగా, ధర్మారాజుపల్లి, ఉప్పలపల్లి మధ్యన ఉన్న రహదారి తెగిపోయింది. జమ్మికుంట పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీ, అంబేద్కర్ కాలనీ, లోతట్టు ప్రాంతాలలోని ఇండ్లలోకి ఒక్కసారిగా వరద నీరు రావడంతో 150 కుటుంబాలకుపైగా, నిరాశ్రయులు అయినారు. జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ తక్కల్లపల్లి రాజేశ్వర్ రావు, వైస్ చైర్మన్ దేశిని స్వప్నకోటిల ఆధ్వర్యంలో సుమారు 500మందిని పట్టణంలోని సువర్ణ పంక్షన్ హాల్‌లోకి తరలించి, వారికి భోజన వసతులు కల్పిస్తున్నారు. ఇండ్లలోకి నీరు ప్రవేశించి ఇండ్లలో ఉన్న ఆహార పదార్థాలతో పాటు సర్వం 150 కుటుంబాలు కూలీపోయాయి. రెండు కోట్ల రూపాయల మేర ఆస్తినష్టం ఉంటుందని రెవెన్యూ అధికారులు అంచనాలు వేస్తున్నారు. హుజురాబాద్ జూపాక గ్రామానికి వరద నీరు పొంగి పొర్లుతుండడంతో పూర్తిగా రాకపోకలు నిలిచిపోయాయి.

**నీట మునిగిన ప్రాంతాలను సందర్శించిన జిల్లా కలెక్టర్ గోపి, సిపి సుబ్బారాయుడు:** ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు నీట మునిగిన ప్రాంతాలను గురువారం మధ్యాహ్నం జిల్లా కలెక్టర్ బి గోపి, సిపి సుబ్బారాయుడు, ట్రైనీ కలెక్టర్ లెనిన్ వత్సవ్ టోప్పో, రెవెన్యూ సిబ్బంది హుజురాబాద్ మండలం చెల్పూర్ రెండు చెరువులు, జమ్మికుంట పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీ, అంబేద్కర్ కాలనీ, నాయినిచెరువు, ఇల్లందకుంట ప్రాంతం మల్యాల గ్రామాలను అధికారులు సందర్శించారు. ముంపు గల కారణాలను స్థానిక ప్రజలను అడిగి తెలుసుకున్నారు. హౌసింగ్‌బోర్డు కాలనీ వాసులు జిల్లా కలెక్టర్ గోపికి, సిపి సుబ్బారాయుడికి ఐదు సంవత్సరాల కాలంలో ఇప్పటికి నాలుగు సార్లు నీట మునిగిపోయాయని హౌసింగ్‌బోర్డు కాలనీకి చెందిన నీరు ప్రవహించే కాలువలను ఆక్రమించుకుని, మున్సిపల్ నిబంధనలకు విరుద్ధంగా ఇండ్ల నిర్మాణం చేయడం వల్ల ఇరుకు కాలువ నుండి నీరు బయటకు పోగా, కాలనీలోని ఇండ్లు ముంపుకు గురవుతున్నాయని, దీనితో 1955-56 ఏపి హౌసింగ్‌బోర్డు కాలనీ మ్యాప్ పరంగా నీరు ప్రవహించే నాళాలను అధికారులు గుర్తించి అక్రమ నిర్మాణాలను తొలగించాలని కాలనీవాసులు డిమాండ్ చేసారు.

**కలెక్టర్ స్పందన...**చిన్న, పెద్ద వర్షాలకు మాటిమాటికి ముంపుకు గురవుతున్న పూర్వపు స్థితిగతులు, ప్రస్తుత ఇండ్ల నిర్మాణాలపై సమగ్ర విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని జమ్మికుంట మున్సిపల్ కమీషనర్‌ను ఆదేశించారు. హౌసింగ్‌బోర్డు కాలనీ, అంబేద్కర్ కాలనీలు వరద ముంపుకు గురికాకుండా శాశ్వత పరిష్కారం తీసుకుంటామని కాలనీవాసులకు భరోసా ఇచ్చారు. రాత్రి పునరావస కేంద్రానికి ఎంతమందిని తరలించారని, వారికి అన్నం, పానీయాలు ఏం అందించారని, రాత్రికి మళ్లీ వర్షం వస్తే, ఏం చర్యలు తీసుకుంటున్నారని కలెక్టర్ రెవెన్యూ, మున్సిపల్ అధికారులను ప్రశ్నించారు. ప్రజలు మరో రెండు రోజుల పాటు అవసరం ఉంటే తప్ప ఆరుబయటకు రావద్దని, చెరువులు, కుంటలు, బావుల వద్దకు వెళ్లవద్దని అధికారులు విజ్ఞప్తి చేసారు.

**హుజురాబాద్ డివిజన్‌లో వంద కోట్ల పై చిలుకు నష్టం..**

హుజురాబాద్ డివిజన్ పరిధిలోని ఐదు మండలాల పరిధిలో ఆరు రోజులుగా కురుస్తున్న ఎడతెరపిలేని వర్షాలకు వందలాది ఎకరాలలో వరినాట్లు, వరి నారుమళ్లు, వేలాది ఎకరాలలో పత్తి పంట మొలకలు, పునాస పంటలు నీట మునిగి రైతాంగానికి అపారనష్టం వాటిల్లింది. రోడ్లు తెగిపోవడం, కుంటలు తెగిపోవడం, ఇండ్లు కూలిపోవడం, రహదారులు, ప్రభుత్వ కార్యాలయాలు నీట మునగడం వల్ల వంద కోట్ల నష్టం ప్రాథమికంగా జరిగినట్లు రెవెన్యూ అధికారులు అంచనాలు వేస్తున్నారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ ఆర్డివో హరిసింగ్, తహసిల్దార్ కోమల్‌రెడ్డి, జమ్మికుంట తహసిల్దార్ రాజేశ్వరి, కమాలాపూర్ తహసిల్దార్ రాణి, ఇల్లందకుంట తహసిల్దార్ సురేఖ, వీణవంక తహసిల్దార్ రాజయ్య, కమీషనర్ బి శ్రీనివాస్, ఎస్సారెస్పి డిఈ రాము, హుజురాబాద్ ఎసిపి జీవన్‌రెడ్డి, సిఐలు రమేష్‌యాదవ్, రమేష్, చెల్పూర్ సర్పంచ్ నేరేళ్ల మహేందర్‌గౌడ్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, మున్సిపల్ సిబ్బంది వరద బాధితులకు సహాయక చర్యలు చేపట్టారు. భారీ వర్షాల వల్ల హుజురాబాద్ డివిజన్‌లో ఆర్టిసి బస్సులు, మధ్యాహ్నం 3గంటల వరకు తిరగలేదు.



## సింగరేణి డైరెక్టర్ల వీడియో కాన్ఫరెన్స్



**యైటింక్లయిన్‌కాలనీ, ప్రభాతవార్త** సింగరేణి డైరెక్టర్ ఆపరేషన్స్ ఎన్‌వికె శ్రీనివాస్, డైరెక్టర్ ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్ జి.వెంకటేశ్వర్ రెడ్డి అన్ని ఏరియాల జిఎంలతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కార్పొరేట్ స్థాయి జిఎంలు, ఆర్జీ 2 ఏరియా నుంచి ఏరియా జిఎం ఎ.మనోహర్ ఈ వీడియో కాన్ఫరెన్స్ పాల్గొన్నారు. అధిక ర్షాల వల్ల నదులలో, ప్రస్తుత వర్షపు నీటి ప్రవాహం, నల్లాలు, ట్యాంకులు, గనుల చుట్టూ లోతట్టు ప్రాంతాలు, ఓపెన్ కాస్టు గనులలో నీటి లాంగింగ్, పంపింగ్ స్థితి, బోర్‌వెల్స్ ప్రస్తుత పరిస్థితి, క్వారీలు, ఆనకట్టలు, ఉపరితగల గనుల కాలువలు, కట్టలు, కల్వర్టులు, గనుల డ్రెయిన్‌ల స్థితి, ఓపెన్ కాస్టు గనుల చుట్టూ మళ్లించిన కాలువలు, గనుల పరిసరాల్లోని ఆనకట్టలు, రిజర్వాయర్లలోకి నీటి ప్రవాహం స్థితి, ముంపు ప్రమాదం నుంచి ముందు జాగ్రత్త చర్యలు అన్ని ఏరియాల జిఎంల నుంచి వివరాలను అడిగి తెలుసుకొని తగు జాగ్రత్తలు, సూచనలు చేశారు. ఆర్జీ 2 నుంచి ఓసిపి 3 ప్రాజెక్ట్ అధికారి మధుసూదన్, వకీలుపల్లి ప్రాజెక్ట్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, ఏరియా రక్షణాధికారి బి.రవీందర్, ఓసిపి 3 సర్వే అధికారి నర్సింగ రావు, గ్రూప్ ఇంజనీర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## ఔత్సాహికులకు పరిశ్రమలను త్వరగా ఏర్పాటు చేసి ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకోవాలి

**- అదనపు కలెక్టర్ శ్యాం ప్రసాద్ లాల్**



**పెద్దపల్లి జిల్లా బ్యూరో, ప్రభాతవార్త:** జిల్లాలో ఉన్న ఔత్సాహికులు త్వరగా పరిశ్రమలు స్థాపించి యువతకు ఉపాధి కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ శ్యాం ప్రసాద్ లాల్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో అదనపు కలెక్టర్ శ్యాం ప్రసాద్ లాల్ జిల్లా పరిశ్రమల ప్రమోషన్ కమిటీ, జిల్లా స్థాయి మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించి, పరిశ్రమల స్థాపన, టిఎస్ఐ పాస్, టి ప్రైడ్ పై సంబంధిత అధికారులతో సమీక్షించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో టిఎస్ ఐ పాస్ విధానం అమలవుతున్న తీరును ఆరా తీశారు. జిల్లాలో పరిశ్రమల అనుమతుల దరఖాస్తులను సకాలంలో జారీ చేయాలని అదనపుకలెక్టర్ అధికారులకు స్పష్టం చేశారు. జిల్లాలో టి ప్రైడ్ పథకం కింద నూతనంగా ఏర్పాటు చేసిన ఇద్దరు ఎస్సీ, ఎస్టీ సేవా రంగ యూనిట్లకు 7.19 లక్షల పెట్టుబడి సబ్సిడీ, 2 సేవా రంగ యూనిట్లకు 49వేల 700 వడ్డీ సబ్సిడీ అదనపు కలెక్టర్ మంజూరు చేయడం జరిగిందని అన్నారు. ఈ సమావేశంలో జిఎం పరిశ్రమల శాఖ మధుసూదన చారి, లీడ్ బ్యాంక్ మెనేజర్ వెంకటేష్, ఈడి ఎస్సీ కార్పొరేషన్ మధుసూదన్ శర్మ, ఆర్‌టిఓ రంగారావు, ఇతర శాఖల జిల్లా అధికారులు తదితరులున్నారు.

## ముచ్చటగా మూడోసారి రోడ్డుకు గండి

మొదటి పేజీ తురువాయి..

తదుపరి శాశ్వత చర్యలు చేపట్టకుండానే కాలయాపన చేయడం, ప్రజల నుండి విమర్శలు రావడంతో తాత్కాలికంగా మరమ్మత్తు చేసినప్పటికి రెండవ సారి కూడా గత ఏడాది కూడా వరద నీటి ఉధృతికి గండి కొట్టారు. అయితే గ్రామపంచాయతీ నిధులతో 6 నెలల క్రితం మళ్ళీ రోడ్డుపై పైపులతో మరమ్మత్తు చేపట్టినప్పటికి ఈసారి వర్షాలకు మళ్ళీ వరద ఉధృతి ఎక్కువ కావడంతో రోడ్డును ముచ్చటగా మూడోసారి గండి కొట్టడంతో ఈ మార్గం మళ్ళీ మూతపడింది. చెరువు నీళ్ళతో పాటు వరద నీటి ప్రవాహం కు ఇంజనీరింగ్ అధికారులు సరైనా ప్రణాళిక లేకపోవడం వలన మాటిమాటికి రోడ్డు గండి కొట్టే దుస్థితి ఏర్పడుతుందని, పనులు చేపట్టినప్పటికి ప్రజాధనం దుర్వినియోగం అవుతుందని, ఈ రోడ్డుపై శాశ్వతంగా బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలన్న ఆలోచన లేకపోవడం విచాకరమని మల్యాల మండలం బిజెపి అధ్యక్షులు నేరెళ్ళ శ్రవణ్ కుమార్ విమర్శించారు. ప్రతిసారి ఈ దుస్థితి నెలకొనడం ప్రజాధనం వృధా కావడం కాకుండా, ప్రజలకు అవస్థలు అవుతున్న సంగతి అధికారులు గ్రహించాలని ఆయన అన్నారు. ఇప్పటికైనా శాశ్వతమైన ప్రణాళికతో చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.



# ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షం

**-నిలిచిపోయిన వాహనాలు...ఆగిన రాకపోకలు**

**-ఇళ్ళల్లోకి చేరిన వరదనీటితో భయందోళనలో ప్రజలు**

మెట్‌పల్లి - ప్రభాతవార్త :



గత కొన్ని రోజుల నుండి రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. కాగా గురువారం ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షానికి మెట్‌పల్లి డివిజన్ కేంద్రంలోని మెట్‌పల్లి, మల్లాపూర్, ఇబ్రహీంపట్నం మండల కేంద్రాలతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో చెరువులు, కుంటలు నిండి మత్తడితో ప్రవహించాయి. కొన్ని గ్రామాల్లో రోడ్లపైకి మత్తడి ప్రవహించగా రోడ్లు కోతకు గురి కాగా కొన్ని చోట్ల వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. మెట్‌పల్లి మున్సిపాలిటి పరిధిలోని కొన్ని వార్డులలో కురిసిన భారీ వర్షానికి వరద నీరు కాలనీలలో చెరువును తలపించాయి. అలాగే ఇళ్ళల్లోకి వరద నీరు చేరడంతో ఇళ్ళన్ని మురికి నీరుతో నిండగా ఇంట్లో వస్తువులన్ని తడవగా నీటితో వచ్చే కీటకాలతో, పాములతో ప్రజలు భయందోళనకు గురయ్యారు. పట్టణానికి చెందిన బాలకిషన్‌నగర్, చైతన్యనగర్, సుల్తాన్‌పుర, డిడి నగర్, టీచర్స్ కాలనీ, రబ్బానీపుర, లోతట్టు ప్రాంతాలు కల్గిన కాలనీలు వరద నీటితో నిండి ప్రవహించే కాలువను తలపించి ఇళ్ళల్లోకి మురికి నీరు చేరగా పట్టణ శివారులోని రేగుంట చెరువు నిండి ప్రవాహిస్తుండడంతో చెరువు కట్ట తెగిపోయి ప్రవాహిస్తుందనే భయంతో ప్రజలు భయందోళనకు గురవుతున్నారు. పట్టణ శివారులోని చెరువు వర్షపు నీటితో నిండి మత్తడితో చెరువు దాటి రహదారిపై పొంగి ప్రవాహిస్తుంది. అలాగే మహాలక్ష్మి ఆలయం సమీపంలోని వట్టి వాగు, మారుతి నగర్ సమీప బ్రిడ్జి వాగు వర్షపు నీటి ప్రవాహంతో నిండి పొంగి పోర్లుతూ ప్రవాహిస్తున్నాయి. అలాగే పట్టణంలోని వెంపేట రోడ్డులోని రైల్వే బ్రిడ్జి కింద వరదనీరు వాహనాల టైర్లు మునిగేలా ప్రవాహిస్తుండగా వాహనాదారులకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో పలు కాలనీలలో విద్యుత్ స్థంబాలు రోడ్డుకు జరిపోగా, సిసి రోడ్లు, రహదారులు దెబ్బతిన్నాయి. కాగా ఇట్టి పరిస్థితుల్లో ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని అవసరమైతే తప్ప బయటకు రావద్దని ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు ప్రజలకు సూచించారు. అలాగే వరద నీటితో నిండిన లోతట్టు ప్రాంతాలను మున్సిపల్ చైర్‌పర్సన్ రాణవేని సుజాత సత్యనారాయణ మున్సిపల్ అధికారులతో కలిసి పరిశీలించి వరద నీటిని తాత్కాలిక కాలువలు ఏర్పాటు చేసి తొలగించాలని మున్సిపల్ సిబ్బందికి సూచించారు. వకాగా ఎమ్మెల్యే తనయుడు, బిజెపి, కాంగ్రెస్ పార్టీల ముఖ్య నాయకులు పట్టణంలోని పలు వార్డులను సందర్శించి పలు సహాయక చర్యలు చేపట్టారు.

### మెట్‌పల్లి మండలంలో...

కురుస్తున్న భారీ వర్షాలకు మెట్‌పల్లి మండలంలోని పలుచోట్ల గురువారం రాకపోకలు నిలిచిపోయాయి. మెట్‌పల్లి మండలంలోని ఆత్మకూర్, ఆత్మనగర్ మధ్య కల్వర్టు పై నుండి వరదనీరు ప్రవాహిస్తుండడంతో వాహనాల, గ్రామస్థుల రాకపోకలు నిలిచిపోయాయి. అలాగే రంగారావుపేట శివారులోని కల్వర్టు వద్ద వరద నీరుతో రోడ్డు కోతకు గురవడంతో రంగారావపేట, మెట్‌పల్లికి మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. అలాగే మేడిపల్లి గ్రామంలో ప్రధానరహదారిపై వరద నీరు ఉధృతంగా ప్రవాహిస్తుండడంతో మెట్‌పల్లి, ఆర్మూర్‌ల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. కాగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అవసరమైతే తప్ప ఇళ్ళ నుండి బయటకు రావద్దని అధికారులు సూచించారు.

### ఇబ్రహీంపట్నంలో..

గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ఇబ్రహీంపట్నం మండల కేంద్రంతో పాటు ఇబ్రహీంపట్నం మండలంలోని పలు గ్రామాల్లో చెరువులు, కాలువలు మత్తడితో రోడ్డు, బ్రిడ్జి దాటి ప్రవాహిస్తున్నాయి. ఇట్టి మత్తడితో వరద నీరు ప్రవాహించడంతో ఆయా గ్రామాల్లోని చెరువుల వద్ద రోడ్లు కోతకు గురవుతుండగా వాహనాల రాకపోకలు, గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. సంబంధితాధికారులు సమీప చెరువులకు, గోదావరి నదుల సమీపానికి ప్రజలను వెళ్ళవద్దని హెచ్చరికలు జారీ చేశారు. అలాగే మత్స్యకారులు ఎవరూ చేపల వేటకు వెళ్ళవద్దని గోదావరి నదుల్లో, చెరువుల్లో, కుంటల్లో నీరు పోటెత్తి ప్రవాహిస్తుండడంతో ప్రమాదానికి గురి కావద్దని సూచించారు. అలాగే వీస్తున్న ఈదురుగాలులకు రోడ్ల పక్కన చెట్లు విరిగి రోడ్లపై పడగా వాహనాలు అక్కడికక్కడే నిలవగా గ్రామపంచాయితీ అధ్వర్యంలో పలు సహాయక చర్యలు చేపట్టారు. అవసరమైతే తప్ప ప్రజలు బయటకు వెళ్ళవద్దని అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రజలకు సూచించారు.

### మల్లాపూర్‌లో..

గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ఇబ్రహీంపట్నం మండల కేంద్రంతో పాటు మల్లాపూర్ మండలంలోని పలు గ్రామాల్లో చెరువులు, కాలువలు మత్తడితో రోడ్డు, బ్రిడ్జి దాటి ప్రవాహిస్తున్నాయి. ఇట్టి మత్తడితో వరద నీరు ప్రవాహించడంతో ఆయా గ్రామాల్లోని చెరువుల వద్ద రోడ్లు కోతకు గురవుతుండగా వాహనాల రాకపోకలు, గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. సంబంధితాధికారులు సమీప చెరువులకు, గోదావరి నదుల సమీపానికి ప్రజలను వెళ్ళవద్దని హెచ్చరికలు జారీ చేశారు. అలాగే మత్స్యకారులు ఎవరూ చేపల వేటకు వెళ్ళవద్దని గోదావరి నదుల్లో, చెరువుల్లో, కుంటల్లో నీరు పోటెత్తి ప్రవాహిస్తుండడంతో ప్రమాదానికి గురి కావద్దని సూచించారు. అలాగే వీస్తున్న ఈదురుగాలులకు రోడ్ల పక్కన చెట్లు విరిగి రోడ్లపై పడగా వాహనాలు అక్కడికక్కడే నిలవగా గ్రామపంచాయితీ అధ్వర్యంలో పలు సహాయక చర్యలు చేపట్టారు. అవసరమైతే తప్ప ప్రజలు బయటకు వెళ్ళవద్దని అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రజలకు సూచించారు.

## అధికారులను అప్రమత్తం చేసిన ఎమ్మెల్యే

మెట్‌పల్లి రూరల్ - ప్రభాతవార్త :



కురుస్తున్న భారీ వర్షాలతో ఎగువ ప్రాంతంలో రాళ్ళవాగు వరద ప్రవాహం జగ్గాసాగర్ మానువురి వద్ద గేట్లను అత్యవసరంగా తెరిపించడానికి కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు విద్యుత్ అధికారులను అప్రమత్తం చేయడం వల్ల పెనుముప్పు తప్పింది. వివరాళ్ళోకి వెళితే..జగ్గాసాగర్ రూరల్ ఫీడర్ ద్వారా మానువురి వాగు వరద కాలువలో కలిసే చోట ఏర్పాటు చేసిన గేట్లకు విద్యుత్ సరఫరా జరుగుతుంది.. అయితే సంబంధితా ఫీడర్ బ్రేక్‌డౌన్ మూలంగా క్లిష్ట పరిస్థితులు ఏర్పడ్డాయి. జగ్గాసాగర్ గ్రామ సర్పంచ్ ఎమ్మెల్యేకు ఇచ్చిన సమాచారం మేరకు వెంటనే ఎమ్మెల్యే విద్యుత్ అధికారులను అప్రమత్తం చేశారు. అప్పటికే భారీవరద ప్రవాహంతో వరద కాలువ నిండు కుండలా మారి పంటపొలాలను మారి పంటపొలాలను ముంచెత్తే పరిస్థితి నెలకొంది. మొత్తం విద్యుత్ సిబ్బంది భారీ వర్షాన్ని కూడా లెక్కచేయకుండా లైన్‌లో ఏర్పడ్డ లోపాన్ని గుర్తించి సరిచేయగా కరెంట్ ఆరగంటలో పునరుద్దరణ జరిగి వరద కాలువ గేట్‌లు తెరుచుకున్నాయి. భారీ వరదను కింద వాగులోకి పంపడం వలన ఆత్మనగర్, రామలచ్చక్కపేట్ గ్రామాల పంట పొలాలకు ముంపు తప్పింది. కాగా సత్వరమే స్పందించిన ఏడిఈ మనోహర్, ఏఈ నవీన్, సిబ్బందిని ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు అభినందించారు.


## ఇబ్బందులు పడుతున్న ప్రజలకు అధికారులు అండగా నిలవాలి

**- బిఆర్ఎస్ రామగుండం ఆశావాహులు**

గోదావరిఖని, ప్రభాతవార్త.

రామగుండం కార్పొరేషన్ 3, 22, 33 డివిజన్‌లలో వరదల వలన ఇబ్బందులు పడుతున్న ప్రజలకు అధికారులు అండగా నిలవాలని బిఆర్ఎస్ రామగుండం ఆశావాహులు కందుల సంధ్యారాణి, మిర్యాల రాజిరెడ్డి, పాతపల్లి ఎల్లయ్య యాదవ్, కొంకటి లక్ష్మినారాయణ, బయ్యపు మనోహర్ రెడ్డి అన్నారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ వర్షాకాలం రావడానికి ముందు చేపట్టాల్సిన చర్యలు కాలువలు సీల్ట్ తీయడం కానీ, కాలువల మరమ్మత్తులు సకాలంలో చేయకపోవడం అధికారుల నిర్లక్ష్య ధోరణికి, కార్పొరేషన్‌లో చాలా డివిజన్లలో ఇలాంటి పరిస్థితులు నెలకొన్నాయని అన్నారు. గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు జలదిగ్బంధంలో చిక్కుకున్న ఆటో నగర్, మోబిన్ నగర్ కాలనీ ప్రజలకు బిఆర్ఎస్ పార్టీ, తెలంగాణ ప్రభుత్వం అండగా ఉంటుందని అన్నారు. బి థర్మల్ యాజమాన్యం తప్పిదం వల్లనే ఇంతటి గోరం జరిగిందని అన్నారు. యాష్ ప్లాంట్ కాంట్రాక్టర్ అతని స్వార్థ ప్రయోజనాలకు అధిక లాభాలను అర్జించడానికి, నిబంధనలకు విరుద్ధంగా యాష్ తీసుకెళ్లడం వలన ఈ పరిస్థితి తలెత్తిందని అన్నారు. అధికారుల పర్యవేక్షణ లేకుండా యాష్ ప్లాంట్‌లోని బూడిదను తరలించడం వల్ల ప్రజలు ఇండ్ల కాళీ చేసి పునరావాస ప్రాంతానికి తరలివెళ్లాల్సిన పరిస్థితి ఆటోనగర్, మోబిన్ నగర్‌లలో ఏర్పడిందని అన్నారు. ప్రజలకు జరిగిన నష ఆటలపై కలెక్టర్ విచారణ జరిపి సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని అన్నారు. బాధిత కుటుంబాలకు బిఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని అన్నారు.

# నేరాలు-దారుణాలు



## పాము కాటుతో మహిళ మృతి

చందుర్తి, ప్రభాతవార్త.



చందుర్తి మండలం మల్యాల గ్రామానికి చెందిన సిదార్ల దేవవ్వ (60) అనే మహిళ పాము కాటుతో బుధవారం రాత్రి మృతి చెందింది. దేవవ్వ ఇంటి వద్ద రాత్రి పడుకోగా, పాము కాటు వేసింది. దేవవ్వ పామును గమనించకపోవడంతో రెండవ సారి పాము కాటు వేయడంతో రక్తస్రావం జరగడంతో వేములవాడ ఆసుపత్రికి తరలించగా, మార్గం మధ్యలో మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. దేవవ్వ భర్త గత పది సంవత్సరాల క్రితం మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు.

## ప్రజలు అకాల వర్షాలకు అధైర్యపడవద్దు

**- ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ పాడి కౌశిక్ రెడ్డి**

వీణవంక, ప్రభాత వార్త:

భారీ వర్షాలకు ఇండ్లు కూలిపోయిన, పంటలు నీటమునిగిన ప్రజలు అధైర్యపడవద్దని ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ పాడి కౌశిక్ రెడ్డి సూచించారు. మండల కేంద్రంలోని వాగు అతి భారీ వర్షానికి ఉధృతంగా పారుతున్న సందర్భంగా ఆ ప్రాంతాన్ని, మండల కేంద్రంలోని మురుగు నీటి కాలువల వెడల్పు చేసే ప్రాంతాలను ఆయన గురువారం స్వయంగా పరిశీలించారు. మండలంలోని పలు ప్రాంతాల్లో నీట మునిగిన ప్రాంతాలను సందర్శించారు. ఆయా శాఖల అధికారులతో మాట్లాడారు. ఎక్కడ ఏ చిన్న సమస్య వచ్చిన వెంటనే నా దృష్టికి తీసుకురావాలని తెలిపారు. తాను అందుబాటులో ఉంటానని తెలిపారు. చెరువులు, కుంటలు దగ్గరికి వెళ్ళకూడదని, విద్యుత్ స్తంభాలను ముట్టుకోవద్దని, అత్యవసరం అయితేనే బయటకు రావాలని సూచించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు వర్షాభావ పరిస్థితులతో ఇబ్బందులు పడుతున్న వారికి సహాయం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట వీణవంక సర్పంచ్ నీల కుమారస్వామి, వైస్ ఎంపిపి రాయిశెట్టి లత శ్రీనివాస్, నాయకులు గొడుగు రాజు, క్రాంతి, తాళ్ళపల్లి మహేష్, యాసిన్ తదితరులు పాల్గొన్నారు.

## భారీ వర్షాలతో అతలాకుతలమైన ప్రజానీకం

**-పట్టించుకొని అధికారులు, మున్సిపల్ పాలకవర్గం**

**-బిజెవైఎం రాష్ట్రకార్యవర్గ సభ్యుడు దొనికెల నవీన్**

మెట్‌పల్లి అర్బన్ - ప్రభాతవార్త :



కురుస్తున్న భారీ వర్షాలకు మెట్‌పల్లి పట్టణంలోని డ్రైనేజి వ్యవస్థ సిసి రోడ్ల నిర్మాణం లేకపోవడం కారణంగా డ్రైనేజీ నీరు ఇళ్ళల్లోకి వచ్చి ప్రజలు ఇబ్బంది పడుతుంటే మున్సిపల్ అధికార యంత్రాంగం ముందుచూపు లేకుండా నిర్లక్ష్యం వహించడం, మున్సిపల్ పాలకవర్గం పట్టించుకోకపోవడం సిగ్గుచేటని బిజెవైఎం రాష్ట్రకార్యవర్గ సభ్యుడు దొనికెల నవీన్ తెలిపారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ పట్టణంలోని అనేక వార్డుల్లో చెరువులను తలపిస్తున్న మున్సిపల్ కమీషనర్, పాలకవర్గం మొద్దు నిద్రలో ఉన్నారాని ఆగ్రహం వ్యక్తం చేశారు. భారీ వర్షాల కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతుంటే కనీసం మున్సిపల్ యంత్రాంగం హెల్ప్ లైన్ నెంబర్ కూడా ప్రకటించకపోవడం సహాయక చర్యలు తీసుకోకపోవడం దురదృష్టకరమని మండిపడ్డారు. మున్సిపల్ అధికారులు అవినీతి అక్రమాలలో కమీషన్ల కక్కుర్తి తప్ప ప్రజా సమస్యలను గాలికి వదిలి దున్నపోతు మీద నీళ్ళు చల్లినట్లుగా వ్యహరిస్తున్నారాని తెలిపారు. తక్షణమే హెల్ప్ లైన్ నెంబర్‌ను ప్రకటించి సహాయక చర్యలు తీసుకోవాలని లేకపోతే ప్రజలు మున్సిపల్ కార్యాలయంను ముట్టడిస్తారాని హెచ్చరించారు.

## మంత్రి కెటిఆర్‌ను కలిసిన రామగుండం ఎమ్మెల్యే

గోదావరిఖని, ప్రభాతవార్త.

తెలంగాణ రాష్ట్ర ఐటి, పురపాలక శాఖ మంత్రి కెటిఆర్‌ను గురువారం హైదరాబాద్‌లో రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ కలిశారు. ఈ సందర్భంగా మంత్రికి మొక్కను అందించారు. రామగుండం కార్పొరేషన్‌కు నిధులు త్వరగా మంజూరు చేయాలని ఈ సందర్భంగా ఆయన మంత్రిని కోరారు.

# కోరుట్లలో అతి భారీ వర్షం ..జల దిగ్బంధంలో కాలనీలవాసులు

## కోరుట్లలో 128.28మి.మీ, రాయికల్‌లో 240.6మి.మీ, కథలాపూర్‌లో 165.82మి.మీ, మేడిపల్లిలో 113.8మి.మీ వర్షపాతం

కోరుట్ల, ప్రభాతవార్త



కోరుట్ల పట్టణంతో పాటూ మండలంలో బుధవారం రాత్రి నుండి గురువారం ఎడతెరపు లేకుండా కురిసిన భారీ నుండి అతి భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. కోరుట్లలో 128.28 భారీ వర్షపాతం నమోదు కాగా గతంలో ఎన్నడూ లేని విధంగా పట్టణంలోని పూల్‌వాగు ప్రమాద స్థాయిని మించి ఉధృతంగా ప్రవహించింది. పక్కనే ఉన్న నూతనంగా ఏర్పాటు చేసిన స్మశాన వాటిక సైతం నీటి మునిగిపోయింది. పట్టణ శివారులోని ముత్యాలవాడ, గోవిందగరికాలనీ, ప్రకాశంరోడ్, ఆదర్శనగర్, ఆనంద్‌నగర్, బిలాల్‌పుర, నక్కలగుట్ట కాలనీలు ప్రాంతాలు నీటమునిగాయి. మద్దుల చెరువు, తాళ్ల చెరువులు మత్తడి దూకి ప్రవహించగా ఇండ్లలోని భారీ వరద నీరు చేరుకుంది. పాలమాకుల చెరువు, చిలుక చెరువులు ప్రమాద స్థాయిలో నిండు కుండలా మారాయి. స్థానిక ప్రకాశంరోడ్‌లో 10, 11వ వార్డులో ఇండ్లలోకి మోకాళ్ల లోతులోకి నీరు రావడంతో కాగా మున్సిపల్ చైర్మెన్ అన్నం లావణ్యఅనీల్, వైస్ చైర్మెన్ గడ్డమీది పవన్‌ల ఆధ్వర్యంలో కాలనీ వాసులను జేసీబీల సహాయంతో సురక్షిత ప్రాంతాలను తరలించారు. మున్సిపల్ కమీషనర్ ఎండి.అయాజ్, సీఐ ప్రవీణ్, ఎస్సై కిరణ్‌కుమార్‌లు ఎప్పటికప్పుడు పరిస్థితులను పరిశీలిస్తు ప్రమాదాలు జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. గోవిందగిరి కాలనీ నుండి వరద నీరు జాతీయ రహదారిపై ఉధృతంగా ప్రవహించగా, జాతీయ రహదారిపై రాకపోకలు నిలిచిపోయాయి. వరదనీరు ఇండ్లలోకి ప్రకాశంరోడ్ ఏరియా ప్రాంత వాసులు భవన మొదటి అంతస్తులోకి వెళ్లి బిక్కుబిక్కుమంటు కాలం వెళ్లదీశారు. పట్టణంలో తాత్కలిక గుడిసెలు వేసుకొని కాలం వెళ్లదీస్తున్న వారి ఇండ్లలోకి నీరు చేరడంతో కట్టుబట్టతో బంధువుల ఇండ్లలోకి చేరుకున్నారు. 10, 11వ వార్డు కౌన్సిలర్లు గడ్డమీది పవన్, దాసరి రాజశేఖర్‌లు ఉదయం వరద నీటిలో కాలనీ వాసులకు పాల ప్యాకేట్లు అందజేశారు. అతి భారీ వర్షం కురవడంతో పలు బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ నాయకులు ప్రజలను పరామర్శించి, భరోసా కల్పించే ప్రయత్నం చేసి, ఆయా ఏరియాలను సందర్శించారు. అకాల వర్షాలకు పునరావాసం కోల్పోయిన వారికి కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఇంచార్జ్ జువ్వాడి నరి ్సంగరావు, సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావులు భోజన సదుపాయం ఏర్పాటు చేశారు. పట్టణంలోని గాంధీరోడ్ ప్రాంతంలో బాతుకూరి విజేత (29) ఇంట్లో బాత్‌రూం గోడ కూలి తనపై పడడంతో అపస్మారక స్థితికి చేరుకోగా ఆస ్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు తెలిపారు. మహిళ కుటుంబ సభ్యులను బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సంజయ్‌కుమార్, మున్సిపల్ చైర్మెన్ అన్నం లావణ్యఅనీల్, వైస్ చైర్మెన్ గడ్డమీది పవన్, బీజేపీ రాష్ట్ర నాయకులు సురభి నవీన్‌కుమార్‌లు పరామర్శించారు.

### మండలంలో...

కోరుట్ల రూరల్ : మండలంలోని 12గ్రామాల్లో భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసాయి. మండలంలోని మోహన్‌రావుపేట్ జాతీయ రహదారిపై భారీగా వరద నీరు రావడంలో వాహనాలకు అంతరాయం కలుగగా, చిన్నమెట్‌పల్లి గ్రామంలోని ఇళ్లలోకి నీరు చేరడంతో బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీశారు. మండలంలోని యూసుఫ్‌నగర్ నుండి అయిలాపూర్ గ్రామం వచ్చే రోడ్డు ధ్వంసం అయ్యింది. అయిలాపూర్ నుండి ధర్మారం వెళ్లే మార్గం పెద్ద వాగు వంతెనపై నుండి ప్రవహించింది. మండలంలోని కల్లూర్ గ్రామం నుండి రాయికల్‌కు వెళ్లే కల్లూర్ వాగు వంతెన వాగు పారడంతో రాకపోకలు అంతరాయం కలిగింది. మిగిలిన గ్రామాల్లో సైతం వరద నీరు ఇళ్లలోకి చేరడంతో భయంభయంగా కాలం గడిపారు.

### కథలాపూర్‌లో...

కథలాపూర్ : మండలంలోని 19గ్రామాలుండగా 165.82మి.మీటర్ల భారీ వర్షపాతం నమోదయ్యింది. మండలంలోని తుర్తి కొచ్చెరు భారీ వరద నీరు చేరడంతో చెరువుకు గండి పడి వ్యవసాయ భూములన్నీ జలమయ్యాయి. మండలంలోని తాండ్రియాల, గంబీర్‌పూర్‌లు చెరువు నిండు కుండలా మారగా, సిరికొండ గ్రామంలోని చెరువు పూర్తిగా నిండగా ప్రధాన రహదారిపై నుండి ప్రవహించి, రాకపోకలకు అంతరాయం కలిగింది. మండలంలోని రాజలింగంపేట్ గ్రామానికి చెందిన ఓ గర్భిణీ స్త్రీని డెలవరీ నిమిత్తం అంబులెన్స్‌లో తరలించే క్రమంలో సిరికొండ రహదారిపై ప్రవహిస్తున్న వరదలో చిక్కుకోగా, అధికారులు, గ్రామ సర్పంచ్ గాండ్ల వీణస్వామిలు, ఉప సర్పంచ్ కొడిపెల్లి రవీందర్‌రెడ్డిలు అప్రమత్తమై గ్రామ యువకులు సహాయంతో ట్రాక్టర్‌తో అంబులెన్స్ వరద నీటి నుండి తప్పించారు. భారీ వర్షాల నేపథ్యంలో మండలంలోని అన్ని గ్రామాల్లోకి చెరువు నిండగా, వాటిని కథలాపూర్ ఎస్సై కిరణ్‌కుమార్‌గౌడ్ సందర్శించి, అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి సమస్యలున్నా ఫోన్ ద్వారా సమాచారం అందించాలని సూచించారు.

### రాయికల్‌లో...

రాయికల్ : మండలంలోని అన్ని గ్రామాలతో పాటూ మండల కేంద్రంలో 240.6మి.మీటర్ల అతిభారీ వర్షపాతం నమోదయ్యింది. పట్టణంలోని భీమన్నవాడ, మత్తడివాడలు జల దిగ ్భందంలో చిక్కుకోగా అధికారులు వారిని పునరావస కేంద్రాలకు తరలించారు. వీరాపూర్ చెరువు వరద నీరు రోడ్డుపైకి రాగా రహదారి మూసుకపోయింది. మండలంలోని కొత్తపేట్ వాగు ఉధృతంగా ప్రవహించడంతో పక్కనే శ్రీరాజరాజేశ్వర నాగాలయంలోకి వరద నీరు చేరింది. రాయికల్ నుండి కోరుట్లకు వచ్చే మైతాపూర్‌రోడ్ పైనుండి నీరు ప్రవహించగా రాకపోకలు నిలిచిపోయాయి. పట్టణంలోని మాదిగకుంట, పెద్ద చెరువులు మత్తడిలు దూకడంతో రాయికల్ మొత్తం జలదిగ్భందంలో చిక్కుపోయింది. ఎప్పటికప్పుడు అధికారులు పర్యవేక్షించడంలో ఎలాంటి ప్రమాదం జరగలేదు.

# మత్తడి దూకుతున్న చెరువులు... ఇండ్లలోకి చేరుతున్న వరద నీరు

**- పంట పొలాలు, రోడ్లన్ని జలమయం**

**-వరద నీటితో గ్రామాలకు రాకపోకలు నిలిపివేత**

మల్యాల, ప్రభాత వార్త:





నిరంతరం దంచికొడుతున్న భారీ వర్షాల మూలంగా మల్యాల మండలంలో చెరువులు, కుంటలు నిండిపోయాయి. మండలంలో 53 చెరువులు, కుంటలు ఉండగా అన్ని పూర్తిస్థాయిలో నిండిపోయి అలుగు పారుతున్నా యి. వర్షాల మూలంగా మండలంలో 8 మంది ఇండ్లు కూలిపోయాయి. గురువారం మల్యాల చెరువు అలుగుపారి జగ్గని ఒర్రె పూర్తిస్థాయిలో నుండి ప్రవహించింది. రావి చెరువు నుండి వరద దీనికి తోడు కావడంతో పోచమ్మ వాడ జలదిగ్బంధమైంది. దీంతో బైపాస్ రోడ్డు రాకపోకలు నిలిపివేయగా పోచమ్మ వాడ, ఎస్‌సి కాలనీ వెనుక వైపు వరద నీరు పలువురి ఇండ్లలోకి చేరింది. ఆయా ప్రాంతాలను స్థానిక సర్పంచ్ మిట్టపల్లి సుదర్శన్ వెళ్ళి పరిశీలించి బాధితులకు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఓబులాపూర్ లో కుమ్మరికుంట పాక్షికంగా గండిపడడంతో సమీప ఇండ్లలోకి వరద నీరు ప్రవహించింది. వెంటనే స్థానిక యువకులు బాధిత కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. నూకపల్లి లో కూడా వరదనీరు మర్రి చెరువు సమీపంలో 10 ఇండ్లలోకి చేరింది. మల్యాల తహశీల్దార్ సుజాత, ఎస్‌ఐ అశోక్ వెళ్ళి ముంపుకు గురికాకుండా సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని ప్రజలను కోరారు. ముత్యంపేట, తాళ్ళవాయికుంట అలుగుపారి రోడ్డుపై ప్రవహించింది. దీంతో రాకపోకలు నిలిచిపోయాయి. నూకపల్లి, రామన్నపేట, రాంపూర్ వెళ్ళేదారి వరద ప్రవాహంలో మునిగిపోయింది. దీంతో ఈ మార్గంలో రాకపోకలు నిలిపివేశారు. నూకపల్లి, రామన్నపేట వరద కాలువ బ్రిడ్జీ పై నుండి నీటి ప్రవాహం వల్ల రోడ్లన్ని జలమయమయ్యాయి. ఇదిలా ఉండగా వానకాలం పంటలకు సమాహిత్తమైన రైతులు ఇటివలే వరి నారు వేసే పనిలో ఉండగా భారీ వర్షాల మూలంగా వేసిన నారు వరద నీటిపాలైంది. అంతేకాకుండా రోడ్డు మార్గాలు పంట పొలాలు, చెరువులుగా తలపించాయి. వర్షాల మూలంగా వేసిన నారుతో పాటు పొలాల నీట మునిగిపోయి తీవ్ర నష్టం వాటిల్లినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా మండల వ్యాప్తంగా చెరువులు, కుంటలు పూర్తిస్థాయిలో నిండుకుండలా మారిపోగా ఎప్పుడు ఏ క్షణాన గండ్లు పడతాయో అని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే అనేక చోట్ల వరద నీటితో పొలాల నుండి రోడ్లపైకి ఆపై ఇండ్లలోకి వరద నీరు ప్రవహించడం రాబోయే రోజుల్లో వర్షాలు ఇలా ఉంటే తీవ్ర నష్టాన్ని ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన చెందుతున్నారు.




## వరద నీటికి కొట్టుకొచ్చిన వృద్ధురాలి మృతదేహం

గోదావరిఖని, ప్రభాతవార్త.

గత ఆరు రోజుల క్రితం ఇంటి నుంచి బయటకు వెళ్లి.. కనిపించకుండా పోయిన వృద్ధురాలు వరద నీటిలో కొట్టుకువచ్చి మృతదేహంగా కనిపిచింది. గోదావరిఖని అడ్డగుంటపల్లికి చెందిన టేకు బక్కమ్మ అనే వృద్ధురాలు గత ఆరు రోజుల క్రితం కనిపించకుండా పోయింది. ఈ క్రమంలో మార్కండేయకాలనీ నుంచి వచ్చే పెద్ద మురికి కాల్వలో వరద నీటి ద్వారా కొట్టుకువచ్చి కనిపిచింది. ఆమె ఎలా మృతి చెందిందనే వివరాలు ఇంకా తెలియలేదు.

## మండలంలో వర్ష భీభత్సం


ప్రభాతవార్త, ఇల్లందకుంటః



ఇల్లందకుంట మండలంలో బుధవారం రాత్రి కురిసిన అతి భారీ వర్షానికి రోడ్లన్ని జలమయ వడంతో పాటు విపరీతమైన నీటి ప్రవాహం ఉండడంతో వాడ వాడలలోని మురికి కాలువలలో నీరు మనుషులు కొట్టుకు పోయేం త రీతిలో ప్రవహించాయి. కొందరి ఇండ్లలోకి నీరు వచ్చి చేరడంతో ప్రజలు నానా ఇబ్బందులకు గురయ్యారు. చెరువులు, వాగులు, కుంటలు విపరీతమైన నీటి ప్రవాహంతో ఉప్పొంగుతూ కనిపించాయి. నీటి ప్రవాహనికి వరి చేనులు చెరువులను తలపించాయి. పత్తి, మిరప పంటలు పక్షికంగా దెబ్బతిన్నాయి. భారీ వర్షానికి అక్కడక్కడ కొన్ని గ్రామాలకు రాకపోకలు స్థంభించడంతో పాటు జన జీవనం అతలాకుతలమైంది. యువకులు చేపల పట్టడానికి ఉత్సాహాన్ని చూపారు. కొందరు ప్రజలు ఇంతటి భారీ వర్షాన్ని తామెప్పుడూ చూడలేదన్నారు. అధికారులు ఎప్పటికప్పుడు పరిస్థితులను గమనిస్తు ప్రజలకు అవసరమైన సమాచారాన్ని అందించడంతో పాటు అవసరమైతే తప్ప ప్రజలు బయటికి రావద్దని హెచ్చరికలు జారీ చేశారు.

## భారీ వర్షానికి రాచపల్లికి రాకపోకలు బంద్

ప్రభాతవార్త, ఇల్లందకుంటః



ఇల్లందకుంట మండలంలోని రాచపల్లి గ్రామానికి బుధవారం రాత్రి కురిసిన అతి భారీ వర్షానికి రాచపల్లికి వచ్చే దారిలో గల రెండు రోడ్ డ్యాంలు భారీ నీటితో ప్రవహించడంతో రాకపోకలు స్థంభించి పోయాయి. ఈ గ్రామానికి వచ్చే దారిలో నాగంపేట సమీపంలో గల రోడ్ డ్యాం పూర్తిగా మునిగిపోవడంతో పాటు విపరీతమైన నీటితో వాహనాలు కొట్టుకు పోయేంత ప్రవాహంతో భయానకంగా తయారైంది. ఈ రెండు రోడ్ డ్యాంలు దాటితే రాకపోకలు సాగుతాయి. అయితే దీనికి పూర్తి భాధ్యత పాలకుల నిర్లక్ష్యమేనని, గత పాలకుల నుంచి ప్రస్తుత పాలకుల వరకు ఎవరూ పట్టించుకోక పోవడంతో ఈ రెండు రోడ్ డ్యాంలకు బ్రిడ్జ్ నిర్మాణం చేయక పోవడంతో ఊరు జల దిగ్భంధంమై, రాక పోకలు స్థంభించి గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని ఆవేదన చెందుతున్నారు. ఇకనైనా బీఆర్ఎస్ నాయకులు రాచపల్లి గ్రామస్తుల ఆవేదనను అర్థం చేసుకొని ఈ రెండు రోడ్ డ్యాంలకు బ్రిడ్జ నిర్మాణ పనులు త్వరగతిన చెపట్టాలని కోరుకుంటున్నారు.

## సహాయక చర్యల్లో పాల్గొన్న మాజీ జడ్పిటిసి

ముత్తారం, ప్రభాతవార్త.

గత వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ముత్తారం మండలంలో మానేరు తీర ప్రాంతం అయిన ఓడేడు గ్రామంలోని కొన్ని ఇండ్లు వరద నీటిలో మునగగా విషయం తెలుసుకున్న మాజీ జడ్పిటిసి, కాంగ్రెస్ జిల్లా మాజీ ఉపాధ్యక్షులు చొప్పరి సదానందం గురువారం సహాయక చర్యల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముంపునకు గురైన ఇండ్ల బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. సహాయ చర్యల్లో భాగంగా బోయ రమేష్ ఇంట్లోని సామాగ్రిని, కుటుంబ సభ్యులను సురక్షితమైనప్రాంతానికి తరలించగా, సహాయక చర్యలు చేపట్టినందుకు ఈ సందర్భంగా ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు దాసరి చంద్రమౌళి, మాజీ ఉప సర్పంచ్ కొమురయ్య, నాగరాజు, రాజనర్సు, చీరాల వెంకటయ్య తదితరులున్నారు.

# జగిత్యాల వార్త

# ఇల్లు కూలిపోయిన వారిని ఆదుకుంటా

**జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్**

జగిత్యాల బ్యూరో,ప్రభాతవార్త :



జగిత్యాల పట్టణంలో భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయం కాగా లోతట్టు ప్రాంతాలను,పలు వార్డులను స్థానిక నాయకులు, అధికారులతో సందర్శించి ప్రజలతో మాట్లాడి, శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించిన ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్.అనంతరం జగిత్యాల పట్టణ 12వ వార్డులో గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు నక్క శేఖర్,ఒరుగంటి శ్రీనివాస్ ఇల్లు కూలిపోగా వారిని పరామర్శించి ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని,గృహలక్ష్మి పథకం అమలుకు కృషి చేస్తామని భరోసా ఇచ్చిన ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్.ఎమ్మెల్యే మాట్లాడుతూ వరదల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని,యువత పిల్లలు చెరువుల వద్దకు చేపల కోసం వెళ్లే సాహసం చేయవద్దని,అధికారులు పోలీస్ సిబ్బంది హెచ్చరించిన ప్రాంతాలకు వెళ్లరాదని, రెసిడెన్షియల్ పాఠశాలలో ఉన్న విద్యార్థులను తీసుకెళ్లే ప్రయత్నం తల్లిదండ్రులు చేయవద్దని కొన్ని చోట్లలో రాకపోకలకు అంతరాయం ఉందని గమనించాలని అందరికీ అవసరమైన వసతులు కల్పిస్తున్నామని అధికారులు నిరంతరం శ్రమిస్తున్నారని అన్నారు.ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు గాంధీనగర్‌లో ఇద్దరి ఇల్లు కూలిపోయాయని వారికి గృహలక్ష్మి పథకం లభించే విధంగా తన వంతుగా సహకరిస్తానని అన్నారు.తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత అన్ని చెరువులు కుంటలు కట్టలు వాగు చేసుకున్నామని అన్నారు.బీర్‌పూర్ మండలం గోదావరి పరివాహక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు.ఉదయం నుండి మున్సిపల్ సిబ్బంది, కౌన్సిలర్లు, అధికారులు, పోలీస్,రెవెన్యూ ఇలా అన్ని విభాగాలు శ్రమిస్తున్నాయని ప్రజలు సహకారం అవసరం అని అన్నారు.వెంట చైర్మన్ గోలి శ్రీనివాస్, కమిషనర్ డా.నరేష్,డిఈ రాజేశ్వర్,నాయకులు దావ సురేష్,అల్లాల దామోదర్‌రావు,బాలే శంకర్, అల్లాల ఆనంద్‌రావు, మ్యాకల పవన్,దుమాల రాజ్‌కుమార్, ఉప్పురెడ్డి,ఎక్కల్దేవి గంగారాం,డాన్ శ్రీను,క్రాంతి, శ్రీనివాస్,అహమ్మద్,యాదగిరి,జగన్,సమీర్,నక్క రాజు,గంగాధర్, రాజేష్,రమేష్ ఉన్నారు.

## దంచి కొడుతున్న వానలు

### పొంగిపొర్లుతున్న కుంటలు,వాగులు,చెరువులు

కొడిమ్యాల,ప్రభాతవార్త :

జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలంలో గత రాత్రి నుంచి కురుస్తున్న భారీ వర్షానికి చెరువులు,కుంటలు,నిండి మత్తడిలు పొంగిపొర్లుతున్నాయని,లోతట్టు ప్రాంతాలు జలమయమైనాయి.రాకపోకలు పూర్తిగా బంద్ అయినాయి.కొడిమ్యాల గ్రామానికి వెళ్లే దారిలో చిలకవాగు దగ్గర బారీగా నీటి ప్రవాహంతో కొడిమ్యాల వెళ్లాలంటే ఇబ్బందులు పడ్డారు.మండలంలోని చెప్యాల గ్రామంలోని చెరువులు మత్తడిలు పొంగడంతో రోడ్డు మీదుగా నీరు వెళ్లడంతో వేములవాడ వెళ్లే ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు.కోనాపూర్, సూరంపేట,సంద్రాల పల్లి రోడ్డు గోపాల్‌రావుపేట గ్రామాల రోడ్లు మీదుగా నీరు వెళ్లడంతో రోడ్లు తెగిపోవడం జరిగింది.లోతట్టు ప్రాంతంలో వరిపొలాలు దెబ్బతిన్నాయి.గ్రామంలో ఇళ్లలోకి వర్షపు నీరు రావడం జరిగింది.రహదారులు పూర్తిగా బంద్ అయినవి రాకపోకలు పూర్తిగా నిలిచిపోయినాయి.అత్యవసరానికి,సరుకులకు వెళ్లాలంటే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.మండల రెవెన్యూ,పోలీస్ శాఖ అధికారులు ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు ఎటువంటి సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టడం జరిగింది.

## కూలిన ఇళ్లను పరిశీలించిన ఎమ్మెల్యే

జగిత్యాల బ్యూరో,ప్రభాతవార్త :



జగిత్యాల పట్టణ 12వ వార్డులో గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు నక్క శేఖర్,ఒరుగంటి శ్రీనివాస్ ఇల్లు కూలిపోగా వారిని పరామర్శించి ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని,గృహలక్ష్మి పథకం అమలుకు కృషి చేస్తామని భరోసా ఇచ్చిన ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్.అనంతరం జగిత్యాల నుండి నిజామాబాద్ రోడ్డు గాంధీనగర్‌లో బ్రిడ్జి కింది నుండి ప్రవహిస్తున్న వరద నీటిని పరిశీలించిన ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్.వెంట నాయకులు అల్లాల దామోదర్‌రావు, బాలే శంకర్,అల్లాల ఆనంద్‌రావు,మ్యాకల పవన్,దుమాల రాజ్‌కుమార్, ఉప్పురెడ్డి,ఎక్కల్దేవి గంగారాం,డాన్ శ్రీను,క్రాంతి, శ్రీనివాస్,అహమ్మద్, యాదగిరి,జగన్,సమీర్,నక్క రాజు,గంగాధర్,రాజేష్,రమేష్,తదితరులు ఉన్నారు.

## వరద ముంపుకు గురైన ప్రాంతాల్లో పర్యటించిన డిసిసి అధ్యక్షులు

గొల్లపల్లి,ప్రభాతవార్త :



జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం బొంకూర్, వెనుగుమట్ల గ్రామాల్లో వరద ముంపుకు గురైన ప్రాంతాల్లో గురువారం రోజున జగిత్యాల జిల్లా డిసిసి అధ్యక్షులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పర్యటించి వరదకు దెబ్బతిన్న ఇళ్లను పరిశీలించారు.అనంతరం జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ భాషకు ఫోన్ చేసి అధిక వర్షాల వల్ల ఇండ్లలోకి నీరురావడంతో ఇబ్బందులు అవుతున్నాయని వివరించారు.స్పందించిన కలెక్టర్ స్థానిక గొల్లపల్లి ఎస్సై సంఘటన స్థలాలకు పంపి వివరాలను తెలుసుకుంటానన్నారు.తర్వాత డిసిసి అధ్యక్షులు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ స్థానికులతో మాట్లాడి పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు.వరదల దృష్ట్యా గ్రామస్తులకు అందుబాటులో ఉండి సహాయక చర్యలు కొనసాగించాలని స్థానిక నాయకులకు సూచించారు.ఈ కార్యక్రమంలో ధర్మారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆవుల శ్రీనివాస్,వెల్గటూర్ గ్రామ సర్పంచ్ మురళి,శ్రీకాంత్‌రావు, శ్రీనివాస్,వెంకటేష్, ఉదయ్‌గౌడ్, రాజారావు,రాకేష్,పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

### -మండలాల్లో గ్రామాల్లో వరద పరిస్థితిని పరిశీలించి, ప్రజలతో మాట్లాడిన మంత్రి కొప్పుల ఈశ్వర్

గొల్లపల్లి,ప్రభాతవార్త :



రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు.జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గ పలు గ్రామాల్లో మంత్రి కొప్పుల ఈశ్వర్ పర్యటించి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని,అధికారులు లోతట్టు ప్రాంతాల ప్రజలను తరలించాలని వారికి ఆదేశించారు.ఏవైనా సమస్యలు ఉంటే నేరుగా మాకు తెలియజేయాలని,ప్రజలకు 24 గంటలు అందుబాటులో ఉండి వనిచేస్తామని,గ్రామస్థాయి అధికారులు గ్రామాల్లో, మండల స్థాయి అధికారులు గ్రామాల్లో,మండల స్థాయి అధికారులు మండల కేంద్రాల్లో అందుబాటులో ఉండి పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలన్నారు.మండలాల్లో చెరువులు కుంటలపై ఎప్పటికప్పుడు పూర్తి సమాచారం తెలుసుకోవాలని చెరువు కట్టలపై పరిస్థితులను గమనించాలన్నారు.యువత పిల్లలు చెరువుల వద్దకు చేపల కోసం వెళ్లే సాహసం చేయ వద్దని, అధికారులు పోలీస్ సిబ్బంది హెచ్చరించిన ప్రాంతాలకు వెళ్లరాదని,రెసిడెన్షియల్ పాఠశాలలో ఉన్న విద్యార్థులను తీసుకెళ్లే ప్రయత్నం తల్లిదండ్రులు చేయవద్దని కొన్ని చోట్లలో రాకపోకలకు అంతరాయం ఉందని గమనించాలని అందరికీ అవసరమైన వసతులు కల్పిస్తున్నామని అధికారులు నిరంతరం శ్రమిస్తున్నారని అన్నారు.ప్రజలు శిథిలావస్థలో ఉన్న ఇండ్లలో ఉండవద్దని, గ్రామాల్లో వర్షాలకు కూలిన ఇండ్లను అధికారులు పరిశీలించి వివరాలు నమోదు చేయాలన్నారు.వ్యవసాయ శాఖ అధి.కారులు నీట మునిగిన పంటలపై నివేదికలు తయారుచేయాలి, గ్రామాల్లో ప్రజాప్రతి నిధులు, అధికారుల సమన్వయంతో పనిచేస్తూ ప్రజలు ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

## భారత్ సురక్ష సమితి ఆధ్వర్యంలో భారత ప్రధాని నరేంద్రమోడీకి పాలాభిషేకం

జగిత్యాల,ప్రభాతవార్త :

జగిత్యాల జిల్లా కేంద్రంలో భారత్ సురక్ష సమితి ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్రమోడీకి గురువారం పాలాభిషేకం చేశారు.పిఎం కిసాన్ సేవా కేంద్రాలు దేశంలో 1.25 లక్షలు,తెలంగాణలో నాలుగువేలు ఎరువులు,విత్తనాలు సహా అన్ని సేవలు ఒకేచోట వ్యవసాయంగానికి సంబంధించి అన్ని రకాల సేవలు ఒకే చోట లభ్యమయ్యేలా దేశవ్యాప్తంగా ప్రధాని కిసాన్ సేవా కేంద్రాలను దేశంలో ఏర్పాటు చేసిన సందర్భంగా పాలాభిషేకం చేయడం జరిగిందని తెలియజేశారు.భారత్ సురక్ష సమితి నాయకులు ఎసిఎస్ రాజు,అక్కినపెల్లి కాశీనాథం మాట్లాడుతూ దేశంలోని ఎరువుల దుకాణాలన్నింటిని కిసాన్ సేవా కేంద్రాలుగా మారుతున్నట్లు వెల్లడించారు.దేశవ్యాప్తంగా మొత్తం 2.80 లక్షల కేంద్రాలు ఏర్పాటు కానుండగా,తొలిదశలో గురువారం 1.25 లక్షల కేంద్రాలు ప్రారంభమవుతాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో నాయకులు మాజీ కౌన్సిలర్ బండారి మల్లికార్జున్,వేముల దేవరాజం,ఒడ్డపెల్లి మురళి,షీలా గంగారాం,సిరిపురం గంగారం,వనమల సత్యనారాయణ,తదితరులు పాల్గొన్నారు.

## తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**- మంత్రి కొప్పుల ఈశ్వర్**

ధర్మపురి,ప్రభాతవార్త :



గోదావరి నది వరద ప్రవాహం పెరిగినందున తీర ప్రాంత ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి సూచించారు.ధర్మపురి గోదావరి తీర ప్రాంతంతో పాటు అక్కపెల్లి చెరువును గురువారం ఆయన సందర్శించారు.సందర్భంగా అధికారులతో మంత్రి మాట్లాడుతూ తీర ప్రాంత ప్రజలందరినీ అప్రమత్తంగా చేయాలని ఆదేశించారు. నియోజకవర్గంలోని వివిధ గ్రామాలలో గల వరద బాధిత ప్రాంతాల ప్రజల్ని సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేయడం జరిగిందని పేర్కొన్నారు. సందర్భంగా మంత్రి వెంట బిఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ధర్మపురి-జగిత్యాల మధ్య నిలిచిన రాకపోకలు

ధర్మపురి,ప్రభాతవార్త :



ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల కారణంతో ధర్మపురి గోదావరి నది నీటిమట్టం అధికంగా పెరిగింది.స్థానిక సంతోషిమాత ఆలయం దాటి నదినీరు ప్రవహిస్తుండడంతో గోదావరి తీర ప్రాంత ప్రజల్ని అధికారులు అప్రమత్తం చేస్తున్నారు.వరద నీరుతోపాటు కడెం ప్రాజెక్టు నుండి వదిలిన నీటితో గోదావరి నీటి మట్టం పెరిగింది.మరింత గోదావరి నది ప్రవాహం పెరిగితే ఇండ్లలోకి నీరుచేరే ప్రభావం ఉన్న వారిని ఇండ్లు ఖాళీ చేయడానికి సిద్ధంగా ఉండాలని సూచించారు.ఇదిలా ఉండగా స్థానిక ఆక్సాయి పల్లె వద్ద ఉన్న వంతెనతో పాటు అనంతారం వద్ద ఉన్న వంతెన పైనుండి నీరు ప్రవహించడంతో ధర్మపురి,జగిత్యాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి.పోలీసులు స్థానిక గోదావరి తీరం వద్ద బారికేడ్స్ ఏర్పాటు చేసి జాగ్రత్త చర్యల్ని చేపట్టారు.

## నెహ్రూ,ఇందిరాగాంధీలకు పాలాభిషేకం

జగిత్యాల,ప్రభాతవార్త :

తెలంగాణ రైతాంగానికి చేయూతనిచ్చే జీవనాధార ప్రాజెక్టు సుమారు 20 లక్షల ఎకరాలకు సాగు,త్రాగునీరు అందించే శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నేటికి 60 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రాజెక్టు శంకుస్థాపన చేసిన మాజీ ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ ప్రాజెక్టు చేపట్టి పూర్తి చేసి ప్రారంభించిన మాజీ ప్రధాని ఇందిరాగాంధీకి,పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఆదేశాల మేరకు జగిత్యాల జిల్లా మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు తాటిపర్తి విజయలక్ష్మిదేవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో మాజీ ప్రధాని నెహ్రూకు,మాజీ ప్రధాని ఇందిరాగాంధీకి పాలాభిషేకం చేశారు.ఈ కార్యక్రమంలో జగిత్యాల మాజీ మున్సిపల్ చైర్మన్ టిపిసిసి మెంబర్ గిరి నాగభూషణం,మున్సిపల్ ఎక్స్ చైర్మన్ దేవేందర్‌రెడ్డి,టిపిసిసి,ఎన్నారై,సెల్ కన్వీనర్ డా.షేక్ చాంద్‌పాషా,జగిత్యాల మున్సిపల్ ఎక్స్ కౌన్సిలర్స్,మునీరుద్దీన్ మున్న,గాజుల రాజేందర్,రమేష్‌రావు,పులి రాము,దెయ్యాల శంకర్,వైనుల అధ్యక్షుడు కమటాల శ్రీను పాల్గొన్నారు.



మెటుపల్లి వార్త

## ఆర్థిక సహాయం అందించిన ఎమ్మెల్యే

**కాల్వశ్రీరాంపూర్, ప్రభాతవార్త :**



కాల్వశ్రీరాంపూర్ మండలంలో గత పదిరోజుల నుండి కురుస్తున్న వర్షాలకు మల్యాల గ్రామ శివారులో ఉన్న నక్కల వాగులో మల్యాల గ్రామానికి చెందిన మామిడి కొమురయ్యకు చెందిన కాడేడ్లు నక్కల వాగులో కొట్టుకొని పోయి చనిపోయాయి విషయాన్ని పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి తెలుపగా గురువారం మండల అధ్యక్షుడు నూనెటి సంపత్‌యాదవ్ జడ్పిటిసి వంగల తిరుపతిరెడ్డిల చేతుల మీదుగా పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి 10,000 రూపాయలు ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమం సర్పంచ్ లంక రాజేశ్వరి సదయ్య, వైస్ ఎంపీపీ శిరీష అనిల్, కాల్వశ్రీరాంపూర్ సర్పంచ్ ఆడెపు శ్రీదేవి రాజు, మాజీ ఎఎంసి వైస్ చైర్మన్ బసి సదాశివరెడ్డి, కో ఆప్షన్ ఇబ్రహీం, నాయకులు ఎరబాటి రవి, కుమారస్వామి, కడారి నవీన్, మూడేతులు సదయ్య, సంపత్, లింగయ్య, పంది రవి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక సాయం అందించిన బొద్దుల

**ఎలిగేడు, ప్రభాతవార్త :**

జూలపల్లి మండలం కాచాపూర్ గ్రామానికి చెందిన ఉత్తర్ల కనుకమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. నిరుపేద కుటుంబమని అనుచరుల ద్వారా సమాచారం తెలుసుకున్న కేసీఆర్ సేవాదళం రాష్ట్రం ఉపాధ్యక్షుడు జూలపల్లి జెడ్పీటీసీ బొద్దుల లక్ష్మణ్ మృతురాలి కుటుంబానికి 5000 వేల ఆర్థిక సహాయం అందించి దాతృత్వాన్ని చాటుకున్నారు. అడిగిన వెంటనే ఆర్థిక సాయం చేసిన బొద్దులకు మృతురాలు కుటుంబం కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బంటి ఎల్లయ్య, కేసీఆర్ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు దండే వెంకటేశ్వర్లు, జిల్లా ప్రధాన కార్యదర్శి చాతల్ల కాంతయ్య, అంజయ్యగౌడ్, దీకొండ రాములు, లచ్చయ్య, తిరుపతి, రాజేశ్వరిలు పాల్గొన్నారు.


## లోతట్టు ప్రాంతాలను పరిశీలించిన తహసీల్దార్

**కాల్వశ్రీరాంపూర్, ప్రభాతవార్త :**

కాల్వశ్రీరాంపూర్ మండలంలో ఎడతెరిపి లేకుండా పదిరోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు జనజీవనం అస్తవ్యస్తమైంది. ఇందులో భాగంగా మండలంలోని లోతట్టు ప్రాంతాలైన మల్యాల మోట్లపల్లి, కిష్టంపేట, మీర్జంపేట్, చిన్నరాతుపల్లి గ్రామాలలో మండల తహసీల్దార్ బిట్ల సుధాకర్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానేరు డ్యాం గేట్లను ఏ క్షణమైనా ఎత్తివేస్తారని దానికి అనుగుణంగా మానేరు పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు ఎంపీడీవో రామ్మోహన్ ఆచారి, మండల ఎంపిఓ గోవర్ధన్, అధ్యక్షుడు నూనెటి సంపత్‌యాదవ్, జెడ్పిటిసి వంగల తిరుపతిరెడ్డి, రెవిన్యూ అధికారులు ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

## ఉప్పొంగి ప్రవహిస్తున్న మల్లుపల్లి లోతువాగు

**గంభీరావుపేట, ప్రభాతవార్త:**



ఎగువన కురుస్తున్న భారి వర్షాలకు గంభీరావుపేట మండలం మల్లుపల్లి లోతువాగు ఉప్పొంగి ప్రవహిస్తుంది. గోరంటాల వాగు ద్వారా వస్తున్న వరద నీటికి లోతువాగు ఉధృతంగా ప్రవహించడంతో మల్లుపల్లి గ్రామస్థులకు ప్రధాన రహదారయిన రోడ్డు వరద ప్రవాహనికి తెగి పోయింది. నాగంపేట, దమ్మన్నపేట, సముద్రలింగాపురం నుంచి గ్రామానికి వచ్చే ప్రజల రాకపోకలు నిలిచిపోయాయి. వరద దాటికి పంటపొలాలు నీటి మయమయి ఇసుక మేటలు వేశాయని పటువురు రైతులు ఆవేదన వ్యక్తంచేశారు. లోతువాగుకు శాశ్వతపరిష్కారానికై లో లెవల్ వంతేన నిర్మించాలని పలుమార్లు విన్నవించిన ఫలితం లేకుండాపోయిందని ఆరోపిస్తున్నారు. ప్రతి ఏటా వర్షాకాలంలో వాగు ఉప్పొంగి ప్రవహించినప్పుడు ఎన్నో కష్టాలు ఎదుర్కోవల్సిన పరిస్థితి నెలకొంటుందని ప్రాంత ప్రజటు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. వరద ఉధృతితో నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించి, ఈ ప్రాంతానికి శాశ్వతపరిష్కారం చూపాలని నాయకులను, అధికారులను ప్రాంత ప్రజలు కోరుతున్నారు.


# పొంగి పొర్లుతున్న ఎగువ మానేరు ప్రాజెక్టు

**ఉధృతంగా ప్రవహిస్తున్న లింగన్నపేట వాగు**

**నిలిచిపోయిన దుబ్బాక-కామారెడ్డి రాకపోకలు**

**గంభీరావుపేట, ప్రభాతవార్త:**

ఎడతెరపి లేకుండా కురుస్తున్న భారి వర్షాలకు గంభీరావుపేట మండలం నర్మాల ఎగువ మానేరు ప్రాజెక్టు గురువారం ఉప్పొంగి ప్రవహిస్తుంది. ఎగువన కురుస్తున్న భారి వర్షాలకు ప్రాజెక్టులోకి వచ్చి చేరుతున్న వరద నీటితో ప్రాజెక్టు రెండు మత్తడిలపై నుండి పరవళ్లు తొక్కుతుంది. పది రోజులుగా కురుస్తున్న వర్షాలకు కూడెల్లి-పల్వంచ వాగులు ఉధృతంగా పవహిస్తుండి తద్వారా వచ్చిన వరద నీటితో 31 అడుగుల సామర్థ్యం గల ప్రాజెక్టు పూర్తి స్థాయిలో నిండి రెండు రోజులుగా పొంగి పొర్లుతుంది. రెండు మత్తడుల ద్వారా ప్రవహిస్తున్న వరద ఉధృతి దుబ్బాక-కామారెడ్డి ప్రధాన రహదారైన రోడ్డుపై నుండి ప్రవహిస్తుండడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. మానేరు ప్రాజెక్టు వీక్షించడానికి వచ్చే సందర్శకులకు పోలీసులు ఆంక్షలు విధించారు. ప్రాజెక్టు ప్రధానరహదారిపై భారికేడ్లను ఏరాటు చేసి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎప్పటీకప్పుడు స్థానిక ఎస్సై మహేష్ పోలీస్ సిబ్బందితో మానేరు తీరాన్ని పర్యవేక్షిస్తున్నారు.



ఉప్పొంగి ప్రవహిస్తున్న ఎగువ మానేరు ప్రాజెక్టు తో గంభీరావుపేట మండలం లింగన్న పేట వాగు ఉధృతంగా ప్రవహిస్తుంది. సిద్దిపేట-కామారెడ్డికి ప్రధాన రహదారయిన లింగన్నపేట వాగు లో లేవల్ బ్రిడ్జిపై నుండి వరద నీరు ప్రమాధకరంగా ప్రవహిస్తుండడంతో మండల కేంద్రానికి రాకపోకలు నిలిచిపోయాయి. సిద్దిపేట నుండి గంభీరావుపేట మీదుగా కామారెడ్డి వెళ్లే బస్సులు మల్లారెడ్డిపేట-లక్ష్మిపూర్ తండా మీదుగా తిరిగి వెళ్తున్నాయి. వాగు వద్దకు ఎవ్వరు వెళ్లకుండా పోలీసులు భారికేడ్లను ఏర్పాటు చేశారు. ఉధృతంగా ప్రవహి స్తున్న వాగును గ్రామ సర్పంచ్ కటకం శ్రీధర్‌పంతులు ఎప్పటీక ప్పుడు పర్యవేక్షించారు. వరద ఉధృతి తగ్గే వరకు ఎవ్వరు వాగు వద్దకు వెళ్లవద్దని సూచించారు. ఎడతెరపి లేకుండా కురుస్తున్న భారి వర్షాలకు మండల కేంద్రంతో పాటు మండలంలోని పలు గ్రామాలలో పలు ఇళ్లు నేలకులాయి. పాత ఇళ్లలో ఎవ్వరు ఉండకూడదని ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు ప్రజలకు వివరిస్తున్నారు.

## నిండుకుండలా చెరువులతో వర్షాలకు అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలు

**- సమీక్షించవలసిన రెవెన్యూ అధికారులు జాడేలేదని ప్రజలు ఆగ్రహం**

**ఎలిగేడు, ప్రభాతవార్త :**

బంగాళాఖాతంతో ఏర్పడ్డ అల్పపీడనం కారణంగా గత పదిరోజులుగా కురుస్తున్న వర్షాలకు చెరువులు కుంటలు నిండుకుండలా తయారయ్యాయి. బుధవారం నుండి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు జనజీవనం అస్తవ్యస్తంగా ఉండి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలకు ఇళ్లల్లోకి నీరు చేరి నిత్యవసర సరుకులు బియ్యం బట్టలు తడిసి ముద్దయ్యాయి. జూలపల్లి ఎలిగేడు మండలాలకు కలిపే ఉసానుమియా వాగు పొంగిపొర్లుతుండడంతో రాకపోకలు బంద్ అయ్యాయి. చెరువులను



తలపిస్తున్న పంట పొలాలు చూసి రైతులు ఆందోళన చెందుతున్నారు. నాట్లు వేసిన కొద్ది రోజులకే వరదలు రావడంతో పంట పొలాల్లో మట్టి నుండి పంటలు నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తిం చేస్తు న్నారు. దూళి కట్ట, నారాయ ణపల్లె గ్రామాల్లో ఇల్లు చేరడంతో సర్పంచులు ఇండ్లని పరిశీలించి సురక్షిత ప్రాంతాలకు కుటుంబాలను తరలిస్తున్నారు. ధూళికట్ట ఊర చెరువుపై బ్రిడ్జి నిర్మిస్తామని ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చిన ప్రజాప్రతినిధులు మరిచిపోవడంతో వరదల వలన తీవ్ర ఇబ్బందులు పడు తున్నామని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇళ్లల్లోకి రావడం లేదని అధికారులపై మండల ప్రజలు ఆగ్రహారం వ్యక్తం చేస్తున్నారు. కుంటలు నిండి ప్రమాద అంచులు దాటిన క్షేత్రస్థాయిలో పర్యటించి పరిస్థితిని సమీక్షించవలసిన రెవెన్యూ అధికారులు జాడ లేకపోవడంతో ఏ క్షణాన ఏం జరుతుందోనని ప్రజలు అందోళన వ్యక్తం చేస్తున్నారు.

## భారీ వర్షాల దృష్ట్యా లోతట్టు ప్రాంతాల్లో నివసించే ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**జిల్లా కలెక్టర్ బి. గోపి**

**జమ్మికుంట, ప్రభాత వార్త:**



భారీ వర్షాల దృష్ట్యా లోతట్టు ప్రాంతాల్లో నివసించే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కరీంనగర్ జిల్లా కలెక్టర్ బి. గోపి తెలిపారు. గురువారం జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని హౌసింగ్ బోర్డ్ కాలనీని సిపి సుబ్బారాయుడు, ఆర్‌డివో హరిసింగ్ ఇతర అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ బి. గోపి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జమ్మికుంట పట్టణంలోని హౌసింగ్ బోర్డ్ కాలనీలో ఇళ్ళలోకి వరద నీరు వెళ్ళగా కాలనీ పరిసరాలను పరిశీలించి అక్కడి పరిస్థితుల గురించి వాకబు చేశారు. రానున్న 24 గంటల్లో భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, కాబట్టి లోతట్టు ప్రాంత ప్రజలకు ఎటువంటి హానీ కలగకుండా వెంటనే వారిని ఆయా ప్రాంతాల నుండి తరలించడానికి అవసరమైన సహాయక చర్యలతో అధికారులు సిద్ధంగా ఉండాలని తెలిపారు. ఇంకా పొంగిపోర్లడానికి సిద్ధంగా ఉన్న వాగులు, కాలువల వద్ద ఎప్పటికప్పుడు నీటి సామర్థ్యాన్ని పరిశీలించాలని అన్నారు. పోలీస్ కమీషనర్ సుబ్బారాయుడు మాట్లాడుతూ... పోలీస్ అధికారులందరూ వారి పరిధిలోని సహాయక చర్యలు అందించడానికి సంసిద్ధంగా ఉండాలని తెలిపారు. రోడ్లపై నుండి వరద నీరు ప్రవహించే మార్గాలలో రాకపోకలను పూర్తిగా నిలిపివేయాలని సూచించారు. ఈ పర్యటనలో హుజురాబాద్ ఆర్‌డివో హరిసింగ్, ఏసిపి జీవన్ రెడ్డి, జమ్మికుంట మున్సిపల్ కమీషనర్ బిర్రు శ్రీనివాస్, తహశీల్ధార్ బండి రాజేశ్వరి, సిఐ బర్పాటి రమేష్, ఇతర శాఖల అధికారులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## అకాల వర్షాలతో కూలిపోయిన ఇండ్లు... ఇండ్లలోకి నీరు....

**- రాకపోకలు నిలిపివేత**



**ఓదెల, ప్రభాత వార్త:**

ఇటీవల కురుస్తున్న అకాల వర్షాలకు ఓదెల మండలంలో ఇండ్లు కూలిపోయాయి. ఓదెలలో రెండు, కొమిరలో రెండు, ఇందుర్తిలో రెండు, గోపరపల్లిలో ఒకటి, రూపు నారాయణ పేటలో ఒకటి చొప్పున ఇండ్లు వర్షాలకు కూలిపోయాయి. అకాల వర్షానికి పలు గ్రామాలలో ఇళ్ళలోకి వర్షం నీరు చేరడంతో ఇంటి కుటుంబ సభ్యులు నానా అవస్థలు పడుతున్నారు. వారి ఇండ్లలోకి నీరు రాకుండా సంబంధిత అధికారులు, గ్రామ సర్పంచులు సమస్యలను పరిష్కరించాలని బాధితులు కోరారు. ఓదెలలో మార్క శంకరయ్య ఇంట్లోకి వర్షం నీరు చేరడంతో సంబంధిత అధికారులకు తెలుపగా ఆర్ఐ రాజేందర్ మాజీ సర్పంచ్ ఆకుల మహేందర్ లు పరిశీలించి జేసిబి సహాయంతో వర్షం నీరు తీసే ప్రయత్నం చేశారు. ఈ వర్షం నీరు ఇండ్లలోకి రాకుండా డ్రైనేజీ నిర్మిస్తేనే ఇళ్ళలోకి నీరు రాకుండా ఉంటుందని స్థానికుల అభిప్రాయం. కొలనూర్, ఓదెల, కొమిరలో ఇల్లు కూలిపోయిన నాగపురి కృష్ణమ్మ ఇల్లును తహశీల్ధార్ కె. రమేష్ పరిశీలించారు. అలాగే అకాల వర్షానికి మడక నుండి ఓదెలకు వచ్చే దారిలో ఒర్రె పైన అధికంగా వరద పోవడంతో పోలీసులు రాకపోకలు నిలిపి వేశారు. ఓదెల రైల్వే అండర్ గ్రౌండ్ బ్రిడ్జిలో వర్షం నీరు నిండుగా నిలవడంతో రైల్వే సిబ్బంది రైల్వే హెచ్చరిక గేట్లు పెట్టారు. తహశీల్ధార్ కె. రమేష్ మాట్లాడుతూ.... భారీ వర్షాల కారణంగా ప్రజలందరూ ప్రయాణం చేయకుండా ఉండాలని, అత్యవసరం అయితేనే ప్రయాణం చేయాలని, పాత ఇల్లు కూలిపోయే ప్రమాదం ఉంది కాబట్టి ఇళ్ళలో ఉండవద్దని, ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.



# జిల్లాలో ఎడ తెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు

**- లోతట్టు ప్రాంతాలు జలయమం.**
**-ఇళ్లలోకి వచ్చిన వరద నీరు**
**- తెగినపోయిన బోనాల చెరువు**

సిరిసిల్ల టౌన్ ప్రభాతవార్త

జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో వాగుల వంకలు పోంగిపొరుతున్నాయి.భారి వర్షాలతో లోతట్టు ప్రాంతాలు జలమయంగా మారాయి.జిల్లా కేంద్రంలో వరదలతో లోతట్టు ప్రాంతాలు జలయమయం కాగా ఇండ్లలోకి నీరు రావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురియ్యారు.ఎగువ మానేరు జలాశయం నిండి ఉద్రుతంగా ప్రవహిస్తుండడంతో మానేరు నది ప్రరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. వేములవాడ మూలవాగు జోరుగా ప్రవహిస్తుంది. భారి వర్షాలు కురుస్తుడంతో జిల్లాలో పలు చోట్ల రోడ్లు తెగి పోయి రాకపోకలు బంద్ అయ్యాయి. అతి భారీ వర్షం కారణంగా ఏ క్షణంలోనైన మద్యమానేరు గేట్లు ఎత్తి వేయడం జరుగుతుందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బోనాల చెరువు తెగిపోవడంతో సిరిసిల్ల లోనివేం కంపేట, అశోక్ నగర్, సంజీవ య్యనగర్, అంబిక నగర్, పద్మనగర్, పాత బస్టాండ్, అటో నగర్ ప్రాంతా లన్ని జలదిగ్బందం కావడంతో అక్కడి ప్రజలను సురక్షిత ప్రాంతలకు పోలీస్ అధికారులు, రెవెన్యూ అదికారులు తరలించడం జరుగుతుంది. ప్రజలందరు అత్య వసరం సమయంలో బయటకు రావా లని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి ప్రజ లకు విజప్తి చేశారు.



## తీజ్ ఉత్సవాల్లో ఆడిపాడిన నాయకులు

పాలకుర్తి, ప్రభాతవార్త.



మండలంలోని బామ్లానాయక్ తండాలో తీజ్ ఉత్సవాలు గురువారం అంగరంగ వైభవంగా జరిగాయి. సాంప్రదాయ బద్ధంగా గిరిజన ఆచార, వ్యవహారాల ప్రకారం తండా వాసులు ఈ తీజ్ ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఒకవైపు రాష్ట్రమంతా భారీ వర్షాలు కురుసున్నప్పటికీ మండలంలోని బామ్లానాయక్ తండాలో తీజ్ ఉత్సవాలు మాత్రం అందరిని ఆకట్టుకున్నాయి. గురువారం మధ్యాహ్నం తరువాత వర్షం కొంత తగ్గుముఖం పట్టడంతో ఈ ఉత్సవాలకు మరింత శోభ చేకూరింది. మహిళలు, పెళ్లి కాని యువతులు తమ సంప్రదాయం ప్రకారం గోధుమ, వరి మొలకలను బుట్టలో పెట్టుకొని ఆడిపాడి సంబురాలు జరుపుకు న్నారు. సర్పంచ్ రాజు నాయక్ ఆధ్వర్యంలో జరిగిన ఈకార్యక్రమం రెండు తండాలకు చెందిన గిరిజనులు పాల్గొని ఆడి పాడారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. సర్పంచ్ రాజు నాయక్, జిడి నగర్ సర్పంచ్, కేశోరాం కాంట్రాక్టు కార్మిక సంఘం అధ్యక్షుడు సూర సమ్మయ్యతో కలిసి ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన యువతులతో కాసేపు ఆడి పాడారు. సంప్రదాయాలు, ఆచారాలు మన జీవితంలో భాగమని ఆయన అన్నారు. ఇదే కార్యక్రమానికి హాజరైన జడ్పి చైర్మన్ పుట్ట మధూకర్ కూడా తెలంగాణ రాష్ట్రం ఏర్పాడ్డక సంప్రదాయాలకు, ఆచారాలకు ప్రాధాన్యత ఏర్పడిందని అన్నారు. పుట్ట మధూకర్ కూడా మహిళలు, యువతులతో సంబురాల్లో పాల్గొన్నారు. బిఆర్ఎస్ నాయకులు మల్క రామస్వామి, పీట్ల గోపాల్‌తో కలిసి పుట్ట మధూకర్ కార్యక్రమంలో ఆడిపాడారు. కార్యక్రమంలో పాలకుర్తి జడ్పిటిసి సంధ్యారాణి కూడా హాజరై కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఆర్థిక సహాయం అందించిన జడ్పిటిసి

పెద్దపల్లి, ప్రభాతవార్త.



జూలపల్లి మండలం కాచాపూర్ గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మరణించిన ఉత్తెర్ల కనకమ్మ కుటుంబానికి సహాయం అందించాలని స్థానిక నాయకులు కెసిఆర్ సేవా దళం తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు, పద్మశాలి సంఘం తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు, జూలపల్లి మండల జడ్పిటిసి బొద్దుల లక్ష్మణ్‌ను కోరగా, వెంటనే స్పందించి కెసిఆర్ సేవా దళం నాయకుల ద్వారా వారికి ఐదు వేల రూపాయల ఆర్థిక సహాయం అందించారు. ఈ సహాయంను అందించిన బిసి యువ నాయకులు, జడ్పిటిసి బొద్దుల లక్ష్మణ్‌కు కనకమ్మ కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బంటు ఎల్లయ్య, కెసిఆర్ సేవా దళం పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు దండె వెంకటేశ్వర్లు, జిల్లా ప్రధాన కార్యదర్శి చాతళ్ల కాంతయ్య, పాలకుర్తి అంజయ్య గౌడ్, దీకొండ రాములు, లచ్చయ్య, తిరుపతి, రాజేశ్వరీ తదితరులున్నారు.

## వర్షాల పట్ల పెద్దపల్లి పట్టణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**- మున్సిపల్ చైర్ పర్సన్ డాక్టర్ దాసరి మమతా రెడ్డి**

పెద్దపల్లి, ప్రభాతవార్త.

ఎడతెరపి లేకుండా గత వారం రోజుల నుంచి కురుస్తున్న వర్షాల కారణంగా పెద్దపల్లి పట్టణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అవసరమైతే తప్ప బయటకు రావద్దని మున్సిపల్ చైర్ పర్సన్ దాసరి మమతా రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. రంగంపల్లి వద్ద గల రాజీవ్ రహదారి పలు వార్డుల్లో మున్సిపల్ కమీషనర్ మట్ట శ్రీనివాస్ రెడ్డి, వార్డు కౌన్సెలర్లతో కలిసి చైర్ పర్సన్ సందర్శించారు. ఈ సందర్భంగా వర్షాల కారణంగా నీరు నిల్వ ఉన్న చోట తీసుకోవాల్సిన చర్యలు, శిథిలావస్థలో ఉన్నటువంటి ఇండ్లలో ఉంటున్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించడం వాటిపై అధికారులకు సూచించారు. అపట్టణ ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో హెల్ప్‌లైన్ నెంబర్ 9988556162ను సంప్రదించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కమీషనర్ మట్ట శ్రీనివాస్ రెడ్డి, వార్డు కౌన్సెలర్లు కొమిరిశెట్టి కనకలక్ష్మి శ్రీకాంత్, బొకూరి భాగ్యలక్ష్మి సన్నీ, గాదె మాధవి, పూదరి చంద్రశేఖర్, పాగాల సోనీ శ్రీకాంత్, సాహిదా సాబీర్ ఖాన్, మున్సిపల్ మెనేజర్ శివ ప్రసాద్, టౌన్ ప్లానింగ్ అధికారి అభినవ్, సానిటరీ ఇన్‌స్పెక్టర్లు రాంమోహన్ రెడ్డి, పులిపాక రాజు, జవాన్లు జయరాజ్, చిన్న, శ్రవణ్, మున్సిపల్ సిబ్బంది తదితరులున్నారు.

## మండలంలో పాక్షికంగా కూలిన పది ఇండ్లు

పాలకుర్తి, ప్రభాతవార్త.

రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో పాలకుర్తి మండలంలో పది ఇండ్లు పాక్షికంగా నేల మట్టం అయ్యాయి. అన్ని గ్రామాల్లో చెరువులు, వాగులు పొంగిపొర్లుతున్నాయి. రానున్న రెండు రోజుల్లో మరింత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున పంచాయతీ రాజ్ అధికారులు గురువారం అందర్ని అప్రమత్తం చేశారు. జిల్లా పంచాయతీ రాజ్ అధికారి చంద్రమౌళి, ఎంపిఓ షబ్బీర్ పాషా పలు గ్రామాల్లో పర్యటించారు. పోలీసు, రెవెన్యూ, పంచాయతీ రాజ్ శాఖలు సమన్వయంతో అనుకోని పరిస్థితుల్లో తలెత్తె విపత్తులను ఎదుర్కోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించడంతో అధికారులు గ్రామాల బాట పట్టారు. పంచాయతీ కార్యదర్శులందరూ గురువారం రాత్రి తమ తమ గ్రామ పంచాయతీ కార్యాలయాల్లోనే నిద్రించారు. రాణాపూర్‌లో గొట్టె మల్లమ్మ, నల్లా బుచ్చయ్య, గుడిపల్లిలో దాక్షపల్లి భూమయ్య, చింతకింది నారాయణ, కన్నాలలో ఎలిగేటి పద్మ, జయ్యారంలో జేడు కొమురమ్మ, కుక్కలగుడూర్‌లో మాచర్ల ఎల్లమ్మలకు చెందిన ఇండ్లు పాక్షికంగా కూలిపోయాయి. గత రెండు మూడు రోజుల క్రితం కన్నాలలో తగరం మల్లయ్య, కొత్తపల్లి దుర్గం మధునమ్మ, ఎల్కలపల్లిలో తాళ్ల నారాయణ గౌడ్‌లకు చెందిన ఇండ్లు కూడా పాక్షికంగా కూలిపోయాయి.

## ఎస్ఐ గా బాధ్యతలు స్వీకరించిన ఎన్. శ్రీధర్

ఓదెల, ప్రభాత వార్త:



ఓదెల మండలంలోని పోత్కపల్లి పోలీస్ స్టేషన్ లో గురువారం నూతనంగా ఎస్ఐ గా ఎన్. శ్రీధర్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్ఐ శ్రీధర్ మాట్లాడుతూ... శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారినైనా సహించేది లేదని 24 గంటలు ప్రజల కోసం పనిచేయుటకు సిద్ధంగా ఉన్నామని, బాధితులు ఎవరైనా ఇలాంటి పైరవీలు లేకుండా నేరుగా వచ్చి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసి సమస్యలను పరిష్కరించుకోవాలని చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటి వారైనా కఠిన చర్యలు తప్పవని, మహిళల కోసం టీ షీంలు నిరంతరం పనిచేస్తున్నాయని, ఈ అకాల వర్షానికి రైతులు, ప్రజలు అతలాకుతలమవుతున్నారని, అలాగే ఇటీవల కురుస్తున్న అకాల వర్షాలకు మండల ప్రజలు అలాగే మానేరు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వారన్నారు. మానేరు డ్యామ్ గేట్లు ఎత్తడంతో మానేరు పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.




## నాగెపల్లి లో పీరీల ఊరేగింపు

రామగిరి-ప్రభాతవార్త



మొహర్రం ఉత్సవాలను కులమతాలకు అతీతంగా అందరూ జరుపుకుంటారు.ప్రతి ఒక్కరూ భక్తి శ్రద్దలతో పీరీలను మొక్కుతారు.కోరికలు తీరుతాయని ఆ మహాత్యం పీర్లకు ఉందని నమ్ముతారు.ఈ క్రమంలో పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం నాగేపల్లి గ్రామంలోని మసీదులో ఏర్పాటు చేసిన పీర్లను గురువారం రోజు ఊరేగించారు.మొహర్రం పండగ సంధర్భంగా గ్రామంలో వెలిసిన పీరీలను ముస్లింలతో పాటు హిందువులు కూడా భక్తి శ్రద్దలతో కొలుస్తారు.పీరీలను మొక్కుతే పిల్లలు లేని వారికి సంతాన ప్రాప్తి కలుగుతుందని పీరీలను నమ్ముతారు. పీరీలను నమ్మేవారు మొహర్రం నెల ప్రారంభం నుండి నిమజ్జనం వరకు మద్యం, మాంసాహారానికి దూరంగా ఉంటారు.నిష్టగా ఉండి కటిక నేలపైనే నిద్రపోతారు.భక్తులు ఒక రోజు ఉపవాసం ఉండి పీరీలకు మట్టి కుండలో చేసినటువంటి బెల్లం శాఖ,బగారా అన్నం నైవేద్యంగా పెడతారు.వీటిని మట్కీలు అంటారు.పీర్లకు పూలు,కుడకల దండలతో,గణపత్రి ఆకులతో అలంకరణ చేస్తారు.పీర్ల వద్ద అగ్నిగుండం ఏర్పాటు చేసి పీర్లను ఎత్తుకున్న వారు డప్పు చప్పుల్ల మద్య కాళ్ళకు గజ్జలు కట్టుకోని అసయ్ దుల హారతి అనుకుంటూ ఎగురుతు చుట్టూ తిరుగుతూ నిప్పు రవ్వల మీద నడుస్తారు.పీరీలు పట్టుకున్న వారికి పూనకం వచ్చినప్పుడు దైవంగా భావించి భక్తులు తమ సమస్యలు చెప్పుకుంటారు.పీరీలు పట్టుకోని ఎగురుతున్నప్పుడు పిల్లలు లేని మహిళలు కొంగుచాచి నిలబడతారు.ఎగురుతున్న పీర్ల నుండి కుడకలు,ఆకులు చీర కొంగులో పడితే మంచి జరుగుతుందని భావిస్తారు.తమకు కోరిన కోరికలు తీర్చడం వల్లే పీర్లను నమ్ముతున్నామని భక్తులు తెలుపుతుంటారు.నిమజ్జనం చివరి రోజున భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పీర్లను అలైబలై చేసుకోని వీడ్కోలు చెప్తారు.

## భారీ వర్షం... ఉప్పొంగిన వాగులు

వీర్నపల్లి, ప్రభాతవార్తః

వీర్నపల్లి మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు



వాగులు వంకలు ఉప్పొంగుతున్నాయి. గర్జనపల్లి మూల వాగు, వీర్నపల్లి పెద్ద వాగు ప్రమాదకరంగా ప్రవహించాయి. సుమారు 20 గంటలకు పైగా రాకపోకలకు అంతరాయం కలిగింది. విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడింది. అధికారులు ట్రాక్టర్‌లలో విధులు నిర్వర్తించేందుకు వచ్చారు. వందల ఎకరాల్లో పంట పొలాలు దెబ్బతిన్నాయి. ఇసుక మేటలు వేయడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని అన్ని చెరువులు మత్తడి దూకుతున్నాయి. ఎస్సై నవత ఎలాంటి ప్రమాదాలు చోటుచేసుకోకుండా గస్తీ నిర్వహించారు. వాగుల వద్ద సిబ్బందితో గస్తీ కాయించారు. సీఐ శ్రీనివాసరెడ్డి, తహసీల్దార్ తఫజుల్‌హస్సేన్, ఎంపీడీవో నరేష్ మండలంలో పర్యటించారు. వాగుల వద్ద అడ్డు ఉంచి రాకపోకలను నిషేదించారు.

## వర్షానికి కూలిన ఇల్లు

చందుర్తి, ప్రభాతవార్త.

చందుర్తి మండల కేంద్రంలో నక్క నర్సవ్వ అనేక మహిళకు చెందిన ఇల్లు వర్షానికి కూలిపోయింది. నర్సింగాపూర్ గ్రామంలో భారీ వర్షాలకు పలువురి ఇండ్లలోకి భారీగా నీళ్లు చేరాయి. నర్సింగాపూర్ గ్రామ శివారులో ఎల్లంపల్లి కాల్వకు గండిపడటంతో గ్రామస్తులు శ్రమదానం చేశారు. చందుర్తి లౌడియా చెరువు నిండడంతో మత్తడి వద్ద గండి పడింది. దీంతో ఎల్లంపల్లి కాలువ ప్రవాహం పెరిగింది. మిగతా గ్రామాల్లో వర్షాలకు చిన్న చిన్న నష్టం వాటిల్లింది. చందుర్తి తహశీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటుచేసి సహాయ చర్యలు అందించేందుకు సిబ్బంది సిద్ధంగా ఉన్నారు.

వార్త




# వాన వరద




ఇల్లందకుంటలో...


చెల్పూర్ చెరువు వద్ద వాగును పరిశీలిస్తున్న కలెక్టర్, పోలీస్ కమీషనర్


జమ్మికుంటలో...


సిరిసిల్లలో...


కరీంనగర్‌లో...


కరీంనగర్‌లో...


కొనరావుపేటలో...


కరీంనగర్‌లో...


కొనరావుపేటలో...


గంగాధరలో...


వీణవంకలో...


కోరుట్లలో...


కోరుట్లలో...


గంగాధరలో...


వాగును పరిశీలిస్తున్న మంత్రి


ధర్మపురి నీటిమట్టం దృశ్యం


సైదాపూర్‌లో...


మల్యాలలో...

# జమ్మికుంట పట్టణం, మండలంలో కుండపోత వర్షం.... బాధితుల గుండెకోత

## - ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపిన ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్ రెడ్డి

జమ్మికుంట, ప్రభాతవార్త:



గత 3 రోజుల నుండి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న కుండపోత వర్షాలతో పాటు బుధవారం సాయంత్రం నుండి గురువారం వరకు ఎడతెరిపి లేకుండా అతి భారీ వర్షాలు కురవడంతో ఆ వరద నీరు చెరువులు, కుంటలు నుండి ప్రవాహంగా వాగుల వెంట రోడ్ల పై నుండి వంతెనల మీదుగా ప్రవహిస్తూ లోతట్టు ప్రాంతాలలో ఉన్న పట్టణాల, గ్రామీణ ప్రాంతాల ప్రజల ఇళ్ళలోకి వెళ్ళడంతో ఆయా ప్రాంతాల ప్రజలు బిక్కుబిక్కుమంటూ రాత్రి అంతా భయంతో జాగరణ చేశారు. అంతేకాకుండా జమ్మికుంట మున్సిపల్ ప్రాంతాలలో వరద నీటికి రోడ్లు జలమయమై చెరువులను తలపిస్తూ వరద నీరు రోడ్లపై నుండి వెళ్ళడంతో రాకపోకలు నిలిచిపోయాయి. అలాగే ఆయా పట్టణ, మండల గ్రామాలలో లోతట్టు ప్రాంతాలలో నివసించే వారి ఇళ్ళలోకి నీరు పోవడంతో రాత్రి అంత భయం భయంగా కాలం గడిపారు. బుధవారం రాత్రి నుండి ఇప్పటి వరకు కొడుతున్న భారీ వర్షంతో పట్టణంలోని 5వ వార్డు పిట్టలవాడ 6వ వార్డు హౌసింగ్ బోర్డ్ కాలనీ రోడ్లన్ని వర్షపు నీటితో జలమయమయ్యాయి. అంతేకాకుండా పిట్టల వాడ, హౌసింగ్ బోర్డు, కొత్తపల్లి, అంబేద్కర్ కాలనీ, మోత్కులగూడెం తదితర ప్రాంతాలతో పాటు ఇంకా అనేక ప్రాంతాలలో వరద నీరు అధికంగా రావడంతో అనేక మంది ఇళ్ళలోకి వరద నీరు వెళ్ళడంతో రాత్రి అంతా బిక్కుబిక్కుమంటూ కాలం గడిపారు. అశోక్ నగర్ లోని మహలక్ష్మి దేవాలయంలోకి వరద నీరు వెళ్ళి గుడి జలమయమైంది. ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్ రెడ్డి తీవ్ర వర్షాలు ఉన్న దృష్ట్యా లోతట్టు ప్రాంతల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వర్షానికి తడిసిన ఇండ్లు, పాత ఇళ్ళలో నివాసం ఉండవద్దని గ్రామాలలో వాగు, ఒర్రెల వెంట ఉన్న నివసిస్తున్న ప్రజలు ఇల్లు వదిలి సురక్షిత ప్రాంతాలకు వెళ్ళాలని తెలిపారు. ప్రమాదకరంగా ఉన్న మండలంలోని మడిపల్లి చెరువు, వావిలాల చెరువులు, గరిష్ట నీటిమట్టంతో నిండి ప్రమాదకర స్థాయిలో ఉండగా హుజురాబాద్ ఏసిపి జితేందర్ రెడ్డి, జమ్మికుంట సిఐ బర్పాటి రమేష్, గ్రామ సర్పంచులు మూగల పరుశరాములు, జక్కన శ్రీలత, సత్యం, ఎంపిటిసి మర్రి మల్లేశం, ఉప సర్పంచ్ పోశిని సత్యం, చెరువులకు జెసిబిలతో గండ్లు పెట్టి నీటిని బయటికి తరలించారు. పొంగి పొర్లుతున్న వాగులు, వంతెనలను, పోలీస్ పికేటింగ్లు పెట్టి వాహనాల రాకపోకలను నిలిపివేసి భద్రత చర్యలు తీసుకుంటున్నారు. పట్టణంలోని పలు వార్డులలో వరద నీరు, రోడ్లు, డ్రైనేజీల వెంట పొంగి పోర్లగా ఇళ్ళలోకి వరద నీరు వెళ్ళిన బాధితులను జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ తక్కళ్ళపల్లి రాజేశ్వర్ రావు, వైస్ చైర్పర్సన్ దేశిని స్వప్న కోటి, వార్డు కౌన్సిలర్లు శ్రీపతి నరేష్ గౌడ్, పిట్టల శ్వేత రమేష్, దేశిని రాధ సదానందం తో పాటు ఇతర వార్డు కౌన్సిలర్లు బాధితులను పరామర్శించి వివరాలు అడిగి తెలుసుకుంటున్నారు. వర్షాలు అధికంగా పడుతున్న దృశ్య వరద నీరు ఎక్కువగా ప్రవహిస్తున్నందున లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పాత ఇళ్ళలో తడిసిన ఇళ్ళలో నివాసం ఉండవద్దని వాటికి దూరంగా సురక్షిత ప్రాంతాలలో ఉండాలని జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ముంపుకు గురైన వరద బాధితులను పునరావాస కేంద్రాలకు తరలించి ఆహార పదార్థాలు అందజేశారు.

# హుజూరాబాద్ వార్త

## బాలికల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో వైద్య శిబిరం

జమ్మికుంట రూరల్, ప్రభాతవార్త:




జమ్మికుంట మండలంలోని గంద్రపల్లి గ్రామంలో గల బాలికల సాంఘిక, సంక్షేమ గురుకుల పాఠశాలలో వావిలాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిని డాక్టర్ సన జవేరియా ఆధ్వర్యంలో ఆరోగ్య వైద్య శిబిరం నిర్వహించారు. గురుకుల పాఠశాలలోని 300 మంది విద్యార్థినులకు వైద్య ఆరోగ్య పరీక్షలు నిర్వహించడంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పరిసరాల పరిశుభ్రత,సీజనల్ డిసీస్ మీద డ్రై డే మీద అవగాహన కల్పించారు. చిన్న చిన్న ఆరోగ్య సమస్యలు ఉన్న విద్యార్థినులకు మందులు అందజేశారు. వైద్య శిబిరం ఏర్పాటు చేయడం పట్ల పాఠశాల ప్రిన్సిపాల్ మంజుల వైద్య సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ఇప్పటి వరకు జమ్మికుంట మండలంలోని కస్తూరిబా బాలిక విద్యాలయం, మైనార్టీ గురుకుల పాఠశాల (బాలికలు) వెంకటేశ్వర పల్లి, పాపక్కపల్లి గ్రామాలలో వైద్య శిబిరాలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ వైద్య శిబిరంలో ఆర్బిఎస్కె డాక్టర్ అక్షయ్, కమ్యూనిటి హెల్త్ ఆఫీసర్ శంకర్ రెడ్డి, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ మంజుల, హెల్త్ ఎడ్యుకేటర్ పబ్బు రవీందర్, సూపర్వైజర్స్ స్వరూప, సదానందం, ఆరోగ్య శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వరద ముంపు బాధితులకు అన్నదానం నిర్వహించిన అన్నపూర్ణ సేవా సమితి

జమ్మికుంట, ప్రభాతవార్త:

బుధవారం రాత్రి నుండి గురువారం వరకు ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాలకు ఇండ్లలోకి వరద నీరు చేరి వరద ముంపుకు గురైన వరద బాధితులకు అన్నపూర్ణ సేవా సమితి ఆధ్వర్యంలో జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని శివాలయం హౌసింగ్ బోర్డ్ కాలనీ, అంబేద్కర్ కాలనీ బాధితులకు పునరావాస కేంద్రం సువర్ణ ఫంక్షన్ హాల్ లో ఉండగా అన్నపూర్ణ సేవా సమితి ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. సువర్ణ ఫంక్షన్ హాల్లో ఉన్న వరద బాధితులకు గురువారం సాయంత్రం కూడా అన్నదానం చేస్తామని అన్నపూర్ణ సేవా సమితి నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ తక్కళ్ళపల్లి రాజేశ్వర్ రావు, మున్సిపల్ వైస్ చైర్పర్సన్ దేశిని స్వప్న కోటి, మున్సిపల్ కౌన్సిలర్లు, జమ్మికుంట పిఏసిఎస్ చైర్మన్ పొనగంటి సంపత్, అన్నపూర్ణ సేవా సమితి నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

## హౌసింగ్ బోర్డ్, అంబేద్కర్ కాలనీలను సందర్శించిన బిజెపి జిల్లా అధ్యక్షుడు

జమ్మికుంట, ప్రభాతవార్త:



అకాల వర్షాలతో జమ్మికుంట పట్టణంలో వరద నీరు చేరిన హౌసింగ్ బోర్డ్ కాలనీ, అంబేద్కర్ కాలనీలను బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి స్థానిక బిజెపి శ్రేణులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జమ్మికుంట ప్రాంతంలో హౌసింగ్ బోర్డ్, అంబేద్కర్ కాలనీలు పూర్తిగా నీట మునిగిపోయాయని, వరద నీరు ఇండ్లలోకి చేరి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఆయా ప్రాంతాల్లో ఇళ్ళలోకి నీరు చేరడంతో వస్తువులన్ని నీట మునిగిపోయాయని, ప్రజలు జీవించలేని దయనీయ పరిస్థితి ఉందన్నారు. హౌసింగ్ బోర్డ్ కాలనీ, అంబేద్కర్ కాలనీ ప్రజలను ఆదుకోవడానికి ప్రభుత్వం ద్వారా తక్షణ సహాయ చర్యలు చేపట్టాలని కోరారు. జిల్లా కలెక్టర్ కు ఇక్కడి సమస్యను ఫోన్ ద్వారా వివరించి ప్రజలకు తగిన సహాయం చేయాలని కోరడం జరిగిందన్నారు. ముఖ్యంగా హౌసింగ్ బోర్డ్ కాలనీ, అంబేద్కర్ కాలనీలో ప్రణాళికా లేకుండా చేపట్టిన మురికి కాలువ నిర్మాణాల ద్వారా వరద నీరు అధికంగా ఇళ్ళలోకి వచ్చినట్లు స్పష్టంగా కనబడుతుందన్నారు. ఇక్కడి ప్రాంతాల్లో వరద నీరు రాకుండా అధికారులు సమగ్ర ప్రణాళికతో తగిన చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో వరద నీరు నివారణ కోసం శాశ్వత ప్రతిపాదికన చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి పట్టణ అధ్యక్షుడు జీడి మల్లేష్, మున్సిపల్ మాజీ చైర్మన్ శీలం శ్రీనివాస్, బిజెపి ఓబిసి మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల రాజేందర్, జిల్లా సుధాకర్, ప్రధాన కార్యదర్శులు పల్లెపు రవి, మోతే స్వామి, మోడం రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఇల్లు కూలిపోయిన వృద్ధురాలికి నిత్యవసర వస్తువులు పంపిణీ

మల్యాల, ప్రభాత వార్త:



మల్యాల మండలం ముత్యంపేట గ్రామంలో కురుస్తున్న భారీ వర్షాల మూలంగా ఎస్సి కాలనీకి చెందిన ఎనగందుల గౌరవ్వ అనే వృద్ధురాలి ఇల్లు కూలిపోయింది. విషయం తెలుసుకున్న ముత్యంపేట గ్రామ సర్పంచ్ బద్దం తిరుపతి రెడ్డి గురువారం సంబంధిత వృద్ధురాలి ఇంటిని పరిశీలించి తక్షణ సహాయంగా నిత్యవసర వస్తువులను అందజేశారు. అంతేకాకుండా ఇల్లు కూలిపోవడంతో నిరాశ్రయులైన వృద్ధురాలికి గ్రామంలో ఏర్పాటు చేసిన పునరాసకేంద్రానికి తరలించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తిరుపతి రెడ్డితో పాటు రెవెన్యూ అధికారులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## భారీ వర్షాల మూలంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

మల్యాల, ప్రభాత వార్త:



ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల పట్ల మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మల్యాల ఎస్ఐ తీగల అశోక్ కోరారు. ప్రజలు కూలిపోయిన దశలో ఉన్న ఇండ్లలో ఉండవద్దని, చెరువులు, వాగుల వద్దకు వెళ్ళవద్దని ఆయన సూచించారు. భారీ వర్షాల మూలంగా మత్స్యకారులు కానీ రైతులు కానీ చెరువులు, కాలువలు, వరద కాలువ, ఎస్ఆర్ఎస్పి లోతట్టు ప్రాంతాల వైపు వెళ్ళకూడదని, ఇంట్లో చిన్న పిల్లలను కూడా బయటకు పంపించవద్దని ఆయన తెలిపారు. మండల వ్యాప్తంగా ఉన్న చెరువులు, కుంటలు నిండి పోయినందున సమీప, లోతట్టు ప్రాంతాల్లో ఉంటున్న కుటుంబాలు అప్రమత్తంగా ఉండాలని, అవసరమైతే సురక్షిత ప్రాంతాలలో వెళ్ళాలని, రోడ్ల వెంబడి కూలిపోయి దశలో ఉండే ఇండ్లు, చెట్ల దగ్గర కూడా ఉండరాదని, కరెంటు వైర్లు, విద్యుత్ స్తంభాలు తాకరాదని ఎస్ఐ తెలిపారు. అంతేకాకుండా భారీ వర్షాల వలన వరదలు వచ్చి పంట పొలాలు నిండి రోడ్లపై ప్రవహిస్తున్నందున ప్రయాణాలు మానుకోవాలని, నీటి ఉధృతి వల్ల రోడ్లు గండ్లు పడే ప్రమాదం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. ఇండ్లు కూలిపోయి వరదలు వచ్చి ఇబ్బందులు తలెత్తితే అత్యవసర డయల్ 100 లేదా మల్యాల పోలీస్ స్టేషన్ ఎస్ఐ 8712656830 సెల్ నెంబర్ కు సమాచారం అందించాలని, వర్షాల వల్ల ప్రజానీకానికి ఎటువంటి హాని కలగకుండా అత్యవసర సేవలకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ ప్రజలకు సహాయపడుతుందన్నారు.

## మానేరులో చిక్కుకున్న అంతరాష్ట్ర కార్మికులను కాపాడిన అధికారులు

జమ్మికుంట రూరల్, ప్రభాతవార్త:



జమ్మికుంట మండలంలోని మానేరు పరివాహక ప్రాంతమైన వావిలాల గ్రామ సమీపంలో ఎలక్ట్రికల్ టవర్స్ వర్క్ చేయడానికి వచ్చిన అంతరాష్ట్ర కార్మికులు సుమారు 85 మందిని రక్షించిన పోలీసులు అధికారులు. వివరాలలోకి వెళితే జమ్మికుంట మండలంలోని వావిలాల మానేరు పరివాహాక ప్రాంతంలో ఎలక్ట్రికల్ టవర్స్ నిర్మాణంలో భాగంగా అంతరాష్ట్ర కార్మికులు 85 మంది బీహార్, పశ్చిమ బెంగాల్ నుండి వచ్చిన కార్మికులు పనిచేస్తుండగా ఒక్కసారిగా పెరిగిన వరద ఉధృతికి వారు కేకలు పెట్టడంతో వావిలాల గ్రామ ప్రజా ప్రతినిధులు హుజురాబాద్ ఏసిపి, ఆర్డివో, జమ్మికుంట తహశీల్దార్ జమ్మికుంట పట్టణ సిఐ ఆధ్వర్యంలో తక్షణమే స్పందించి వారందరిని కాపాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... గత రెండు రోజుల నుండి కురుస్తున్న వర్షాలు మరో రెండు రోజులు భారీ వర్షాలు ఉన్నందున లోయర్ మానేరు డ్యాం గేట్లు ఏ క్షణామైనా తెరిచే అవకాశాలు ఉన్నందున మానేరు పరివాహాక ప్రాంత ప్రజలు మానేరులోకి వెళ్ళకూడదని, పరివాహాక ప్రాంత ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని, వరద ఉధృతి ఎక్కువగా ఉండే అవకావాలు ఉన్నందున రైతులు ప్రజలు ఎవరు కూడా మానేరులోకి వెళ్ళకూడదని, నీటి ప్రవాహం కూడా మానేరులోకి వెళ్ళకూడదని, నీటి ప్రవాహం ఎక్కువగా ఉండబోతుందని ప్రజలు ఎవ్వరు కూడా పరివాహాక ప్రాంతం వైపు రాకూడదని వారు తెలిపారు. వలస కార్మికులను కాపాడే విషయంలో సహకరించిన వావిలాల ఎంపిటిసి మర్రి మల్లేశం, సర్పంచ్, ప్రజాప్రతినిధులకు వారు ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ ఏసిపి జితేందర్ రెడ్డి, ఆర్డివో హరి సింగ్, జమ్మికుంట పట్టణ సిఐ బి. రమేష్, తహశీల్దార్ బండి రాజేశ్వరి, ట్రాన్స్ కో అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వామ్మో గింత వాన మేమెన్నడూ సూడలే.....

మల్యాల, ప్రభాత వార్త:

వరుసగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా జనజీవనంతో పాటు మూగజీవాలు కూడా అవస్థలు పడుతున్నాయి. రోజు చిరుతిళ్ళకు తిరిగే కోతులు వర్షాల మూలంగా మూలకు నతుక్కుంటున్నాయి. దీంతో రోడ్లపై, ఇండ్లలో కోతుల బెడద లేకుండా పోయింది. మల్యాల మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనంలో కోతులు గుంపులుగా ఇలా తలదాచుకుంటున్నాయి.

# ముంపు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలి

**- అత్యవసర సమయంలో కంట్రోల్ రూం నెంబర్ 7995070699లో సంప్రదించాలి**

**- జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్**

పెద్దపల్లి జిల్లా బ్యూరో, ప్రభాతవార్త.

జిల్లాలో భారీ వర్షాల దృష్ట్యా ముంపు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు త్వరితగతిన తరలించాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదేశించారు. గురువారం భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భారీ వర్షాల కారణంగా ఎల్లంపల్లి, పార్వతీ బ్యారేజీ, ప్రాజెక్ట్‌లకు భారీగా వరద వస్తుందని, గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ముంపు గురయ్యే ప్రాంతాలను గుర్తించి వెంటనే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల్లో ముంపునకు గురైన ప్రజలను వెంటనే సమీపంలో గల జిపిలలో ప్రభుత్వ భవనాలలో, పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి అక్కడికి తరలించాలని, పునరావాస కేంద్రాల్లో తాగునీటి సౌకర్యం, ఇతర మౌళిక సదుపాయాలు కల్పించాలని కలెక్టర్ తెలిపారు. పునరావాస కేంద్రం వద్ద అవసరమైన కనీస వైద్య సదుపాయాల మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ వైద్యారోగ్య శాఖ అధికారిని ఆదేశించారు. జిల్లాలోని అధికారులు, సిబ్బంది అందరూ స్థానికంగా ఉండాలని, ముంపు ప్రాంతాలలో పర్యటించాలని, ప్రజల మధ్య ఉండాలని, పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు., మున్సిపల్, పంచాయతీ రాజ్ అధికారులు గ్రామ పరిధిలో పురాతన, శిథిల భవనాలు, గోడలు కూలే పరిస్థితులు ఉన్నట్లయితే, వాటిని గుర్తించి నిర్వాసితులను వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని అన్నారు.



జిల్లాలో భారీవ ర్షాల నేపథ్యంలో ఎలాంటి ప్రాణ, ఆస్తి, జంతు నష్టం వాటిల్లకుండా ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజలు అత్యవసర సమయంలో జిల్లాలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూం నెంబర్ 7995070699కు ఫోన్ చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ టెలికాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్‌లు అరుణశ్రీ, శ్యాంప్రసాద్ లాల్, జిల్లా అధికారులు, మున్సిపల్ కమీషనర్లు, తహశీల్దార్లు తదితరులున్నారు.

## వరద ప్రాంతాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్

సుల్తానాబాద్, ప్రభాతవార్త.



గత ఐదు రోజులుగా కురుస్తున్న అతి భారీ వర్షాల వలన మున్సిపల్ పరిధిలోని పలు కాలనీలు జలమయం అయ్యాయి. ఈ నేపథ్యంలో గురువారం ఉదయయం పెద్దపల్లి జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ కాన్ పట్టణంలోని స్థానిక స్వప్న కాలనీ, పూసాల రోడ్డు, గాంధీ నగర్ ప్రాంతాలలో జలదిగ్బంధమైన కాలనీలను పరిశీలించి, వెంటనే సహాయక చర్యలు చేపట్టాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. రాజీవ్ రహదారిని ఆనుకొని ఉన్న గాంధీనగర్‌లో బూరుగు రాజేశంకు చెందిన బిల్డింగ్ సెల్లార్ పూర్తిగా దాదాపు తొమ్మిది ఫీట్ల ఎత్తులో నీరు వెళ్లి పూర్తిగా నీట మునిగింది. పక్కనే గల బ్రహ్మణకుంట, అజిత్ కుంటల నుంచి నీటి ప్రవాహం పెరగడంతో గండి కొట్టడంతో రాజీవ్ రహదారిపై నీరు చేరుకొని ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. గత సంవత్సరం కూడా ఇదే పరిస్థితి నెలకొంది. అయినప్పటికీ ఏడాది గడిచినా గానీ స్థానిక అధికారులను సమస్యను పరిష్కరించకపోవడం కొసమెరుపు. పక్కనే ఉన్న వాటర్ ప్లాంట్‌లోకి నీరు వెళ్లి వాటర్ ప్లాంట్ పూర్తిగా జలదిగ్భందంలో మునిగిపోయింది. దాదాపు 50వేల వరకు వాటర్ యాజమాని ఆకుల జయవర్ధన్‌కు నష్టం వాటిల్లింది. అధికారులు బాధితులను ఆదుకోవాలని పిలువురు కోరుతున్నారు. గాంధీనగర్‌లోని బ్రాహ్మణ కుంట నుంచి పెద్ద చెరువులోకి వెళ్లాల్సిన పిల్ల కాలువ గతంలో 30 ఫీట్ల వరకు ఉండేది కానీ కొందరు వ్యాపారస్తులు దాన్ని 10 ఫీట్లకు కాలువను తేవడంతో కుంటలో నీటి ప్రవాహం ఎక్కువ అవడంతో పిల్ల కాలువ నుంచి నీరు ఆశించి స్థాయిలో పోక రాజీవ్‌రహదారిపై నీరు రావడంతో పలు ఇండ్లు జలదిగ్భందంలో మునిగిపోయాయి. ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకొని అట్టి పిల్ల కాలువను వెడల్పు చేసి నీటి ప్రవాహం పెద్ద చెరువులోకి పోయేటట్లు చూడాలని పలువురు పట్టణ ప్రజలు కోరుతున్నారు.

## కనీస బాధ్యత మరిచి నిర్లక్ష్యంగా వ్యవహరించడం సిగ్గు చేటు

**- కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్**

గోదావరిఖని, ప్రభాతవార్త.



భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో స్థానిక ఎమ్మెల్యే ప్రభుత్వ యంత్రాంగాన్ని అప్రమత్తం చేయాల్సిన కనీస బాధ్యత మరిచి నిర్లక్ష్యంగా వ్యవహరించడం సిగ్గు చేటని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. భారీ వర్షాలతో 23వ డివిజన్ మోబిన్ నగర్, సుభాష్ నగర్ ఏరియాలోని లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యి ఇండ్లలోకి నీరు చేరి, ప్రజలంతా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ గురువారం అక్కడికి చేరుకొని పరిస్థితిని పరిశీలించి, బాధితులకు మనో ధైర్యం చెప్పారు. జలదిగ్భంధంలో ఉన్న ప్రజలకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. జిల్లా కలెక్టర్‌తోపాటు ఉన్నతాధికారులతో మాట్లాడారు. పరిస్థితిని వివరించారు. వరద బాధితులకు తక్షణహే లక్ష రూపాయల సహాయాన్ని అందించాలని డిమాండ్ చేశారు. వరదల వల్ల ముంపునకు గురైన బాధితుల సంరక్షణ చర్యలు చేపట్టాలని అన్నారు.

## వరద నీటిలో చిక్కుకున్న మహిళను కాపాడిన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు

గోదావరిఖని, ప్రభాతవార్త.

భారీగా కురుస్తున్న వర్షంతో గురువారం జనగామలో నివాసం ఉండే నిరుపేద మహిళ రమ తన ఇంట్లో జలద్బింధంలో చిక్కుకొని ఉన్న మహిళను పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ కాపాడి, బయటకు తీసుకు వచ్చారు. అనంతరం మహిళకు ఆర్థిక సహాయం చేశారు. జిఎంతో మాట్లాడి మట్టిపోయిస్తానని హామీ ఇచ్చారు. ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని కోరారు.

## సింగరేణిలో మరో ఖాసీం రజ్వీ సిఅండ్ఎండి శ్రీధర్

**- హెచ్ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్**

గోదావరిఖని, ప్రభాతవార్త.




సింగరేణిలో మరో ఖాసీం రజ్వీ సిఅండ్ఎండి నడిమెట్ల శ్రీధర్ అని హెచ్ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు, సింగరేణి మైనర్స్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్ అన్నారు. సిఎం కెసిఆర్‌కు హెచ్ఎంఎస్, సింగరేణి మైనర్స్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ తరుపున బహిరంగ లేఖను యూనియన్ జిల్లా అధ్యక్షులు తోట వేణుతో కలిసి గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశం సందర్భంగా విడుదల చేశారు. సింగరేణిలో అవినీతి రాజ్యమేలుతున్నదని, కాలం చెల్లిన గుర్తింపు ప్రాతినిధ్య సంఘాల నాయకులు దుర్మార్గాలకు సింగరేణి అధికారులు కూడా వత్తాసు పలుకుతూ సింగరేణిని అధోగతి పాలు చేస్తున్నారని అన్నారు. సింగరేణి సిఅండ్ఎండి నడిమెట్ల శ్రీధర్ గత ఎనిమిది సంవత్సరాలుగా అక్రమంగా సింగరేణిలో తిష్టవేసి కార్మిక సంఘాలను, కార్మిక సంఘాల నాయకులను అణిచి వేసే నిరంకుశ చర్యలకు పాల్పడుతున్నాడని దుయ్యబట్టారు. సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికలు జరిగిన 2017 సంవత్సరం తరువాత నుంచి సిఅండ్ఎండి శ్రీధర్ ఏ ఒక్క రోజు కూడా సింగరేణిలో సమీక్షలు నిర్వహించకపోవడం వల్ల అనేక ప్రమాదాలు జరిగి పదుల సంఖ్యలో కార్మికులు ప్రాణాలు కొలో ్పయారని అన్నారు. సింగరేణిలో సిఅండ్ఎండి నిర్వాకాల వల్ల కొత్తగూడెం కార్పొరేట్ ఆఫీస్ చర్లపల్లి జైలులా, జిఎం ఆఫీస్‌లు పోలీస్ స్టేషన్లలా తయారయ్యాయని అన్నారు. ఈ విషయాన్ని సిఎం కెసిఆర్ దృష్టికి తీసుకుపోవడంలో కాలం చెల్లిన టిబిజికెఎస్ గుర్తింపు సంఘం నాయకుల అవినీతి నిర్వాకాల వల్ల చేరుకోలేకపోతున్నాయని ఆరోపించారు. కార్మిక చైతన్యంతో, ఐక్య పోరాటాల ద్వారా ఈ దుర్మార్గాలను తిప్పి కొడతామని రియాజ్ అన్నారు. సమావేశంలో నాయకులు దారవేన చందర్ రావు, కుమారస్వామి, మారం శ్రీధర్, శ్రీనివాస్, కొప్పుల సత్యనారాయణ తదితరులటున్నారు.




## భారీ వర్షంతో స్తంభించిన రాకపోకలు

చందుర్తి, ప్రభాతవార్త.



గత రెండు రోజుల నుంచి ఎడతెరపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు చందుర్తి మండలం బండపల్లి గ్రామంలో ఊర చెరువు పూర్తి స్థాయిలో నిండి మత్తడి దూకడంతో వర్షపు నీరు బండపల్లి -బావుసాయిపేట గ్రామాల మధ్య కల్వర్టుపై నుంచి జోరుగా ప్రవహించడంతో గురువారం ఉదయం నుంచి రాకపోకలు పూర్తి స్థాయిలో నిలిచిపోయాయి. ద్విచక్ర వాహనాలు, కార్లు, ఇతర వాహనాలు వెళ్లలేని పరిస్థితి నెలకొనడంతో ఈ రహదారి గుండా బావు సాయి పేట, వట్టిమల్ల, నిజామాబాద్ జిల్లాతోపాటు ఇతర గ్రామాలకు వెళ్లే ప్రయాణికులను బండపల్లి గ్రామస్తులు ట్రాక్టర్ సహాయంతో ఒడ్డుకు చేర్చారు. ప్రతి వర్షాకాలం భారీ వర్షాలు కురిసినప్పుడు ఇదే పరిస్థితి ఏర్పడుతుందని గ్రామ నాయకులు లింగంపల్లి బాబు ఆవేదన వ్యక్తం చేశారు. ఇది ఇలా ఉంటే కల్వర్టు అవతలి భాగాన ఉన్న ఎస్సీ కాలనీ ప్రజలు గ్రామానికి రాలేక ఇబ్బందులు పడ్డారు. దీంతో రవాణా వ్యవస్థ స్తంభించి నానా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించచి బావుసాయిపేట-బండపల్లి గ్రామాల మధ్య కల్వర్టు నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## వరద కాలువలపై విస్తృత తనిఖీ

యైటింక్లయిన్‌కాలనీ, ప్రభాతవార్త.



ఓసిపి 3 ప్రాజెక్ట్ వరద కాలువలను సింగరేణి ఆర్జీ 2 జిఎం ఎ.మనోహర్ గురువారం విస్తృతంగా తనిఖీ చేశారు. అధిక వర్షాల కారణంగా నదులు, కాలువలు పొంగి పొర్లుతున్న క్రమంలో ఓసిపి 3 ప్రాజెక్ట్ పక్క నుంచి ప్రవహిస్తున్న జల్లారం వాగుపైన కురుస్తున్న వర్షాల వల్ల పెరుగుతున్న ఉధృతిపై అంఛనా వేసేందుకు అధికారులతో కలిసి తనిఖీ చేసి, క్వారీలోనికి వర్షం నీరు వెళ్లకుండా నాలాలను ఎప్పటికప్పుడు పరిశీలించాలని, ప్రమాద హెచ్చరికలను గమనిస్తూ అప్రమత్తంగా ఉండే విధంగా అధికారులకు దిశా నిర్దేశం చేశారు. వ్యూపాయింట్ ద్వారా ఓసిపి 3 పని స్థలాలను, ఓబి గుత్తేదారు నిర్వహించే పని స్థలాలను పరిశీలించి, క్వారీ నీటిని పరిశీలిస్తూ పంప్ సెక్షన్ ఉద్యోగులను అప్రమత్తంగా ఉండే విధంగా అధికారులకు సూచించారు. వారి వెంట ఓసిపి 3 ప్రాజెక్ట్ అధికారి మధుమోహన్, ఓసిపి 3 ప్రాజెక్ట్ మెనేజర్ డి.రమేష్, సర్వే అధికారి నర్సింగ రావు ఉన్నారు.

## ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్న నిర్లక్ష్యంగా వ్యవహరించడం సిగ్గు చేటు

గోదావరిఖని, ప్రభాతవార్త.

రామగుండం నియోజక వర్గంలో లోతట్లు ప్రాంతాలు జలమయమై ఇండ్లలోకి నీరు చేరి ప్రజలంతా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం సిగ్గు చేటని ఐఎన్‌టియుసి సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్ అన్నారు. గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత 15 రోజుల నుంచి జిల్లాలో భారీ వర్షాలు కురుస్తుండటంతో లోతట్టు ప్రాంఆలు జలమయం అయ్యాయని, గత రెండు మూడు రోజులుగా నియోజక వర్గంలో అనేక ప్రాంతాలను తాము సందర్శించినప్పుడు అనేక ప్రాంతాలు నీట మునిగి ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నట్లు తమకు తెలిసిందని, అన్నారు. గత సంవత్సరంలో కూడా భారీ వర్షాల కారణంగా అనేక ప్రాంతాలు నీట మునిగాయని, దాన్ని దృష్టిలో పెట్టుకొని ఎలాంటి ముందస్తు చర్యలు తీసుకోకపోవడం వల్లనే ఈ సారికూడా అనేక ప్రాంతాలు నీట మునిగి ప్రజలు తీవ్ర ఇబ్బందుల పావుతున్నారని, ప్రభుత్వం చిత్తశుద్ధితో ముందస్తు చర్యలు తీసుకొని ఉంటే ఇలాంటి పరిస్థితి వచ్చేది కాదని అన్నారు. ముంపునకు గురైన ప్రజలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు ధర్మపురి, వంగ లక్ష్మిపతి గౌడ్, సదానందం, వికాస్ కుమార్ యాదవ్, ఎట్టం క్రిష్ణ, జనగామ స్వప్న, వెంకటస్వామి, అల్లావుద్దీన్, జగన్మోహన్, సాగర్, అవోక్ చక్రవర్తి, గణపతి దామోదర్, ఆంజనేయులు, తాటి రాజయ్య తదితరులున్నారు.

# గంగాధరలో భారీ వర్షంతో పోటెత్తుతున్న వరద

**- నిలిచిన రాకపోకలు**

గంగాధర ప్రభాతవార్త:



ఎడతెరిపి లేకుండా కుండపోతతో కురుస్తున్న భారీ వర్షానికి వరదనీరు పొటెత్తింది. వాగులు పొంగి పోర్లుతూ ప్రవహిస్తున్నాయి. వంతెనలు కొట్టుకుపోయి రాకపోకలు నిలిచిపోయాయి. గంగాధర మండలంలో గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు జనజీవనం అతలకుతలం అవుతుంది. పంటలు నీట మునిగాయి. ఇసుక మేటలు వేసి నష్టాల పాలయింది. అన్ని విధాల రైతులు నష్టాలు చవిచుస్తున్నారు. రాకపోకలు నిలిచిపోయాయి. దూర ప్రాంతాల వారు నివాసాలకు చేరుకోలేక అవస్థలు పడుతున్నారు. వంతెనలు చిన్నవిగా ఉండి నీటి ప్రవాహం అదికమావడంతో వంతెలను తెగి రాకపోకలు నిలిచి పోయాయి. గమ్యాస్తానాలకు చేరుకోవాలన్న, అత్యవసర పరిస్థితిలో బయటకు వెళ్లాలన్న దాదాపు 10 కిలోమీటర్లు తిరిగి పోవాల్సి వస్తుందని ప్రజలు చర్చించుకుంటున్నారు.

**- నాగిరెడ్డిపూర్, లక్ష్మీదేవిపల్లి గ్రామాలకు తప్పని తిప్పలు**

భారీ వర్షం పడితే లక్ష్మీదేవిపల్లి, నాగిరెడ్డిపూర్ గ్రామాల సమీపంలో ఉన్న వంతెనలు తెగిపోవడం అరుదుగా జరుగుతుంది. తాత్కాలిక మరమ్మత్తులు చేసి అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు చేతులు దులుపుకుంటున్నారు వరద నీరు వెళ్లే విదంగా శాశ్వతం వంతెన నిర్మాణం చేయడంలో కాలయాపన చేయడం ప్రజలకు ఇబ్బందిగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా భారీ వర్షాల కారణంగా గర్శకుర్తి కురిక్యాల కాసారం బోయినిపల్లి గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. కురిక్యాల వరద కాలువ బ్రిడ్జి వద్ద కరీంనగర్ జగిత్యాల ప్రధాన రహదారికి వరద కాలువ నీరు రోడ్డుపైకి ప్రవహిస్తుంది. ప్రభుత్వ అధికారులు సహాయక చర్యలు చేపట్టి ఇబ్బందులు లేకుండా చూడాలని కోరుతున్నారు.

# ఎడతెరిపి లేనివర్షాలు..... ఇబ్బంది పడుతున్న ప్రజలు

**- పందివాగు పారడంతో రాకపోకలకు అంతరాయం**

చొప్పదండి ప్రభాతవార్త:

గత వారం పదిరోజుల నుండి ఎడతెరిపి లేనివర్షాలు కురవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. నిత్యం కూలీ పని చేసుకుని జీవించే సగటు మనిషి వానబీబాత్సానికి కోలోకోలేని పరిస్థితిలోకి చేరుకుంటున్నారు. గత పదిరోజులుగా వర్షాలు ఎడతెరిపి లేకుండా కురవడంతో కూలీ దొరకక కుటుంబ పోషణకు కూడా ఇబ్బంది పడుతున్నారు. మండల పరిధిలోని అన్ని గ్రామాలలో ఉన్న చెరువులు, కుంటలు ఈ వర్షాలతో పూర్తిగా నిండి జలకళ సంతరించుకుంది. చెరువులు పూర్తిగా నిండడంతో చొప్పదండి పట్టణంలోని కుడి చెరువు మత్తడి దుకుతుంది. ఆలాగే మండల పరిధిలోని పలు గ్రామాలలో మత్తడులు దూకుతున్నాయి. ఆర్నకొండ, రాగంపేట, గ్రామాల మధ్య ఉన్న పందివాగు గత మూడు రోజుల నుండి వర్షాపాతం ఎక్కువ కావడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగి ప్రజలు నానా ఇబ్బందులను ఎదుర్కుంటున్నారు. నిత్యం వర్షాలు కురవడంతో సంతోషించే అన్నదాత కూడా ఈ ఎడతెరిపిలేని వర్షాలకు విత్తనాలు వేయలేక తీవ్ర మనోవేదనకు గురి అవుతున్నారు.



ఇదిలా ఉండగా గురువారం కురిసిన భారీ వర్షానికి చొప్పదండి వట్టణంలోని అతి ప్రాచీనమైన ప్రశస్తి కలిగిన శివకేశవ ఆలయంలో గర్భగుడిలోకి నీరు వెళ్లింది. ఈ వర్షాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కుంటున్నారు. కొందరూ పత్తి నాటిన వారుఈ వర్షాలకు మొక్కలు పోవడంతో రైతన్నలు దిగులు చెందుతున్నారు.

# భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**శాసన సభ్యులు సుంకె రవిశంకర్**

గంగాధర ప్రభాతవార్త:

భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చొప్పదండి శాసన సభ్యులు సుంకె రవిశంకర్ అన్నారు. ఈమేరకు గంగాధర మండలంలోని బూర్గుపల్లి, లింగంపల్లి, ర్యాలపల్లి, చర్లపల్లి (ఆర్) కొండయ్యపల్లి పలు గ్రామాల్లో వరద పరిస్థితిని పరిశీలించి ప్రజలతో మాట్లాడారు. అధికారులతో ఫోన్‌లో రివ్యూ సమావేశం ఏర్పాటు చేశారు. గ్రామ స్థాయి అధికారులు గ్రామాల్లో మండల స్థాయి అధికారులు మండల కేంద్రాల్లో అందుబాటులో ఉండి పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలన్నారు. నారాయనపూర్ రిజర్వాయర్, గ్రామాల్లో చెరువులు కుంటలపై ఎప్పటికప్పుడు పూర్తి సమాచారం తెల్సుకోవాలని, చెరువు కట్టలపై పరిస్థితులను గమనించాలని అన్నారు. ప్రజలు శిథిలావస్థలో ఉన్న ఇండ్లలో ఉండవద్దని, గ్రామాల్లో వర్షాలకు కూలిన ఇండ్లను అధికారులు పరిశీలించి పరిహారం అందజేయడానికి వివరాలు నమోదు చేయాలని అన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు నీట మునిగిన పంటలపై నివేదికలు తయారు చేయాలని అన్నారు. గ్రామాల్లో ప్రజా



ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ప్రజలు ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు.

# ముచ్చటగా మూడోసారి రోడ్డుకు గండి....!!! శాశ్వత చర్యలు ఏవి....???

మల్యాల, ప్రభాత వార్త:

భారీ వర్షాలు, వరదల మూలంగా మల్యాల మండల కేంద్రంలో గల బస్టాండ్ నుండి బైపాస్ రోడ్డుకు వెళ్ళే దారిలో గల రోడ్డును ముచ్చటగా మూడోసారి గండి కొట్టడమైంది. గత రెండేళ్ళ క్రితం భారీ వర్షాల కారణంగా మల్యాల చెరువు మత్తడి దూకి జగ్గని ఒర్రె తో పాటు రావి చెరువు వరద నీటి ప్రవాహంతో పోచమ్మ వాడ జలదిగ్బందం కాగా అప్పుడు బస్టాండ్ నుండి వెళ్ళే రోడ్డును గండి కొట్టడంతో వరద నీటిని మళ్ళించారు. తదుపరి శాశ్వత చర్యలు చేపట్టకుండానే కాలయాపన చేయడం, ప్రజల నుండి విమర్శలు రావడంతో తాత్కాలికంగా మరమ్మత్తు చేసినప్పటికి రెండవ సారి కూడా గత ఏడాది కూడా వరద నీటి ఉధృతికి గండి కొట్టారు. అయితే గ్రామపంచాయతీ నిధులతో 6 నెలల క్రితం మళ్ళీ రోడ్డుపై పైపులతో మరమ్మత్తు చేపట్టినప్పటికి ఈసారి వర్షాలకు మళ్ళీ వరద ఉధృతి ఎక్కువ కావడంతో రోడ్డును ముచ్చటగా మూడోసారి గండి కొట్టడంతో ఈ మార్గం మళ్ళీ మూతపడింది. చెరువు నీళ్ళతో పాటు వరద నీటి ప్రవాహం కు ఇంజనీరింగ్ అధికారులు సరైనా ప్రణాళిక లేకపోవడం వలన మాటిమాటికి రోడ్డు గండి కొట్టే దుస్థితి ఏర్పడుతుందని, పనులు చేపట్టినప్పటికి ప్రజాధనం దుర్వినియోగం అవుతుందని, ఈ రోడ్డుపై శాశ్వతంగా బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలన్న ఆలోచన లేకపోవడం విచారకరమని మల్యాల మండలం బిజెపి అధ్యక్షులు నేరెళ్ళ శ్రవణ్ కుమార్ విమర్శించారు. ప్రతిసారి ఈ దుస్థితి నెలకొనడం ప్రజాధనం వృధా కావడం కాకుండా, ప్రజలకు అవస్థలు అవుతున్న సంగతి అధికారులు గ్రహించాలని ఆయన అన్నారు. ఇప్పటికైనా శాశ్వతమైన ప్రణాళికతో చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.



# చొప్పదండి వార్త

## ప్రజలను అప్రమత్తం చేస్తున్న అధికారులు

చొప్పదండి ప్రభాతవార్త:

గత పది రోజుల నుండి కురుస్తున్న ఎడతెరిపి లేని వర్షాలతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోవద్దని అధికారులు ఎప్పటికప్పుడు ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. ఈ మేరకు మండల తహసీల్దార్ అంబటి రజిత పట్టణ మున్సిపల్ కమీషనర్ పి. శాంతికుమార్‌లు ప్రభుత్వ ఆదేశాల మేరకు తమ సిబ్బందితో అప్రమత్తం చేస్తూ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తక్షణ సహాయక చర్యలు తీసుకుంటున్నారు.

## పంది వాగుపై హైలేవల్ బ్రిడ్జి నిర్మించాలి

చొప్పదండి ప్రభాతవార్త:



మండల పరిధిలోని రాగంపేట పందివాగుపై హైలేవల్ బ్రిడ్జి నిర్మించాలని ఎంపిటిసిల ఫోరం మండల కన్వీనర్ సింగిరెడ్డి క్రిష్టారెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. పందివాగుపై ప్రతియేటా వర్షాకాలంలో నీటి ఉధృతి పెరిగి రోడ్డుమీదికి నీరు రావడంతో రాకపోకలు నిలిచిపోతున్నాయని అన్నారు. చొప్పదండి నుండి ఆర్నకొండ రాగంపేట మీదుగా జగిత్యాలకు ఆర్‌టిసి బస్సు వెళ్తుందని ప్రతియేటా వర్షాలు పడితే ప్రజలు ఇబ్బందులకు గురి అవుతున్నారని అన్నారు. ఈ ప్రాంతంలో ఉన్న ప్రజలు అత్యవసర పరిస్థితులలో వైద్య సేవలకు కాని, ఇతర సేవలకు కాని వెళ్లాలంటే నీటి ఉధృతి కారణంగా ఇబ్బందులు పడవల్సి వస్తుందని అన్నారు. గత బుధవారం రాత్రి ఒక గర్భిణీ స్త్రీ అత్యవసరంగా కరీంనగర్ ఆసుపత్రికి 108లో వెళ్లవల్సి వస్తే రాగంపేట నుండి రామడుగు, వెదిర నుండి కరీంనగర్ చేరుకోవల్సి వచ్చిందని అవేదన చెందారు. తక్షణమే ఆర్నకొండ, రాగంపేట గ్రామాల మధ్య ఉన్న పందివాగుపై హై లేవల్ బ్రిడ్జి నిర్మించాలని డిమాండ్ చేశారు.

## వర్షాలకు నష్టపోయిన ఇండ్లకు నష్టపరిహారం ఇవ్వాలి

చొప్పదండి ప్రభాతవార్త:



గత పది రోజుల నుండి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు నష్టపోయిన ఇండ్లను అధికారులు పరిశీలించి తక్షణమే నష్టపరిహారం చెల్లించాలని బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల లక్ష్మీనారాయణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇల్లు కట్టుకునే స్థోయిలో నిరుపేదలు లేరని వారికి డబుల్ బెడ్‌రూమ్ అందించి అదుకోవాలని అన్నారు. అధికారులు స్పందించకుంటే బిజెపి ఆద్వర్యంలో ప్రభుత్వ కార్యాలయాలను ముట్టడించి ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

## రెడ్డిలపై చేసిన మాటలు ఉపసంహరించుకోవాలి

జగిత్యాల టౌన్,ప్రభాతవార్త :

పేద రెడ్లకు నష్టం జరిగేలా రెడ్ల జనాభా కేవలం 5 శాతం ఉన్నారని రెడ్లను తగ్గించే విధంగా మాట్లాడిన ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి వెంటనే తన మాటలు ఉపసంహరించుకోవాలని జగిత్యాల జిల్లా రెడ్డి ఐక్యవేదిక అధ్యక్షులు నేరెళ్ళ భూమారెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.ఐదు శాతం రెడ్లకు 10 శాతం రిజర్వేషన్లపై మాట్లాడడం శోచనీయమన్నారు.ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు అనేవి అగ్రవర్ణ (రెడ్డి,బ్రాహ్మణ, వెలమ,కమ్మ,మార్వాడి,క్షత్రియ,రిజర్వేషన్లు అందని ముస్లిం,తదితరులు) కులాల్లోని పేదలందరికీ వర్తించేవి,కేవలం రెడ్లకు మాత్రమే కాదని అన్నారు.కేంద్ర ప్రభుత్వం 2019లో దేశ వ్యాప్తంగా అగ్రవర్ణ పేదలకు రిజర్వేషన్లు అందని ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు విద్య,ఉద్యోగాలలో అవకాశాలు కలిపించాలనే ఉద్దేశ్యంతో ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు పార్లమెంటులో చట్టం చేసి అమలు చేస్తున్నారు.దేశవ్యాప్తంగా దాదాపు 25 శాతం వరకు ఓసి జనాభా ఉందని తెలంగాణలో సమగ్ర కుటుంబ సర్వే ఆధారంగా ఓసి జనాభా 19 శాతం వరకు ఉంటుందని తెలిపారు.అదే విధంగా మన తెలంగాణలో ఆరె క్షత్రియ లాంటి తదితర కులాలకు ఓబిసి జాబితాలో లేవు.ఇక్కడ రెడ్లు ఓసి కానీ కర్నాటకలో బిసి,ఇక్కడ కాపు బిసి కానీ ఆంధ్రప్రదేశ్‌లో ఓసి,ఇక్కడ లంబాడీలు ఎస్టీ కానీ,రాజస్థాన్‌లో ఓసి రాష్ట్రానికి ఒక రకంగా ఉంది.వెంటనే తన మాటలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

# పాలకుల నిర్లక్ష్యం వల్లనే వేములవాడకు రాకపోకలు బంద్

- భారీ వర్షాలతో జలమయమైన కాలనీలో పర్యటన
- బాధితులకు అండగా ఉంటాం
- కాంగ్రెస్ నాయకులు ఆది శ్రీనివాస్



వేములవాడ, ప్రభాతవార్త : పాలకుల నిర్లక్ష్యం వల్లనే వేములవాడ వరద నీటితో అష్టదిగ్బంధనం అయ్యిందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు ఆది శ్రీనివాస్ ఆరోపించారు. 50 సంవత్సరాల తండ్రి కొడుకుల నిర్లక్ష్యపు పాలన వల్లనే వేములవాడకు వచ్చే అన్ని ప్రధాన రహదారులు వరద నీటిలో మునిగిపోయి రాకపోకలు స్తంభించాయని అన్నారు. వరుసగా కురుస్తున్న వర్షాలకు వేములవాడలో జలమయం అయిన లోతట ఉట ప్రాంతాలను స్థానిక నాయకులతో కలిసి ఆది శ్రీనివాస్ పరిశీలించారు. బాధితులకు పండ్లు, బిస్కట్‌లు పంపిణీ చేశారు. లోతట్టు ప్రాంతాల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను కోరారు. అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ 50 సంవత్సరాల తండ్రి కొడుకుల పాలనలో వేములవాడ అష్టదిగ్బంధనం అయ్యిందన్నారు. ఎమ్మెల్యే అంటే కేవలం హోదాగా భావిస్తున్నారని, కష్టకాలంలో ప్రజలకు అందుబాటులో ఉండని ఎమ్మెల్యే ఎందుకని ప్రశ్నించారు. వేములవాడ చుట్టూ అన్ని ప్రధాన రహదారిలో లోలెవెల్ వంతెనలే ఉన్నాయి తప్ప ఎక్కడ కూడా హై లెవెల్ వంతెనలు నిర్మించిన పాపాన పోలేదని అన్నారు. అత్యవసరమైతే హాస్పిటల్‌కు వెళ్లేదారి లేక పరిసర గ్రామాల ప్రజలు ఇబ్బందుల్లో ఉన్నారని ఆది శ్రీనివాస్ అన్నారు. కరోనా సమయంలో ప్రజలను ఆదుకోవడానికి ఎమ్మెల్యే అందుబాటులో లేడని, ఇప్పుడు వర్షాలతో అతలాకుతలమవుతున్న ప్రజలకి అండగా ఉండాల్సిన ఎక్కడ ఉన్నాడని ఆది శ్రీనివాస్ ప్రశ్నించారు. చాలా ప్రాంతాల్లో పంట పొలాలు వరద నీటిలో మునిగిపోయాయని రైతులకు ప్రభుత్వం అండగా ఉండాలని కోరారు. ఎల్లప్పుడూ అభివృద్ధిపై మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరద నీటికి అన్ని రహదారులు మూసుకుపోయిన సందర్భంలో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. వరదలు వచ్చినప్పుడల్లా అధికారులు, పాలకులు వచ్చి పరిశీలించడం తప్ప,శాశ్వత పరిష్కారం చేసిందేమీ లేదని అన్నారు. నియోజకవర్గ ప్రజలు ఇక్కడి పాలకుల తీరును గమనించాలని కోరారు.

# విపత్తు సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండండి..

- బేడ, బుడగ జంగాల కుటుంబాలకు డబుల్ . బెడ్‌రూం ఇండ్లు నిర్మిస్తాం
- ఇండ్లు మునిగిన 35 బుడగ జంగాల కుటుంబాలకు రూ.3 వేలు చొప్పున నష్టపరిహారం చెల్లింపు
- వ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకోండి
- వరద నష్ట ప్రాంతాల్లో శాసన సభ్యులు చెన్నమనేని రమేష్‌బాబు పర్యటన



వేములవాడ, ప్రభాతవార్త : విపత్తు సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్‌బాబు అన్నారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ రామ తీర్థపు మాధవి రాజు, కౌన్సిలర్, అధికారులతో కలిసి పట్టణంలో వర్షాభావ లోతట్టు ప్రాంతాలను మరియు శాత్రాజుపల్లి రోడ్డు, బతుకమ్మ తెప్ప, సబ్‌స్టేషన్, లాలపల్లి కట్టు కాలువ, చెక్కపల్లి రోడ్డు బ్రిడ్జి, మల్లారం రోడ్డు ప్రాంతా లను సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో వేములవాడలో కూడా అత్యధిక వర్షం నమోదైందని అన్నారు. ఒకప్పుడు కరువు ప్రాంతం నుండి సస్య శ్యామలంగా మారిందని, ఇలాంటి విపత్తు సమయాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. కరెంటు నీటి విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అవసరమైతేనే ప్రజలు ప్రయాణాలు చేయాలన్నారు. బేడ బుడగ జంగాల కుటుంబాలకు శాశ్వ పరిష్కారానికి డబుల్ బెడ్‌రూం ఇండ్లు నిర్మాస్తామన్నారు. రాబోయే రోజుల్లో వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. కొంతవరకు ఆర్థిక నష్టం జరిగిందని ప్రాణ నష్టం జరగకుండా అధికార యంత్రాంగంతో ఎప్పటికప్పుడు సమీక్షలు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు మారం కుమార్, యాచమనేని శ్రీనివాస్, కుమ్మరి శ్రీనివాస్, జోగిని శంకర్, సిరిగిరి చందు, బాబూన్, పార్టీ పట్టణ అధ్యక్షులు పుల్కం రాజు, పార్టీ నాయకులు నామాల లక్ష్మిరాజం, యాస తిరుపతి, రామతీర్థపు రాజు, గూడూరి మధు, కృపాల్, రాము, ఎంఆర్‌వో రాజిరెడ్డి, కమిషనర్ అన్వేష్, పట్టణ సిఐ కరుణాకర్, ఆర్అండ్‌బి డిప్యూటీ ఈఈ శాంతయ్య పాల్గొన్నారు.

# దంచికొడుతున్న వానలు...

- నిలిచిపోయిన రవాణా...
- జలమయమైన లోతట్టు ప్రాంతాలు...
- ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు, వంకలు...

వేములవాడ, ప్రభాతవార్త : వరుసగా కురుస్తున్న వర్షాలతో జిల్లా వ్యాప్తంగా వాగులు వంకలు పొంగిపొర్లుతుండడంతో రాకపోకలు నిలిచిపోయాయి. వేములవాడ నియోజకవర్గ వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలకు అనేక చోట్ల రాకపోకలు నిలిచిపోయాయి. నిమ్మపల్లి చెరువు అలుగుపారడంతో మూలవాగు ఉధృతంగా ప్రవహిస్తుంది. పట్టణంలోని బ్రిడ్జి వద్ద ప్రమాదకర స్థాయిలో దాదాపు బైపాస్‌ను ఆనుకొని మూలవాగు పరవళ్లు తొక్కుతుంది. వాగు సమీపంలో గల గంగమ్మ ఆలయంలోకి వరద నీరు వచ్చింది. వేములవాడకు వచ్చే అన్ని ప్రధాన రహదారుల్లో వరద నీటితో రాకపోకలు స్తంభించాయి. వేములవాడ నుండి జగిత్యాల వెళ్లే దారిలో శాత్రాజుపల్లితో పాటు ఫాజుల్‌నగర్ ఎల్లమ్మ వద్ద కల్వర్టుపై ప్రమాదకరంగా వరద నీరు ప్రవహిస్తుండడంతో పోలీసులు బారీకేడ్లు ఏర్పాటు చేశారు. మల్లారం వెళ్లే దారితో పాటు కోరుట్ల వెళ్లే దారిలో మర్రిపల్లి వద్ద రహదారిపై వరదనీరు ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. వేమలువాడలోని లోతట్టు ప్రాంతాలైన బేడ బుడగ జంగాల కాలనీ, సౌరాల కాలనీ పూర్తిగా నీట మునిగాయి. చెక్కపల్లి రోడ్డులోని సబ్ స్టేషన్ నీట మునగడంతో పట్టణంలోని పలు ఏరియాల్లో ఉదయం 9 గంటల నుండి 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచి పోయింది. వేములవాడ చెరువు నిండుకుండను తలపిస్తోంది. భారీ వర్షాలతో ఓవైపు రైతన్నలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. సాగు, తాగునీటికి ఈ యేడు కొదవ ఉండదని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. భారీ వర్షంతో పట్టణం కర్ఫ్యూని తలపించింది. ఉదయం నుండి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. పట్టణంలోని కొన్ని రోడ్లు చిన్నపాటి కాలువలా తలపించాయి. శుక్రవారం కూడా వర్షం ఉంటుందనే నేపథ్యంలో ప్రజలు అప్రత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. భారీ వర్షం నేపథ్యంలో శుక్రవారం కూడా పాఠశాలకు ప్రభుత్వం సెలవు ప్రకటించిన విషం తెలిసిందే.



# వేములవాడ వార్త

## భారీ వర్షాలు.. అప్రమత్తమైన జిల్లా పోలీసు యంత్రాంగం...

- వేములవాడలో జిల్లా ఎస్పీ క్షేత్ర స్థాయి పర్యటన..



వేములవాడ, ప్రభాతవార్త : గత మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా భారీ వర్షాలు కురుస్తుండడంతో జిల్లా పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. ఎక్కడా ఎలాంటి సంఘటనలు చోటుచేసుకోకుండా సహాయక చర్యలు చేపట్టారు. జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ వేములవాడ పట్టణంలో అధికారులతో కలిసి క్షేత్ర స్థాయిలో పర్యటించి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జలమయమయ్యే ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలిస్తున్నారు. ప్రమాదాల బారినపడకుండా వంతెనలపై రాకపోకలు నిషేధించి బారికేడ్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి గ్రామ ప్రజలను అప్రమత్తం చేస్తున్నట్లు తెలిపారు. 12 మందితో జిల్లా డిఆర్‌ఎఫ్ బృందం 24 గంటలు అందుబాటులో ఉంటుందని తెలిపారు. పిల్లలు, యువకులు సెల్ఫీలు తీసుకోవడానికి ఈత కొట్టడానికి నీటి ప్రవాహాల దగ్గరికి వెళ్లకుండా తల్లిదండ్రులు దృష్టిసారించాలన్నారు. విపత్కర సమయాల్లో సాయం కోసం డయల్ 100కి లేదా దగ్గరలోని పోలీసులకు సమాచారం అందిస్తే తక్షణ సాయం చేపడుతామన్నారు.

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి...

- సిఐ కిరణ్ కుమార్

రుద్రంగి, ప్రభాతవార్త : రుద్రంగి మండలంలో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి వాగులు వంకలు పొంగిపొర్లుతుండడంతో పాటు రానున్న రెండు రోజుల్లో అతి భారీ వర్షాలు పడనున్న నేపథ్యంలో మండల ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని చందుర్తి సిఐ కిరణ్ కుమార్ అన్నారు. రుద్రంగి మండల కేంద్రంలోని నందివాగు, గండి వెంకటేశ్వరస్వామి ఒర్రె వరద ఉధృతి తీవ్రంగా రావడంతో పోలీసు సిబ్బంది ఎక్కడి వాహనాలు అక్కడే సుమారు రెండు గంటలపాటు నిలిపివేశారు. వరద ఉధృతి తగ్గిన తర్వాత వాహనాలను అనుమతించారు. మానాలలో తాతమ్మ చెరువు వద్ద భారీగా వరద నీరు రావడంతో ఉధృతంగా ప్రవహిస్తుండడంతో బారీకేడ్లు ఏర్పాటు చేసి గ్రామాలకు రాకపోకలు నిలిపివేశారు. రుద్రంగిలో చిన్న మల్లయ్య ఇల్లు కూలిపోయింది. రానున్న రెండు రోజుల్లో అతి భారీ వర్షాలు పడనున్న నేపథ్యంలో మండల ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని, వాహనదారులు వెళ్లే సమయంలో కల్వర్టుల వద్ద జాగ్రత వహించాలని సిఐ కిరణ్ కుమార్ సూచించారు.

## మూలవాగును సందర్శించిన ఎమ్మెల్యే

వేములవాడటౌన్, ప్రభాతవార్త :



భారీ వర్షాల నేపథ్యంలో ఉధృతంగా ప్రవహిస్తున్న వేములవాడ మూలవాగును ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్‌బాబు గురువారం సందర్శించారు. వారివెంట మున్సిపల్ ఛైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి రాజు కమిషనర్ అన్వేష్, తహసీల్దార్ రాజిరెడ్డి, బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు పుల్కం రాజు, నాయకులు ఉన్నారు.

# భారీ వర్షాలతో ఉప్పొంగుతున్న నదులు

## - నీట మునిగిన నాగెపల్లి గ్రామం వేలాది ఎకరాలు పంట నీటిపాలు

మంథని - ప్రభాతవార్త

భారీవరా ్షలు వాటికి తోడు ఉప్పొంగి ప్రవహిస్తున్న నదులతో గురువారం మంథని మండలంలోని గ్రామాలు జలమయమై పోతున్నాయి. మండలంలో గోదావరినది, మానేరు, బొక్కలవాగుతో పాటు అనేక చిన్న చిన్న వాగులు ప్రమాదస్థాయిలో ప్రవహిస్తున్నాయి. దీనితో పాటు ఎడతెరపి లేకుండా కురస్తున్నభారీ వర్షంతో గ్రామాల్లోని నీరు బయటకు వెళ్లే పరిస్థితి లేకపోవటంతో గ్రామాలన్ని జలమయమై పోతున్నాయి. గోదావరినదిపైన ఉన్న ప్రాజెకు ్టలన్ని గేట్లు ఎత్తివేయటంతో గోదావరినది గంట గంటకు పెరిగిపోతుంది. మానేరునది ఉప్పొంగి ప్రవహించటంతో పక్కనే ఉన్న నాగెపల్లి గ్రామం వరదనీటిలో మునిగిపోయింది. విషయం తెలుసుకున ్న ఎంపిడివో రమేశ్ హుటాహుటిన తన సిబ్బందితో గ్రామానికి చేరుకుని వరదనీటిలో చిక్కుకున్న వారిని ముంపుకు గురైయే ్య వారిని క్షేమంగా బయటకు తీసుకవచ్చి వారికి స్థానిక గ్రామపంచాయితీ కార్యాలయం వద్ద పునరావాసం ఏర్పాటుచేశారు. వారికి కావల్సి న సహాయక చర్యలను చేపట్టారు. శ్రీరాంసాగర్, కడెం ప్రాజెక్టు, ఎల్లంపల్లి ప్రాజెక్టు, పార్వతీబ్యారేజీ గేట్లు ఎత్తి దిగువకు నీటని విడుదల చేయటంతో గోదావరి పరివాహక గ్రామాలైన సిరిపురం, బెస్తేపల్లి, ఎక్లాస్‌పూర్, ఖాన్‌సాయిపేట గ్రామాల ప్రజలను ముందస్తుగా సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు ఎంపిడివో రమేశ్ తెలిపారు. అదేవిధంగా లోయర్ మానేరుడ్యాం గేట్లను సైతం ఎత్తి దిగువకు నీటిని విడుదల చేయటంతో మానేరు పరివాహక గ్రామాలైన గోపాల్‌పూర్, చిన్నఓదాల, సోమన్‌పల్లి, నాగెపల్లి, వెంకటాపూర్ గ్రామాల్లో ముంపుకు గురైయ్యే ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు ఆయన తెలిపారు. పునరావాస కేంద్రాలకు తరలించిన వారికి కావలసిన ఏర్పాట్లను చేస్తున్నట్లు ఆయన తెలిపారు.



### - మంథని పట్టణంలో లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేసి చైర్‌పర్సన్

మంథని పట్టణంలో భారీవర్షం కురియటంతో పాటు గోదావరినది ఉధృతంగా ప్రవహిస్తు బొక్కలవాగుసైతం ప్రమాదస్థాయిలో ప్రవహిస్తుండటంతో గతంలో లాగా బొక్కలవాగు బ్యాక్ వాటర్ తో లోతట్టు ప్రాంతాల్లోకి వరద నీరు వచ్చే అవకాశాలు ఉన్నాయని ప్రజలను మున్సిపల్ చైర్‌పర్సన్ పుట్ట శైలజ హ్యాండ్ మైక్‌ద్వార అప్రమత్తం చేశారు. పట్టణంలోని అంబేద్కర్ నగర్‌తో పాటు బోయినిపేట, దొంతులవాడ, మ ర్రివాడ, లైన్‌గడ్డ ప్రాంతాల ప్రజలను ఆమె అప్రమత్తం చేశారు. అదేవిధంగా పట్టణ శివారులోని మాతాశిశు ఆరోగ్య కేంద్రం గోడలవరకు వరదనీరు వచ్చిచేరటంతో ఇంకా వర్షంతో పాటు బొక్కలవాగు బ్యాక్ వాటర్ వచ్చే ప్రమాదం ఉందని ఆసుపత్రిలోని పేషెంట్లను, విలువైన సామాగ్రి మంథని పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చిన్నపిల్లల తల్లులను తరలించే సమయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పుట్ట శైలజ, వైస్ చైర్మన్ ఆరెపల్లి కుమార్ దగ్గరుండి ఏర్పాట్లు చేశారు. వరదల మూలంగా మాతాశిశు ఆసుప త్రిలోని పేషెంట్లను తాత్కాలికంగా మంథని ప్రభుత్వ ఆసుపత్రికి తరలిసు ్తన్నామని ఎమర్జన్సీ ఉండే గర్భిణీలు మంథని ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చి వైద్యసేవలు పొందాలని ఆసుపత్రి సూపరిండెంట్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

# మంథని వార్త

## ఇండియా వెస్టిండీస్ క్రికెట్ సిరీస్‌కు తెలుగు వాఖ్యాతగా విజయ్

మంథని - ప్రభాతవార్త



భారతదేశంలో జరుగుతున్న వెస్టిండీస్, ఇండియా క్రికెట్ సిరీస్‌కు సంబంధించిన తెలుగులో వాఖ్యానం చేయటానికి మంథనికి చెందిన మహావాది విజయ్‌కుమార్‌కు అవకాశం దక్కింది. ఈ సిరీస్‌లో 3వన్డేలు, 5 టి 20 మ్యాచ్‌లకు విజయ్‌కుమార్‌కు తెలుగు కామెంటరీ చెప్పటానికి అవకాశం రావటం పట్ల ఆయన అరుదైన గౌరవం దక్కింది. ఈ వాఖ్యానం తొలిసారిగా డిడి స్పోర్ట్ ్స , డిడి యాదగిరిలో తొలిసారిగా ప్రవేశపెట్టే ఈ వాఖ్యానంలో విజయ్‌కుమార్ స్థానం దక్కించుకోవటం విశేషం. గతంలో స్టార్‌స్పోర్ట్సు,జియో టివి, ప్రైమ్ వీడియో తదితర భాషల్లో మాత్రమే తెలుగులో కామెంటరీ ఉండేది.. రోజురోజుకు క్రికెట అభిమానులు పెరుగటంతో ప్రాంతీయ భాషల్లో కామెంటరీని ప్రవేశపెట్టారు. ఈనెల 27నుండి ఆగస్టు 13వరకు జరిగే ఇండియా - వెస్టిండీస్ జట్ల మధ్య జరిగే వన్డే, టి 20 మ్యాచ్‌లను విజయ్‌కుమార్ తెలుగులో కామెంటరీ చెప్పనున్నారు. గత 15 సంవత్సరాల నుండి విజయ్‌కుమార్ క్రికెట్‌తో పాటు వివిధ క్రీడలను అనేక టివి చానెళ్ల ద్వార కామెంటరీ చెప్పారు. ప్రస్తుతం తొలిసారిగా దూరదర్శన్‌లో తెలుగులో కామెంటీర చెప్పటానినకి అవకాశం రావటం పట్ల పలువురు క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# భారీ వర్షాలతో జలదిగ్భంధంలో వీణవంక మండలం

## నీట మునిగిన పంట పొలాలు

వీణవంక, ప్రభాత వార్త:

బంగాళఖాతంలో ఏర్పడిన అల్పపీడనంతో గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు వీణవంక మండలం గురువారం జలదిగ్భంధంలో చిక్కుకుంది. భారీ వర్షాలతో మండలంలోని పోతిరెడ్డి పల్లి, మామిడాలపల్లి, బేతిగల్, కనపర్తి, కోర్కల్ తదితర గ్రామాల్లోని చెరువులు, కుంటలు, మత్తల్లు పొంగి పోర్లడంతో పాటు వాగులు ఉప్పొంగడంతో మండలంలోని కనపర్తి లో వరద ఉధృతి వీణవంక వెళ్ళే రహదారి తెగి గ్రామంలోని ఇండ్లలోకి వరద నీరు చేరింది. అదే విధంగా మామిడాలపల్లి ఇండ్లలో కి వరద నీరు చేరింది. నర్సింగాపూర్‌లో గంగాది చెరువు వరద ఉధృతి జమ్మికుంట, వీణవంక, కరీంనగర్ వెళ్ళే రహదారిపై ప్రవహించడంతో రవాణ సౌకర్యాలు నిలిచిపోయి ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మండలంలోని మామిడాలపల్లి, పోతిరెడ్డిపల్లి వద్ద వీణవంక వాగు ప్రవాహానికి రవాణా సౌకర్యాలు స్తంభించి పోయాయి. అంతే కాకుండా వేలాది ఎకరాల్లో వరి, పత్తి పంటలు



నీటమునిగాయి. అంతేగాక మామిడాలపల్లి, కోర్కల్, బ్రహ్మణపల్లి, వీణవంక, చల్లూరు తదితర గ్రామాల్లో వర్షానికి కూలిపోయాయి. మండల తహాశీల్దార్ దండిగా రాజయ్య ఆధ్వర్యంలో గ్రామాల్లో రెవెన్యూ, పోలీస్ సిబ్బంది ప్రజా ప్రతినిధులకు, ప్రజలకు ఆధైర్యపడొద్దని సూచనలు చేశారు. కాగా అధికారుల ద్వారా సమాచారం అందుకున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్ రెడ్డి వరద ప్రాంతాల్లో పర్యటించారు.

## భారీ వర్షాలతో నష్టపోయిన ప్రజలను ప్రభుత్వం ఆదుకోవాలి

వీణవంక, ప్రభాత వార్త:

అల్పపీడనంతో గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో నీట మునిగిన వరి, పత్తి పొలాలలో పాటు కూలిన ఇండ్లను, వరద ప్రవాహంతో దెబ్బతిన్న చెరువులు, కుంటలు రోడ్లను అధికారులు ముంపు ప్రాంతాలను పరిశీలించి సహాయక చర్యలు చేపట్టి నష్టపోయిన వారిని ప్రభుత్వం ఆదుకోవాలని హుజురాబాద్ బిజెపి అసెంబ్లీ కన్వీనర్ మాడ గౌతం రెడ్డి, మండల బిజెపి నేతలు మోటం వెంకటేష్, ఉడుత కుమార్ లు గురువారం కోరారు.

## పిఎం మోడీ హయాంలో రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, భూసార పరీక్షలు

పెద్దపల్లి, ప్రభాతవార్త.

ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ రాజస్థాన్ నుంచి వర్చువల్ కిసాన్ సమృద్ధి కేంద్రాలను ప్రారంభించారు. ఇందులో భాగంగా గురువారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలో జెండా చౌరస్తా వద్ద గల అమర్ చంద్ కల్యాణ మండపంలో పెద్దపల్లి ఫర్టిలైజర్ అసోసియేషన్, నర్మద, బయో కంపెనీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రైతులతో కలిసి బిజెపి నాయకులు నరేంద్ర మోడీ ప్రసంగాన్ని వీక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు రావుల రాజేందర్ మాట్లాడుతూ భారత దేశంలో ఉన్న రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, ఫర్టిలైజర్స్, భూసార పరీక్షలు, సీడ్స్ టెస్ట్ ఇలా అన్ని సేవలు ఒకే దగ్గర రైతులకు అందుబాటులోకి తీసుకు వచ్చే విధంగా ప్రధాని నరేంద్ర మోడీ కృషి చేస్తున్నారని అన్నారు. వీటిలో సల్ఫర్ కోటెడ్ యూరియాను అందుబాటులోకి తీసుకొస్తున్నారు. దేశంలో 2.8లక్షల దుకాణాలను కిసాన్ సమృద్ధి కేంద్రాలుగా అప్ గ్రేడ్ చేయనున్నారు. తొలి దశలో 1.25లక్షల సేవా కేంద్రాలను ప్రధాని నేడు ప్రారంభిస్తున్నారని పేర్కొన్నారు. డిఎపి, యూరియాపై సబ్సిడీ ఇస్తున్న ఘనత కూడాద భారతీయ జనతా పార్టీ కేంద్ర ప్రభుత్వంకు దక్కుతుందని అన్నారు. అలాగే 2500 కోట్ల రూపాయలతో వివిధ పాఠశాలలు, కేంద్ర విశ్వ విద్యాలయాలు కూడా ప్రారంభించడం జరిగిందని తెలిపారు.



కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శీలారపు పర్వతాలు, దాడి సంతోష్, తంగేడ రాజేశ్వర్ రావు, రాజం మహంత కృష్ణ, పొల్సాని సంపత్ రావు, మేకల శ్రీనివాస్, వేల్పుల రాజన్న, ఎర్రోళ్ల శ్రీకాంత్, ఉప్పు కిరణ్, వేణు గౌడ్, గుడ్ల సతీష్, తూముల రవి తేజ, పోగుల రాజన్న, సోడా బాబు, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మత్తడి దుంకుతున్న చెరువులు

సైదాపూర్, ప్రభాత వార్త:



సైదాపూర్ మండలంలో బుధవారం రాత్రి 20 సెంటీమీటర్ల వర్షం కురిసింది. అతి భారీ వర్షానికి పలు గ్రామాల చెరువులు, కుంటలు, వంకలు పొంగి పోర్లుతున్నాయి. పలు గ్రామాలకు భారీ వరదల కారణంగా రాకపోకలకు తీవ్రంగా అంతరాయం కలగడం వలన ప్రజలకు ఇబ్బందులు ఎదురైయ్యాయి. సైదాపూర్ మండలం సోమారం గ్రామంలో ఆదర్శ పాఠశాల వసతి గృహం జల దిగ్భంధం కావడం వలన 60 మంది విద్యార్థులు చిక్కుకుపోగా సైదాపూర్ ఎస్ఐ జన్ను ఆరోగ్యం తన సిబ్బందితో సంఘటన స్థలానికి చాకచాక్యంగా గ్రామస్థుల సహకారంతో 60 మంది విద్యార్థులను సురక్షితంగా ఒడ్డున చేర్చారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఏమైనా ఇబ్బందులు తలెత్తితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్ఐ తెలిపారు.

# సిఎం కెసిఆర్ అసమర్థ నిర్ణయంతో నిరుద్యోగులకు అన్యాయం

<u>జగిత్యాల బ్యూరో,ప్రభాతవార్త :</u>

రాష్ట్రంలో సిఎం కెసిఆర్ నియంత పాలనతో అసమర్థ నిర్ణయాలతో నిరుద్యోగులకు అన్యాయం జరగడంతో పాటు తెలంగాణలో రెవెన్యూ వ్యవస్థ నిర్వీర్యం అవుతుందని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పేర్కొన్నారు.జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఇందిరాభవన్‌లో గురువారం పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జీవన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాల్లో ప్రజలకు తోడుగా నిలిచే విఆర్ఓ,విఆర్ఏ వ్యవస్థ రద్దుతో రెవెన్యూ వ్యవస్థను నిర్వీర్యం చేశారని,రెవెన్యూ వ్యవస్థ ప్రభుత్వానికి రెండు కండ్లు,చెవులు అన్నారు.ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు,వివరాల సేకరణ,కులం,నివాస,కుటుంబ సర్టిఫికేట్,కళ్యాణలక్ష్మి పథకాలు,అమలులో క్షేత్రస్థాయిలో రెవెన్యూ వ్యవస్థ కీలకమన్నారు.ఎన్నికల నిర్వహణలో అధికారులకు గ్రామస్థాయిలో తోడుగా నిలిచేది విఆర్‌వోలు,విఆర్ఏలు ఎంతో అవసరం అన్నారు.తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుతో ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీతో పాటు,అదనంగా పోస్టులు భర్తీ చేస్తారని భావించి తెలంగాణ ఉద్యమానికి విద్యార్థులు,నిరుద్యోగులు బాటలు వేశారు.అదనంగా ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పి,కనీసం ఖాళీగా ఉన్న ఉద్యోగాలను కూడా భర్తీ చేయడం లేదని,ఉన్న ఉద్యోగాలను రద్దు చేసి నిరుద్యోగుల పొట్టగొడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.33 జిల్లాలు ఏర్పాటుతో పరిపాలన సౌలభ్యంతో పాటు అదనంగా ఉద్యోగాలు పెరుగుతాయని భావిస్తే కనీసం 23 ఉద్యోగాలు కూడా సృష్టించలేదని ధ్వజమెత్తారు.రేషనలైజేషన్ నెపంతో ఉపాధ్యాయుల పోస్టులు భర్తీ చేయడం లేదు.కనీసం పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలు కూడా భర్తీ చేయడం లేదని అన్నారు.ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేయాల్సి ఉండగా,వివిధ శాఖలలో ఖాళీగా ఉన్న ఉద్యోగాల్లో వీఆర్వో పోస్టులు 18 వేలు,విఆర్ఏ పోస్టులు 22 వేలు సర్దుబాటు చేసి 40 వేల ఉద్యోగాలు కనుమరుగు చేశారని ఆరోపించారు.తెలంగాణ రాష్ట్రంలో 40 వేల ఉద్యోగాలు రద్దు చేసి నిరుద్యోగుల నోట్లో మట్టికొట్టారని దుయ్యబట్టారు.తెలంగాణ ఇందుకే సాధించుకున్నామా అని ఆవేదన వ్యక్తం చేశారు.నేడు ధరణిలో ఎకరానికి రూ.2500 ఫీజు వసూలు చేస్తున్నారని,ధరణితో సామాన్యులపై మరింత భారం వేస్తున్నారని,దరణికి రైతుబంధుకు సంబంధం ఏమిటని ప్రశ్నించారు.ఖరీఫ్ ఆరంభించి నెల రోజులు గడుస్తున్నా నేటికి పెట్టుబడి సాయం పూర్తిగా అందించలేదని,గత నెల 26 నుండి రోజుకో ఎకరం



చొప్పున రైతు బందు ఇస్తామని చెప్పి నెల రోజులు గడుస్తున్న ఎందుకు ఇవ్వడం లేదని నిలదీశారు.ధరణి ఉన్నా రైతు బంధు ఎందుకు ఇవ్వడం లేదని అన్నారు.వీఆర్వో,విఆర్ఏ ఉద్యోగులు రెవెన్యూ రికార్డుల పరిశీలనకు పరిమితం అయిన వారు మాత్రమే కాదు.రికార్డుల పరిశీలన ఒక భాగం మాత్రమేనన్నారు.విఆర్ఏలను లష్కర్,జూనియన్ అసిస్టెంట్,రికార్డు అసిస్టెంట్‌లుగా నియమించనుండడంతో తహాశీల్దార్‌గా పదోన్నతి పొందే అవకాశాలు కోల్పోతున్నారు.కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేస్తామని అన్నారు.క్షేత్రస్థాయిలో రెవెన్యూ రేషన్‌కార్డు జారీ నిరంతర ప్రక్రియ చేస్తామని,కళ్యాణలక్ష్మితో పాటు రేషన్‌కార్డు జారీ చేస్తామని,ఇళ్లులేని వారికి అర్హత ప్రాతిపదికన ఇళ్లు కేటాయిస్తామని అన్నారు.విఆర్ఏ,విఆర్‌వో రెవెన్యూ శాఖలో తిరిగి కొనసాగించడం కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచి అమలు చేస్తామని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి స్పష్టం చేశారు.ఆరు నెలల్లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.ప్రభుత్వం తక్షణమే రైతుబంధు విడుదల చేయాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో పిసిసి కార్యదర్శి బండ శంకర్,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గాజంగి నందయ్య,మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కల్లెపల్లి దుర్గయ్య,మాజీ కౌన్సిలర్ గాజుల రాజేంధర్,రేపెల్లి హరికృష్ణ,పుప్పాల అశోక్,చందా రాధాకిషన్,గుంటి జగదీశ్వర్,జగిత్యాల మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జున్ను రాజేంధర్,పిసిసి ఎన్ఆర్ఐ సెల్ కన్వీనర్ చాంద్‌పాషా,మామిడిపెల్లి మహిపాల్ పాల్గొన్నారు.

# రానున్న 24 గంటలు అప్రమత్తంగా ఉండాలి

<u>కరీంనగర్ ప్రభాతవార్త:</u>

జిల్లాలో నిరంతరాయంగా కురుస్తున్న వర్షాలు మరో 24 గంటలలో భారీ నుండి అతిభారీ వర్షాలుగా మారే అవకాశం ఉన్నందున జిల్లా నుండి క్షేత్రస్తాయి వరకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ బి.గోపి అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశం నుండి ఆర్డీఓలు, తహసీల్దార్లు, మండల ప్రత్యేకాధికారులు, మున్సిపల్ కమీషనర్లు, ఇరిగేషన్, సంబంధిత శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ బి.గోపి టెలికాన్ఫరెన్స ద్వారా మండలాల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తు రానున్న 24 గంటల్లో భారీ నుండి అతి భారీ వర్షాలుగా మారే అవకాశం ఉన్నదని వాతావరణ శాఖ తెలియజేసినందున లోతట్టు ప్రాంతాలు, చెరువులు, కుంటలు, రోడ్ల నుండి వరదలు ప్రవేశించే చోట్లలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. లోతట్టు ప్రాంతాల్లో నివసించే వారిని వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలించడంతో పాటు వారికి భోజన ఏర్పాట్లను చేపట్టాలని సూచించారు. చెరువలు, కెనాల్ నీటిమట్టాన్ని ఎప్పటికప్పుడు పరిశీలించాలని, ఇప్పటి వరకు హుజురాబాద్ నియోజకవర్గంలో ఇల్లందకుంట, హుజురాబాద్, వీణవంక, శంకరపట్నం, రామడుగు చొప్పదండి మండలాలలో అత్యధికంగా వర్షాపాతం నమోదైందని, అక్కడి అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. మండల స్థాయి అధికారులు తమ మండల పర్యటించాలని అన్నారు. మండల ప్రత్యేకాధికారులు, మండల స్థాయి అధికారులతో సమన్వయమై క్షేత్రస్థాయిలో పర్యటిస్తు ఎప్పటికప్పుడు సమస్యలపై జాగ్రత్తచర్యలు తీసుకోవాలని సూచించారు. రెవెన్యూ పంచాయతీరాజ్ అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. గ్రామస్థాయి అధికారులు గ్రామాల్లోనే నైట్ హాల్ట్ చేయాలని, రానున్న 24 గంటల్లో భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అధికారులు అమ్రత్తంగా ఉండాలని, ఆరోగ్య శాక అధికారులు అప్రమత్తంగా నిర్వహించాలని, పంచాయతీరాజ్ శాఖ సానిటేషన్ కార్యక్రమాలను చేపట్టడానికి సిద్ధంగా ఉండాలని సూచించారు. ఇరిగేషన్ అధికారులు చెరువులలో వాటర్ లెవెల్ ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, చెరువుల గండ్లు పడితే వెంటనే చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అడీషనల్ కలెక్టర్ లక్ష్మీకిరణ్, ట్రైనీ కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో, మున్సిపల్ కమీషనర్ సేవా ఇస్లావత్, డిపిఓ వీరా బుచ్చయ్య, డిఆర్డిఏ శ్రీలత, డిఎస్ఓ సురేష్, డిఎంహెచ్ఓ లలితా దేవి, డిఐఓ అస్మత్ అలీ, బీసీ డబ్ల్యూఓ రాజ మనోహర్, డిఎండబ్ల్యూ మధుసూదన్, డిడి అడల్ట్ ఎడ్యుకేషన్ జయశంకర్, మున్సిపల్ ఎస్ఈ నాగమల్లేశ్వర్, ఏవో భగవత్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# రైతును రాజును చేయడమే బీజేపీ లక్ష్యం

<u>కరీంనగర్ టౌన్ ప్రభాతవార్త:</u>

బీజేపీ మోడీ ప్రభుత్వం రైతు సంక్షేమం, అభివృద్ధి కోసం ఎనలేని కృషి చేస్తుందని, రైతు సంక్షేమమే దేశ సంక్షేమమం, దేశ సంక్షేమమే బిజెపి లక్ష్యం అనే విధంగా రైతును రాజు చేయడమే లక్ష్యంగా మోడీ ప్రభుత్వం ముందుకు కొనసాగతుందని, ప్రధానమంత్రి కృషి సమృద్ధి కేంద్రాలతో రైతులకు ఎన్నో ప్రయోజనాలు చేకూరానున్నాయని బీజేపీ నేత, మాజీ శాసనసభ్యులు కటకం మృత్యుంజయం అన్నారు. పీఎం కిసాన్ సమృద్ధి కేంద్రాల ప్రారంభోత్సవ,ం ప్రధాని మోడీ సందేశం కార్యక్రమాలను గురువారం కరీంనగర్‌లోని వైశ్య భవన్‌లో ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించడానికి బీజేపీ కరీంనగర్ అసెంబ్లీ కన్వీనర్ దూబాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కటకం మృత్యుంజయం మాట్లాడుతూ.. ప్రధాని మోడీ రైతుల సంక్షేమం అభివృద్ధి కోసం నిరంతర ఆలోచన చేస్తున్నారని తెలిపారు. ప్రతి ఏటా వివిధ రకాల ఎరువుల కొరకు ఒక ఎకరాం పొలానికి ఒక రైతుకు కేంద్రం సబ్సిడీ రూ.18,632 అందిస్తుందని, పంట సహాయం కోసం ఏడాదికి ప్రతి రైతుకి రూ.6వేలు కిసాన్ సమ్మాన్ నిధి అందిస్తుందని, మొత్తానికి ఒక ఎకరానికి రూ.24,632 అందిస్తు రైతాంగాన్ని ఆర్థికంగా ఆదుకుంటుందన్నారు. కేంద్రం ఒక రైతుకి ఒక యూరియా పైన వచ్చే అసలు ధర రూ.2503 ఉంటే కేంద్ర సబ్సిడీ రూ.2236 భరిస్తుందని, రైతుకు ధర రూ.267కు లభిస్తుందన్నారు. అలాగే డిఎపిపైన ఒక రైతుకి వచ్చే అసలు ధర రూ.3771 ఉంటే కేంద్ర సబ్సిడీ రూ.2422 అందిస్తుందని,, రైతుకు ధర రూ.1350 లభిస్తుందన్నారు. రైతులందరూ ఈ విషయాలను గ్రహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ దూబల శ్రీనివాస్, మాజీ జిల్లా అధ్యక్షులు బాస సత్యనారాయణరావు, జానపట్ల స్వామి, ఎడమ సత్యనారాయణ, నరహరి లక్ష్మారెడ్డి, అవుదుర్తి శ్రీనివాస్, శ్రీధర్, చింతల



కిషన్, రమణ, నవీన్, మహిపాల్, శ్రీరాములు, ఐపిఎల్ నిఖిల్, క్రిబ్ కో ప్రేమతేజనాయుడు, కోరమండల్ రాజేష్, ఫ్యాక్ట్ రామకృష్ణ, వివిధ వ్యాపారుస్తులు రమేష్, రాజేందర్, రాంప్రసాద్, రవీందర్, రమణ, భూషణం, శ్రీనివాస్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ధర్మపురి వార్త

# నిధి ఆప్ కే నిఖత్ ద్వారా ప్రావిడెంట్ ఫండ్ ప్రయోనాలను వివరించిన పిఎఫ్ అధికారులు

<u>పెద్దపల్లి జిల్లా బ్యూరో, ప్రభాతవార్త.</u>



నిధి ఆప్ కే నిఖత్ (పిఎఫ్ మీ ముందుకు) కార్యక్రమాన్ని గురువారం పెద్దపల్లి చైతన్య జ్యోతి జిల్లా సమాక్య హాల్‌లో నిర్వహించడం జరిగిందని ప్రావిడెంట్ ఫండ్ జిల్లా నోడల్ అధికారి ఏనుగు మోహన్ రెడ్డి తెలిపారు. ప్రావిడెంట్ ఫండ్ వల్ల కలిగే ప్రయోజనాల గురించి, ప్రావిడెంట్ ఫండ్ అధికారులు అవగాహన కల్పించారు. సంఘటిత, అసంఘటిత రంగంలోని కార్మికులకు కలిగే బహుళ ప్రయోపజనాలు, ఈపిఎఫ్, కుటుంబ పెన్షన్ వలన కలిగే లాభాలు, అలాగే ఇన్సూరెన్స్, పెన్షన్స్ స్కీం 19995, హయ్యర్ వేజ్ పెన్షన్ బెనిఫిట్స్ పెన్షన్‌లో ఉన్నటువంటి వివిధ రకాల స్కీములు, నామినేషన్ లైఫ్ సర్టిఫికేట్, వివిధ సందేహాలకు నివృత్తి చేయడం జరిగింది. కార్యక్రమంలో కరీంనగర్ ప్రావిడెంట్ ఫండ్ కార్యాలయం నుంచి నోడల్ అధికారి పెద్దపల్లి జిల్లా ఏనుగు మోహన్ రెడ్డి, సెక్షన్ సూపర్ వైజర్ బి.రవి కుమార్, సీనియర్ అసిస్టెంట్ అనిల్ కుమార్ తదితరులున్నారు.

# ప్రజల రక్షణ, ప్రాణాల దృష్ట్యా సబ్బితం జలపాతం సందర్శన నిలిపివేత

<u>పెద్దపల్లి జిల్లా బ్యూరో, ప్రభాతవార్త.</u>



పెద్దపల్లి మండలంలోని సబ్బితం గ్రామంలో గల గౌరీ గుండాల జలపాతం సందర్శనకు ఎవరూ రావొద్దని పోలీసులు సూచించారు. ప్రత్యేక పోలీసు బందో బస్తు కూడా ఏర్పాటు చేఇస నిషేదాజ్ఞలు విధించిన కూడా పోలీసు వారి మాటలను పట్టించుకోకుండా తాత్కలిక ఆనందాల కోసం, కొందరు మాధ్యమాల్లో పోస్టుల కోసం, సేల్పీ మోజులో పడి, స్నేహితులతో సరదా కోసం యువత ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారని, సబ్బితం జలపాతం వద్ద బుధవారం కరీంనగర్‌కు చెందిన మానుపాటి వెంకటేష్ అనే యువకుడు మృతి చెందాడని, గతంలో కూడా ప్రమాదాలో చోటు చేసుకొని మృత్యువాత పడ్డారని, ప్రజల రక్షణ, ప్రాణాలను దృష్టిలో ఉంచుకొని సందర్శనను నిలిపివేసినట్లు పోలీసులు తెలిపారు. దీంతో వర్షాల దృష్ట్యా జలపాతం ఉధృతంగా ప్రవహిస్తుందని, పోలీసు చెక్ పోస్టు, పికెట్ ఏర్పాటు చేయడం జరిగిందని, యువకులు, ప్రజలు ఈ విషయాన్ని గమనించి పోలీసులకు సహకరించాలనికోరారు.

# అధికారులు అప్రమత్తంగా ఉండాలి

**- సమన్వయంతో లోతట్టు ప్రాంతాల ప్రజలను తరలించాలి**

**- జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ భాష**

**జగిత్యాల బ్యూరో,ప్రభాతవార్త :** జిల్లాలో కురుస్తున్న వర్షాల వలన ప్రాణ నష్టం వాటిల్లకుండా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ భాష అధికారులను ఆదేశించారు.గురువారం రోజున తన క్యాంపు కార్యాలయం నుండి జిల్లా,మండల అధికారులు,పోలీస్ అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,వాతావరణ శాఖ జిల్లాను రెడ్ అలెర్ట్‌గా ప్రకటించిందని,రానున్న 24 గంటలు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని,వర్షాలకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా అధికార యంత్రాంగం ముందస్తు ప్రణాళికలతో సమన్వయం ఉండి,లోతట్టు,నీటి పరివాహక ప్రాంతాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని అన్నారు.జిల్లాలో 6 మండల్లాలోని 30 గ్రామాలు గోదావరి పరివాహక ప్రాంతాల్లో ఉన్నందున,శ్రీరాంసాగర్ ప్రాజెక్టు గేట్లు ఎత్తివేయడం ద్వారా నీటి ప్రవాహం వలన సమస్యలు రావడం జరుగుతాయని,ఆ గ్రామాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలని అన్నారు.ప్రతి మండలంలో సహాయ పునరావస కేంద్రాలు ఏర్పాటు చేయాలని,ఆయా కేంద్రాలలో భోజనం,త్రాగునీరు,బ్లాంకెట్లు,మందులు,వైద్య సిబ్బంది,తదితర ఏర్పాట్లు చేయాలని అన్నారు.ఇప్పటికే 90 గ్రామాల్లోని 296 మందిని సహాయ పునరావాస కేంద్రాలకు తరలించడం జరిగిందని తెలిపారు.తక్కువ ఎత్తు గల బ్రిడ్జిలపై నుండి ప్రవహించే ప్రాంతాల్లో రవాణా ఆపివేసి,బారికెడ్స్ ఇరువైపుల ఏర్పాటుచేయాలని,ట్రాక్టర్లను అడ్డుగా కోట దూరంలో పెట్టాలని సూచించారు.జిల్లాలోని చెరువుల్లో నీటి పరిమాణాలను గుర్తించి ప్రమాద స్థాయిలో ఉన్నచెరువు ప్రాంతాల్లో ముందస్తు ఏర్పాట్లు చేయాలని అన్నారు.జిల్లాలో 1064 చెరువులకు గాను ఇప్పటి వరకు 877 చెరువులు సర్‌ప్లస్ నీరు చేరిందని తెలిపారు.సెల్ఫీలు తీసుకోకుండా చర్యలు తీసుకోవాలని,చేపలు పట్టకుండా వలలను తొలగించాలని జిల్లా మత్స్య శాఖ అదికారులకు ఆదేశించారు.ఎస్పీ భాస్కర్ మాట్లాడుతూ రానున్న 24 గంటల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని,అలాగే ఎస్సారెస్పీ ప్రాజెక్టు గేట్లు ఎత్తి వేసే అవకాశం ఉన్నందున గోదావరి పరివాహక ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేయాలని అన్నారు. రాత్రివేళల్లో నీటి ఉదృతి పెరగడం జరుగుతుందని,రాత్రి వేళల్లో విధులు నిర్వహించేందుకు టార్చ్‌లైట్, తాడు, జాకెట్, ఈతగాళ్లలను అందుబాటులో ఉంచుకోవాలని అన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 75 ప్రాంతాల్లో స్కీమ్ తెగిపోయాయని,ఆయా ప్రాంతాల్లో వాహనాలు, ప్రజలు తిరుగకుండా బారికెడ్స్ ఏర్పాటు చేసి,పోలీసులు గస్తీ ఏర్పాటు చేయడం జరిగాయని తెలిపారు.అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఎట్లాంటి సంఘటనలు జరుగకుండా ముందస్తు ఏర్పాట్లు చేయడం,ప్రజలను అప్రమత్తం చేయాలని అన్నారు.సెల్ఫీ తీసుకోకుండా ఆపివేయాలని,సహాయ పునరావాస కేంద్రాలు ఏర్పాటుచేసి,సౌకర్యాలు కల్పించాలని అన్నారు.అదనపు కలెక్టర్ బిఎస్ లత మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో వ్యవసాయ పనులకు ఎవరు కూడా వెళ్లకుండా గ్రామాల్లో టామ్‌టామ్ చేయాలని అన్నారు. ఇప్పటికే వెళ్లిన వారిని వెనక్కి పిలిపించాలని తెలిపారు.ఈ జూమ్ కాన్ఫరెన్స్‌లో ఆర్డీవోలు,జిల్లా,మండల అధికారులు పాల్గొన్నారు.



# వర్షంలో పోలాల గట్లపైన నడుస్తు పెద్దపల్లి జిల్లా కలెక్టర్

**- నదిలో చిక్కుకున్న వారిని కాపాడిన వైనం**



**మంథని - ప్రభాతవార్త** ఒకపక్క భారీవర్షం మరోపక్క మానేరు నదిలో చిక్కుకున్న 19 మంది కార్మికులు వారిని ఏలాగైన రక్షించాలనే తపనతో వివిద శాఖల అధికారులకు ఎప్పటికప ్పడు క్షేత్రస్తాయిలో పర్యవేక్షణ చేస్తూ ఆదేశాలు జారీచేస్తు ప్రమాదకర పరిస్థితుల్లో పోలాల గట్లపైన భారీవర్షంలో నడుస్తూ రెసూ ్క్య ఆపరేషన్ స్వయంగా నిర్వహించిన పెద్దపల్లి జిల్లా కలెక్టర్ ముజిమ్మిల్ ఖాన్‌ను గోపాల్‌పూర్ గ్రామ ప్రజలు అభినందిస్తున్నారు. గరువారం మంథని మండలం గోపాల్‌పూర్ మానేరు నదిలో19మంది కార్మికులు వరదనీటిలో ప్రమాదకర పరిస్థితుల్లో ఉండటంతో వారితో ఫోన్‌లో ఎప్పటికప్పుడు మాట్లాడుతూ దైర్యం చెపుతూ రెస్క్యూటీంను ఆప్రమత్తం చేస్తూ వర్షంలో దాదాపు 7గంటల పాటు పర్యవేక్షణ చేసి పోలాల గట్లు వర్షంలలో జారుతాయి అయినను ఒంటరిగా కలెక్టర్ ముందుకు వెలుతూ తీసుకున్న చర్యలను అదికారులతో పాటు ప్రజలు కలెక్ట ర్‌ను అభినందిస్తున్నారు.

# ఇన్‌టెక్ వెల్‌ను సందర్శించిన సింగరేణి డైరెక్టర్



**గోదావరిఖని, ప్రభాతవార్త:** సింగరేణి డైరెక్టర్ ఆపరేషన్స్ ఎన్‌వికె శ్రీనివాస్ ఆర్జీ 1 జిఎం చింతల శ్రీనివాస్‌తో కలిసి స్థానిక గోదావరి తీరం వద్ద ఉన్న ఇన్‌టెక్ వెల్‌ను, మేడిపల్లి ఓపెన్ కాస్టు క్వారీ, ఎం సాండ్ ప్లాంట్‌లను గురువారం సందర్శించారు. గత వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల వలన గోదావరి నదిలోకి వచ్చి చేరుతున్న నీటిని పరిశీలించారు. గోదావరిలోకి వచ్చిన నీటి లెవల్‌ను లెవల్ ఇండికేటర్ వద్ద పరిశీలించారు. వాటర్ లెవల్ ఎప్పటికప్పుడు రికార్డు చేస్తూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇన్‌టెక్ వెల్ వద్ద పంపింగ్ స్టేషన్‌ను పరిశీలించారు. గోదావరిఖని పలు సింరగేణి కాలనీలకు సరఫరా చేసే నీటి గురించి చర్చించారు. కార్యక్రమంలో ఏజంట్ బానోతు సైదులు, ఎజిఎం సివిల్ నవీన్, 1వ గని మెనేజర్ రమేష్ బాబు, సర్వే అధికారి ప్రభాకర్, డివైఎస్‌సి వసంత్ కుమార్, మేడిపల్లి ఓసి మెనేజర్ యాదవ్ తదితరులున్నారు.

# భారీ వర్షాల దృష్ట్యా అప్రమత్తం అయిన జిల్లా పోలీస్ యంత్రాంగం

**- లోతట్టు ప్రాంతలను పరిశీలిస్తున్న జిల్లా ఎస్పి అఖిల్ మహాజన్**

**సిరిసిల్ల టౌన్ ప్రభాతవార్త :** రాజన్న సిరిసిల్ల జిల్లలో భారీ వర్షాలు కురుస్తున్నందున జిల్లా ఎస్పి అఖిల్ మహాజన్ అదేశాల మేరకు జిల్లాలోని పోలీసులు అప్రమత్తం అయి ప్రజలందరిని సుర‌క్షింత ప్రాంతలకు తరలిస్తున్నారు. సిరిసిల్ల పట్టణంలోని అంభికనగర్, శాంతినగర్, వేంకంపేట, లోతట్టు ప్రాంతాలను జిల్లా ఎస్పి అఖిల్ మహాజన్ పరిశీలించారు.బోనాల చెరువు తెగిపోవడంతో జిల్లా పోలీస్ యంత్రంగం ప్రజలను సురక్షిత ప్రాంతలకు తరలించడం జరుగుతుంది.శుక్రవారం వర్ష ప్రభావం ఉండడంతో ఎప్పటికప్పుడు క్షేత్ర స్థాయిలో జిల్లా ఎస్పి పర్యవేక్షిస్తున్నారు.నర్మల ఎగువ మానేరు నీటి ఉదృతి ఎక్కువ స్థాయిలో ప్రవహిచడంతో ముస్తాబాద్ రాకపోకలు బంద్ చేశారు.హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు.12 మంది కూడిన జిల్లాలో డిఆర్‌ఎఫ్ 24గంటలు అందుబాటులో ఉంటుందని అన్నారు.విపత్కర సమయాల్లో సహాయం కోసం డయల్ 100 లేదా దగ్గరాలో ఉన్న పోలీస్ సమాచారం అందిస్తే తక్షణ సహాయక చర్యలు చేపడుతం అని అన్నారు.అత్యవసరం అయితే తప్ప బయటకు రావద్దని జిల్లా ఎస్పి సూచించారు.జిల్లా పోలీస్ యంత్రంగం 24గంటలు అందుబాటులో ఉండడం జరుగుతందని అన్నారు.



# భారీ వర్షంతోఅతలాకుతలమైన మంథని

**- మానేరునదిలో చిక్కుకున్న 16మంది కార్మికులు**

**- కలెక్టర్ పర్యవేక్షణలో కాపాడిన రెస్క్యూసిబ్బంది**



**మంథని - ప్రభాతవార్త:** గత మూడు రోజుల నుండి కురుస్తున్న భారీవర్షాలతో గురువారం గోదావరి, మానేరు నదులు ఉప్పొంగి ప్రమాదస్థాయిలో ప్రవహిస్తుండటంతో ముంపు ప్రాంతాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. మంథని మండలంలోని గోపాల్‌పూర్ మానేరు నదిలోని ఇసుక క్వారీలో పనిచేస్తున్న 16మంది కార్మికులు డ్రైవర్లు ఆకస్మాత్తుగా మానేరు నది ఉప్పొంగటంతో నదిలో చిక్కుకున్నారు. ఉదయం నుండి భారీ వర్షం కురుస్తుండటంతో ఇసుక క్వారీలో పనిచేస్తున్న కార్మికులు, సిబ ్బంది పట్టించుకోకుండా అక్కడేఉండటంతో ఒక్కసారిగా మానేరు నదిలో వరద రావటంతో వారు నదిమద్యలో చిక్కుకున్నారు. వారితో పాటు లారీలు, జెసిబిలు కూడ ఉండటంతో వారు వాటిని వదిలి రాలేకపోయారు, క్షణ క్షణం మానేరు నదిలో వరదపెరిగి పోతుండటంతో మానేరులో చిక్కుకున్న వారు గోపాల్‌పూర్ గ్రామస్థులకు ఫోన్‌ద్వార సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న గ్రామస్థులు పోలీసులకు రెవెన్యూ సిబ్బందికి సమాచారం అందించటంతో అధికారులు మానేరు నది వద్దకు చేరుకుని నదిలో చిక్కుకున్నవారిని రక్షించే ప్రయత్నం చేశారు. విషయం తెలుసుకున్న జడ్పీ చైర్మన్ పుట్ట మధు, సిఐ సతీష్‌తో కలసి నీటిలో చిక్కుకున్న వారిని రక్షించే ప్రయత ్నం చేయగా ఫలించలేదు. గంట గంటకు వరద ఉధృతి పెరుగుతుండటంతో విషయం జిల్లా కలెక్టర్, రాష్ట్ర ప్రభుతత్వానికి జడ్పీ చైర్మన్ పుట్ట మదు సమాచారం అందించటంతో వెంటనే జిల్లా కలెక్టర్ ముజుమ్మిల్ ఖాన్, పెద్దపల్లి డిసిపి వైభవ్‌గైక్వాడ్ గోపాల్‌పూర్ గ్రామానికి చేరుకుని పడవలను తెప్పించి దాదాపు 3గంటల పాటు శ్రమించి చిక్కుకున్న వారిని క్షేమంగా బయటకు తీసుకవచ్చారు. ఇదిలా ఉండగా నదిలో చిక్కుకున్న వారిలో ఒకరు ఈత కొడుతూ ఒడ్డుకు వచ్చే ప్రయత్నం చేయటంతో నది ప్రవాహానికి కొట్టుటకపోయాడు. వెంటనే అధికారులు అ ప్రమత్తమై అతనిని చిన్నఓదాల గ్రామశివారులో రక్షించారు. కాగా 16మంది క్షేమంగా బయటకు రావటం పట్ల గ్రామస్థులు,అదికారులు ఊపిరి పీల్చుకున్నారు. కార్మికులు క్షేమంగా బయటకు వచ్చినను క్వారికి సంబంధించిన జెసిబిలు, లారీలు నీటిలోనే ఉండిపోగా ఇసుకలోఏర్పాటు చేసుకున్న కంటైనర్లు వరద ప్రవాహంలో కొట్టుకపోయాయి. సకాలంలో అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించటంతో 16మంది ప్రాణాలతోబయటపడ్డారు. ఈ సందర్బంగా గోపాల్‌పూర్ గ్రామస్థులు ప్రజలు వారికి కృతజ్ఞ తలు తెలిపారు.



# మానేరు నదిలో చిక్కుకున్న 19మంది కార్మికులు సురక్షితం

**- పెద్దపల్లి జిల్లా కలెక్టర్ ముజిమ్మిల్ ఖాన్**

**మంథని - ప్రభాతవార్త:** భారీ వర్షాలతో వరద ప్రవాహంలో మానేరునదిలో చిక్కుకున్న 19మంది కార్మికులను సురక్షితంగా బయటకు తీసుకవచ్చినట్లు జిల్లా కలెక్టర్ ముజిమ్మిల్ ఖాన్ తెలిపారు. గురువారం మంథని మండలంలోని గోపాల్‌పూర్ గ్రామశివారులోని మానేరునది వద్ద ఉన్న ఇసుకక్వారీలో పనిచేస్తున్న వారు వరద ఉధృతి ఒక్కసారిగా ఎక్కువ కావటంతో 19మంది కార్మికులు బయటకు రాలేక మానేరులోనే చిక్కుకున్నారు. విషయం తెలుసుకున్న జిల్లా కలెక్టర్ సంఘటన స్థలానికి చేరుకుని రక్షణ సహాయక చర్యలను చేపట్టారు. మానేరులో చిక్కుకున్న వారిని క్షేమంగా బయటకు తీసుకవచ్చేందుకు నిర్వహించిన రెస్క్యూ ఆపరేషన్‌లో జిల్లా కలెక్టర్ జడీ ్పచైర్మన్ పుట్ట మధుతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేశారు. మంథని మున్సిపల్‌పరిధిలోని బోయినిపేటకు చెందిన మత్సకారులు గోదావరిఖని చెందిన గజ ఈతగాళ్లను రెండు పడవలతో ఫైర్ సిబ్బందితో కలిసి 7గంటల పాటు రెస్క్యూ ఆపరేషన్ నిర్వహించి క్వారీలో చిక్కుకున్న 19మంది ని సురక్షితంగా బయటకు తీసుకవచ్చారు. నదిలో కొట్టుకపోయిన వ్యక్తిని కూడ రక్షించి బయటకు తీసుకవచ్చారు. కాగా రెస్క్యూ నిర్వహించి 19మందిని బయటకు తీసుకవచ్చే విధంగా సహకరించిన పోలీస్, అగ్నిమాపక సిబ్బంది, రెవెన్యూశాఖ,మత్సకారులను కలెక్టర్ అభినందించారు. కాగా భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. ఈ రెస్క్ ్య ఆపరేషన్‌లో డిసిపి వైభవ్ గైక్వాడ్, మంథని ఆర్డీవో హనుమ, జడ్పీసీఈవో శ్రీనివాస్, ఎంపిడివో రమేష్, తాహసీల్దార్ గిరి, గోదావరిఖని ఏసిపి తుల శ్రీనివాస్, మంథని సిఐ సతీష్, సర్పంచ్ సునిత అధికారులు పాల్గొన్నారు.



## కురుస్తున్న ముసురు.. కూలుతున్న ఇల్లు

కోనరావుపేట,ప్రభాతవార్త

ఎడతెరపి లేకుండా కురుస్తున్న ముసురుకు ఇల్లు కూలిపోతున్నాయి. నిరాశ్రయాలవుతున్న అధికారులు ఆటువైపు కన్నెత్తి చూడడం లేదు. అపదలో రాని అధికారులు,పాలకులు తమ సమస్యలు ఎప్పుడు పట్టించుకుంటారని బాధితులు ఆవేధన వ్యక్తం చేస్తున్నారు. కోనరావుపేట మండలంలో పలు గ్రామాల్లో కురుస్తున్న ముసురుతో ఇల్లు కూలిపోయాయి. సుద్దాలలో హద్దునూరి రాజేశం, కనగర్తిలో అండెం లచ్చవ్వ, మరిమడ్ల గ్రామంలో మునిగంటి పద్మ, కడకుంట్ల నర్సయ్య, కటుకూరి మల్లవ్వ, అక్కనపల్లి మైసయ్య,ఇప్పపూల సుమన్‌ల ఇల్లు కూలిపోయాయి. మరికొందరి ప్రహారీ గోడలు కూలిపోగా, పాక్షికంగా ఇల్లు కూలిపోయాయి. దీంతో బాధితులంతా రోడ్డు పడే పరిస్థితి నెలకొంది. ఇదంతా అధికారులు సమచారం ఇచ్చినప్పటికి ఎవరు రాలేదని బాధితులు ఆవేధన వ్యక్తం చేస్తున్నారు. వానల వల్ల కూలిన ఇల్ల బాధితులకు ప్రభుత్వం పరిహారం అందించి, అదుకోవాలని కోరుతున్నారు.

## ఎడతెరిపిలేకుండా భారీవర్షం-ఇబ్బందుల్లో ప్రజలు

మానకొండూర్, ప్రభాతవార్త :

మండలంలో రెండురోజులుగా ఎడతెరిపిలేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు వరదనీటి ప్రవాహంతో మండలంలోని వివిధ గ్రామాలలో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. మానకొండూర్ మండలంలో బుధవారం రాత్రినుండి కురుస్తున్న భారీవర్షాలకు వరదనీటి ప్రవాహంతో వందల ఎకరాలలోని పంటపొలాలు నీట మునిగి రైతులకు చాల నష్టం చేకూరిందన్నారు. భారీవర్షం కారణంగా వరదనీరు ప్రవాహంతో మానకొండూర్ నుండి వేగురుపల్లి, రంగపేట నుండి వెల్దికి వెళ్లె రహదారులపై ఉన్నరోడ్డంపై మానకొండూర్ నుండి వీణవంక కు వెళ్లె ప్రధాన రహదారి అన్నారం రోడ్డంపై భారీగా నీరు ప్రవహించడంతో పలు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ఈదులగట్టపల్లి గ్రామచెరువు మత్తడి దూకడంతో గ్రామపంచాయితీ ఎదుట ఉన్న రహదారి అంతా నీటి ప్రవాహంతో వాహనదారులకు రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. కొండపల్కల 8వ వార్డు, ఊటూర్ గ్రామాలలో ఎస్సీ కాలనీలో వర్షం నీరంతా ఇండ్లలోకి చేరడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వేగురుపల్లి గ్రామంలో నీటిప్రవాహానికి రోడ్డు తెగిపోయి పంటపొలాలు నీటమునిగాయి. కరీంనగర్, వరంగల్ ప్రధాన రహదారి అయిన గట్టుదుద్దెనపల్లిలో భారీ చెట్లు విరిగిపడడంతో ప్రమాధం తప్పింది. ఖాదరగూడెంలో ఓ ఇల్లు కూలిపోయింది. మానకొండూర్ గ్రామచెరువుతో పాటు మండలంలోని గ్రామాలలోని చెరువులు, కుంటలు నిండి మత్తడి దూకుతున్నాయి. భారీ వర్షాలతో రాత్రివేళలో కరెంటు లేక చిమ్మ చీకట్లో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు చెరువులు, కుంటలు పూర్తిస్థాయిలో నీటితో నిండి ప్రమాదస్థాయికి చేరుకోవడంతో చెరువుకట్టలు ఎప్పుడు తెగుతుందేమోనని పలు గ్రామాల ప్రజలు ఆందోళనకు గురువుతున్నారు. భారీ వర్షాల కారణంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

### -జలదిగ్భంధంలో వెల్ది గ్రామం

మానకొండూర్ మండలంలో భారీ వర్షాలు కురవడంతో వరదనీటి ప్రవాహంతో మండలంలోని వెల్ది గ్రామం జలదిగ్భందంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రెండురోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు అన్నారం, రంగపేట గ్రామాల చెరువులు కుంటలు నీటితో నిండి మత్తడి దూకడంతో పంట పొలాలు, కాలువల ద్వారా వరదనీరు భారీగా ప్రవాహానికి లోతట్టు ప్రాంతమైన వెల్ది గ్రామానికి నీరు చేరడంతో మానకొండూర్ నుండి వేగురుపల్లి, రంగపేట నుండి వెల్ది వెళ్లె రహదారులపై ఉన్న మూడు చోట్ల రోడ్డంలపై భారీగా నీరు ప్రవాహంతో వెల్ది గ్రామప్రజలు ఎటు వెళ్లలేకుండా జలదిగ్భందంలో ఇరుక్కుపోయారు. గత కొన్నిఏళ్లుగా వర్షాకాలం ప్రతియేటా భారీ వర్షాలు కురిసినప్పుడల్లా వెల్ది గ్రామసమస్యలను ప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. గ్రామంలోని సమస్య పరిష్కారం కోసం వెల్ది నుండి రంగపేట, అలాగే వెల్ది నుండి లక్ష్మీపూర్, వెల్ది నుండి లింగాపూర్ గ్రామాలవైపు వెళ్లే రహదారిపై మూడుచోట్ల రోడ్డంలపై మినీ బ్రిడ్జీలను ఏర్పాటు చేస్తేనే సమస్య పరిష్కారం అవుతుందని గ్రామస్థులు అంటున్నారు. ప్రభుత్వ ప్రజాప్రతినిధులు స్పందించి గ్రామ ప్రజల సమస్య పరిష్కారం కోసం మూడుచోట్ల మినీ బ్రిడ్జి నిర్మాణానికి కృషి చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

## మత్స్యకారులు చేపలవేటకు వెళ్ళొద్దు

ఇనుగుర్తి, జూలై 27, ప్రభాతవార్త

గత నాలుగు రోజులగా కురిస్తున్న బారీ వర్షాల పద్దున్నందున ఎవ్వరు మత్స్య కారులు చేపలవేటకు వెళ్ళొద్దని నెల్లికుదురు ఎస్ఐ క్రాంతికిరణ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ....చిన్ననాగారం గ్రామంలో మత్తడి పోయడం వలన నెల్లికుదురు, కేసముద్రం ప్రధాన రహాదారి రాకపోకలు బంద్ అయ్యాయని, ప్రజలు గమనించి రోడ్డుపై ఉదృతి తగ్గేవరకు ప్రయాణాలు కానీ, మత్స్య కారులు చేపలవేటకు వెళ్ళొద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామసర్పంచ్ గాయపు జయపాల్‌రెడ్డి, ఏఎస్ఐ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## ఇండ్లలోకి వరద నీరు.. ఎస్సీ కాలనీ వాసుల ఇక్కట్లు

**-మామిడిపల్లిలో నీట మునిగిన ఇల్లు**

**-రోడ్డున పడ్డబాధితులు**

**-సహాయక చర్యలు చేపట్టని అధికారులు**

**-ఆందోళన వ్యక్తం చేసిన బాధితులు**

కోనరావుపేట,ప్రభాతవార్త



ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మూలవాగు నీరంతా వచ్చి ఇండ్లలోకి వచ్చి చేరింది. దీంతో బాధితులంతా రోడ్డు పడ్డారు. కోనరావుపేట మండలం మామిడిపల్లి గ్రామంలోని ఎస్సీ కాలనీలో దాదాపు 150 ఇండ్లలోకి వరద నీరు రావడంతో మహిళలు, పిల్లలంతా రోడ్డు పైకి వచ్చారు. వరద నీరుతో పాటుగా విష పురుగులు, పాములు కాలనీలోకి వచ్చాయని ఆవేధన వ్యక్తం చేశారు. తెల్లవారు జామున నుంచి ఇండ్లలోకి వరద నీరు రావడంతో రోడ్డు మీదకు వచ్చామని అధికారులకు,పాలకులు మొరపెట్టుకున్న ఒక్కరూ కూడా ఇటు వైపు రాలేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయాల్లో, ఇలాంటి ఘటనలు చోటు చేసుకున్న సందర్భాల్లో మాత్రమే మూలవాగు వెంట గోడను నిర్మిస్తామని హామీలు ఇచ్చి మరిచిపోతున్నారని ఆరోపించారు.ప్రతి వానకాలంలో తాము ఈ కాలనీలో బిక్కు బిక్కు మంటూ జీవిస్తున్నామని, ఇక్కడని సురక్షిత ప్రాంతంలో నివాసం ఏర్పాటు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని పలుమార్లు కోరిన పట్టించుకునే వారే కరువయ్యారని ఆందోళన వ్యక్తం చేశారు. దళితులం కావడంతోనే తమ పై అధికారులు,పాలకులు వివక్ష చూపుతున్నారని, వరద నీరుతో ఇబ్బందులు పడుతున్నామని తెలిసిన సహాయక చర్యలు చేపట్టడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు,పాలకులు స్పందించి, వరద నీరు ఇండ్లలోకి రాకుండా చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో సురక్షితమైనా ప్రాంతంలో తమ ఇండ్ల నిర్మాణం చేసి ఇవ్వాలనీ బాధితులు కోరుతున్నారు.

## పోలీస్ స్టేషన్,సర్కార్ దవాఖాన జలదిగ్భందం

**-వార్డు గదులోకి వచ్చిన చేరిన వదర నీరు**

**-సేష్టన్‌లోకి నీరు రావడంతో ఇబ్బంది పడ్డ సిబ్బంది**

కోనరావుపేట,ప్రభాతవార్త





కోనరావుపేట పోలీస్‌స్టేషన్‌తో పాటు సర్కారు దవాఖాన జలదిగ్భందంలో చిక్కుకున్నాయి. ఎడతేరిపి లేకుండా కురుస్తున్న వానలతో వరద నీరంతా వచ్చి దవాఖాన,పోలీస్‌స్టేషన్‌లోకి చేరింది. దీంతో స్టేషన్‌లో ఉన్న సిబ్బంది రాత్రంతా వరద నీరు రావడంతో ఇబ్బందులు పడ్డారు. అదేవిధంగా ఆరోగ్య కేంద్రంలోని గదులోకి నీరు రావడంతో రోగులకు వైద్య సేవలందించేందుకు అవస్థలు పడ్డారు. పోలీస్‌స్టేషన్ లైబ్రరీ సైతం జలదిగ్భందంలో చిక్కుంది. మండల కేంద్రానికి వచ్చే కల్వర్టుకు పోసిన మట్టింతా కొట్టుకుపోయింది. గ్రామంలోని వచ్చేందుకు రోడ్డంతా వరద నీరు పారడంతో చిన్నపాటి చెరువులను తలపించింది. మూలవాగు పరివాహక గ్రామాలన్నీ జలమయం కావడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. పంట పొలాలన్నీ చెరువులను తలపించాయి. చెరువులు,కుంటలు మత్తడులు దూకాయి. మూలవాగు ప్రాజెక్ట్ మత్తడి కింద ఉన్న వరద ఉదృతికి వంతెన పగుళ్లు ఏర్పడి ప్రమాదకరంగా మారింది. పలు గ్రామాల్లో ఇల్లు కూలిపోయాయి.

## చందుర్తి మండలంలో భారీ వర్షం

చందుర్తి, ప్రభాతవార్త.



బుధవారం నుంచి ఎడతెరపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు చందుర్తి మండలంలోని చెరువులు, కుంటలు పూర్తి స్థాయిలో నుంచి మత్తడి దూకాయి. మండలంలోని ప్రధాన చెరువైలన సనుగుల ఎర్ర చెరువు, పటేల్ చెరువు పూర్తి స్థాయిలో నిండటంతో మత్తడి దూకడంతో బండపల్లి ఊర చెరువు పూర్తిగా నిండిపోయింది. తద్వారా వర్షపు నీరు జోరుగా ప్రవహించడంతో బండపల్లి–బావుసాయిపేట రవాణా స్తంభించింది. అలాగే ఎన్గల్ గ్రామంలో బ్రిడ్జీపై నుంచి భారీగా నీరు ప్రవహించడంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. మండలంలోని రామన్నపేట చెరువు మత్తడి దూకడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. మూడపల్లి గ్రామంలో భారీ వర్షానికి కల్వర్టుపై నుంచ నీరు ప్రవహించడంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. జోగాపూర్, మర్రిగడ్డ గ్రామాల మధ్య ఉన్నలో లెవల్ వంతెనపై వరద నీరు ప్రవహిస్తుండటంతో జెసిబి సహాయంతో పైప్‌ల్లో పేరుపోయిన చెత్తా చెదారాన్ని స్థానికులు తొలగించారు. మర్రిగడ్డగ్రామంలో చెరువు వద్ద వర్షపు నీరు జోరుగా ప్రవహించడంతో రాకపోకలకు ఇబ్బంది ఎదురయ్యింది. ఎలాంటి ప్రమాదాలు జరగకుండా పోలీసులు బారీ కేడ్లను ఏర్పాటు చేశారు. సిఐ కిరణ్ కుమార్, ఎస్ఐ అశోక్, తహశీల్దార్ మజీద్, ఎంపిడిఓ రవీందర్‌లు గ్రామాల్లో పర్యటిస్తూ పరిస్థితిని సమీక్షించారు. గ్రామ సర్పంచ్‌లు ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నారు.

## నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

చందుర్తి, ప్రభాతవార్త.

భారీ వర్షాల వల్ల పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రాజన్న సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆది శ్రీనివాస్ అన్నారు. గురువారం చందుర్తి మండలం మల్యాల గ్రామంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ నియోజక వర్గంలో వరదల వల్ల వరి నాట్లు వేసిన పొలాలు దెబ్బతిన్న రైతులను గుర్తించి ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. గతంలో ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వకుండా రైతులను అనేక రకాలుగా మోసం చేసిందని గుర్తు చేశారు. ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా నెరవేర్చకుండా కాలయాపన చేస్తూ రైతులను అప్పుల ఊబిలోకి నెట్టేస్తున్న వైనాన్ని చూస్తే ఈ ప్రభుత్వం రైతుల పక్షపాతి కాదు... రైతులపై కక్ష సాధింపు చర్య అని చెప్పక తప్పదని అన్నారు. లక్ష రూపాయల రుణ మాఫీ చేస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చి ఇప్పటి వరకు హామీ నెరవేర్చకపోవడం బాధాకరమని అన్నారు. అకాల వర్షాలకు వడ్లు రాలిపోయి కాస్తో కోస్తో ధాన్యాన్ని అమ్ముకున్న రైతులకు రెండు నెలలు దాటిన ఇప్పటి వరకు పూర్తి స్థాయిలో డబ్బులు అందించడంలోనూ ప్రభుత్వం విఫలం అయ్యిందని అన్నారు. రైతు బంధు పైసలు కూడా సమయానికి రాకపోవడంతో పెట్టుబడి కోసం మళ్లీ అప్పులు చేసే పరిస్థితి నెలకొందని అన్నారు. నష్టపోయిన రైతులకు ఇస్తానన్న ఎకరాకి 10వేల రూపాయల నష్టపరిహారం వెంటనే విడుదల చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో జడ్పిటిసి నాగం కుమార్, మండల అధ్యక్షులు చింతపంటి రామస్వామి, నాయకులు సంటి ప్రసాద్, ఆవారి రమేష్, దేవ రాజం, తిరుపతి, కిషన్ తదితరులున్నారు.

## నియోజకవర్గం ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

మానకొండూర్, ప్రభాతవార్త :

ఎడతెరిపిలేకుండా రెండురోజులుగా కురుస్తున్న భారీ వర్షాలపట్ల మానకొండూర్ నియోజకవర్గం ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర సాంస్కృతిక సారధి చైర్మన్ మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్ అన్నారు. మానకొండూర్ చెరువుతోపాటు చెంజర్ల,నిజాయితీ గూడెం గ్రామాలలోని చెరువులు, కుంటలను గురువారం ఎమ్మెల్యే రసమయి పరిశీలించి ప్రజలతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నడూలేని విధంగా భారీ వర్షాలు కురుస్తున్నాయని, మరో రెండురోజులపాటు వర్షాలు ఉన్నాయని వాతావర ణశాఖ అధికారులు చెబుతున్నారని పేర్కొన్నారు. ప్రజలు అవసరమైతేనే బయటకు రావాలని, అనవసరంగా బయటకు వచ్చి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దన్నారు. శిధిలావస్థకు చేరిన ఇళ్లలోంచి తక్షణమే ఖాళీ చేసి సమీపంలో ఉన్న సురక్షిత ప్రాంతాలకు గాని, బంధువుల ఇళ్లకుగాని వెళ్లాలని, వర్షాలు తగ్గుముఖం పట్టే వరకు శిధిలావస్థకు చేరిన ఇళ్లలోకి రావోద్దని సూచించారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో ప్రాజెక్టులు, చెరువులు, మత్తళ్లు దూకుతున్నాయని, ప్రజలు వాగులు, ఒర్రెలు దాటే ప్రయత్నం చేయవద్దని మానకొండూర్ నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు అప్రమత్తంగా ఉండి ప్రజలకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ప్రజలకు ప్రభుత్వం అన్ని విధాలా సహాకారం అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ శేఖర్‌గౌడ్, సర్పంచ్ రోడ్డ పృథ్వీరాజ్, పిట్టల మధు, ఎరుకల శ్రీనివాస్‌గౌడ్, గడ్డి రేణుకగణేష్, మండల బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.